అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 1-3 -2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 62 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | 12 + 16 పేజీలు ధర : 5.00

డబుల్ దందా

రెండు పడకల ఇండ్ల పేరుతో ఇసుక లూటీ

- రాత్రిపూట అడ్డదారుల్లో ఇసుక లారీల దాటింపు
- హైదరాబాద్ సహా పలుజిల్లాలకు ఇసుక తరలింపు
- రాజన్నసిరిసిల్లలో అడుగంటుతున్న భూగర్భజలాలు

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం ఇసుక అంటూ లారీలకు బ్యానర్లు కట్టి రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి యథేచ్ఛగా ఇసుకను తరలించుకుపోతున్నారు. ప్రభుత్వ పథకాల పేరుతో 500 లారీలు తరలిపోతుంటే...అనధికారంగా 200కుపైగా ఇసుక లారీలు జిల్లా దాటిపోతున్నాయి. గతంలో మైనింగ్‌శాఖ ఆధ్వర్యంలో 10లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడితే.. ప్రస్తుతం తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ పరిధిలోకి వచ్చిన 40 రోజుల్లోనే 9లక్షలా 99వేల క్యూబిక్‌మీటర్లు తోడారు. క్షణం తీరిక లేకుండా సహజ సంపదను దోచేస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి.

వివరాలు 9లో



రాత్రిపూట ఇసుకను తరలిస్తున్న లారీలు

ఇక సెలవు..

- అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు
- ముగిసిన శ్రీదేవి అంత్యక్రియలు
- కడచూపు కోసం బారులు తీరిన అభిమానులు

వివరాలు 8లో





గుజరాత్‌లో దళిత యువకుడిపై దాడి

మీసాలు పెంచుకున్నాడని..

వివరాలు 2లో

చెప్పకుండానే పొత్తు లేదన్నారు

బీజేపీపై చంద్రబాబు విమర్శ

- ఏ పార్టీలోనూ విలీనం ఉండబోదని వ్యాఖ్య
- మాకు జూనియర్ ఎన్టీఆర్ కావాలంటూ నినాదాలు

వివరాలు 3లో



3,972 కోట్లు ఎగ్గొట్టాడు

16 బ్యాంకుల్ని ముంచిన శ్రీ లక్ష్మీ కొట్సిన్

- ఉత్తర్ ప్రదేశ్ కాన్పూరు కేంద్రంగా...

రోటామాక్ బాటలో... మరో సంస్థ

వివరాలు 2లో



(ఫైల్)

పాత రుణ ఖాతాను మూసేయటం కోసం కొత్త రుణాలిస్తూ..ప్రభుత్వ బ్యాంకులు చేతులుకాల్చుకుంటున్నాయి.యూపీలోని కాన్పూరు కేంద్రంగా పనిచేస్తున్న వస్త్రాల కంపెనీ 'శ్రీ లక్ష్మీ కొట్సిన్' 16 బ్యాంకులకు రూ.3,972కోట్ల రుణాల్ని ఎగనామంపెట్టింది. దివాలా ప్రకటించిన ఈ సంస్థను అమ్మేద్దామని బ్యాంకులు ప్రకటిస్తే సగం కూడా దక్కేట్టు లేదు.

పాతమేట్లను కొనసాగించాలి



హైదరాబాద్‌లో..

- సర్క్యులర్ 1786ను రద్దుచేయాలి
- పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్
- గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్ ముందు ధర్నా
- అసెంబ్లీలో పోరాడతా: సున్నం రాజయ్య
- వామపక్షాల పోరాట ఫలితమే ఉపాధి చట్టం:వెంకట్
- వందలాది మందితో ధర్నా
- పోలీసులతో తోపులాట, కమిషనర్‌తో వాగ్వాదం

వివరాలు 9లో

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు ప్రశాంతం
- 4,61,516 మంది హాజరు
- పలువురు విద్యార్థులు వెనక్కి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు బుధవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన సెకండ్ లాంగ్వేజ్ (తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ, అరబిక్, ఫ్రెంచ్, కన్నడ, మరాఠీ) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఒకేషనల్, జనరల్‌లో కలిపి 4,82,360 మంది దరఖాస్తు చేయగా, 4,61,516 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్ బుధవారం ఓ ప్రకటనలో



తెలిపారు. తొలిరోజు పరీక్షకు 20,844 (4.32 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. బుధవారం ముగ్గురిపై మాల్‌ప్రాక్టీస్ ..9లో


కార్తీ చిదంబరం అరెస్టు

- చెన్నై విమానాశ్రయంలోనే అదుపులోకి ..
- సీబీఐ ఢిల్లీ హెడ్‌క్వార్టర్‌లో విచారణ



చెన్నై: కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరాన్ని సీబీఐ అధికారులు బుధవారం అరెస్టు చేశారు. లండన్ నుంచి వస్తున్న ఆయనను చెన్నై విమానాశ్రయంలోనే అదుపులోకి తీసుకున్నారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో విచారణకు సహకరించడం లేదని ఆయనను సీబీఐ అదుపులోకి తీసుకుంది. అరెస్టు చేసిన వెంటనే కార్తీని ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయానికి తీసుకెళ్లి విచారణ ప్రారంభించినట్టు సమాచారం. ఈ కేసుకు సంబంధించి తమ వద్ద సాక్ష్యాధారాలు..9లో

అప్పుడు డార్విన్.. ఇప్పుడు న్యూటన్



- న్యూటన్ 'చలన సిద్ధాంతం' కన్నా ముందే మంత్రాల్లో : కేంద్ర మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇటీవల డార్విన్ సిద్ధాంతంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న ఆయన, తాజాగా న్యూటన్ సిద్ధాంతంపై వివాదాన్ని రేపారు. 'చలన సిద్ధాంతం' ఐజాక్ న్యూటన్ కనిపెట్టడానికి ముందే అది మంత్రాల్లో ఉన్నదని తెలిపారు. అందువల్ల సాంప్రదాయ జ్ఞానం మన ..9లో



మళ్లీ కృష్ణా జగడం

- కేటాయింపుల కన్నా అధికంగా ఏపీ నీటి వినియోగం
- 16.43 టీఎంసీలు తక్కువగా తెలంగాణ విడుదల

9



నాగార్జునసాగర్ డ్యామ్

నాగార్జునసాగర్ డ్యామ్ వద్ద ఉద్రిక్తత

- నీటి విడుదల విషయంపై ఇరు రాష్ట్రాల అధికారుల వాగ్వివాదం
- కుడి కాల్వకు నీటి విడుదల ఆపేసిన తెలంగాణ

నవతెలంగాణ-పెద్దవూర

నీటి విడుదల విషయంపై బుధవారం నాగార్జునసాగర్ డ్యామ్ వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. ఆంధ్రా, తెలంగాణ అధికారుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. కృష్ణా ట్రిబ్యునల్ ఆదేశాలానుసారం ఫిబ్రవరి 28 వరకు కుడి కాల్వకు 60 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉండగా, బుధవారంతో నీటి విడుదల పూర్తి కావడంతో తెలంగాణ అధికారులునిలిపేశారు. దీంతో ఆంధ్రా అధికారులు ఇంకా 0.235 టీఎంసీల నీరు ..9లో

పింఛన్ పాట్లు.. రోడ్డెక్కిన లబ్దిదారులు

- స్పీకర్ వాహనం అడ్డగింత
- వృద్ధురాలిపై చేయిచేసుకున్న బీపీఎం భార్య !

నవతెలంగాణ-గణపురం

ఆసరా పింఛన్ల కోసం వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పడరాని పాట్లు పడుతున్నారు. పోస్టుమాస్టర్ పింఛన్ల డబ్బులు ఇవ్వకపోవడంతో భూపాలపల్లి జిల్లా పరకాల-ములుగు ప్రధాన రహదారిపై బుధవారం బైటాయించారు. అదే సమయంలో స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ములుగు పోతుండగా కాన్వాయిని లబ్దిదారులు అడ్డుకున్నారు. దీంతో స్పీకర్ వాహనం దిగి పింఛన్‌దార్లతో కలిసి పోస్టాఫీస్‌కు వెళ్లి వివరాలు



తెలుసుకున్నారు. బ్యాంకుల్లో డబ్బుల కొరత తీవ్రంగా ఉందని స్పీకర్‌కు తెలపడంతో లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, పోస్టాఫీస్ సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. గణపురంలో ఈ సమస్య ..9లో

సీఎంను, మంత్రులను గ్రామాలకు రానివ్వం

రాజస్థాన్ బీజేపీ ప్రభుత్వంపై రైతు ఆగ్రహం

జైపూర్ : తమ సమస్యలను విన్నవించుకునేందుకు రాష్ట్ర రాజధాని జైపూర్‌లోకి కనీసం అడుగుకూడా పెట్టకుండా అడ్డుకున్న వసుంధర రాజే నేతృత్వంలోని బీజేపీ సర్కారుపై రాజస్థాన్ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమను అడ్డుకున్న ప్రభుత్వానికి అదే తరహాలో బుద్ధిచెప్పాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి వసుంధర రాజే, ఆమె మంత్రి వర్గ సహచరులను గ్రామాల్లో అడుగుపెట్టనివ్వబోమని రైతులు హెచ్చరించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 22న రాష్ట్ర అసెంబ్లీ ముట్టడికి రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. కాగా, జైపూర్‌లోకి అడుగుపెట్టనివ్వకుండా రైతులను దొరికినవారిని దొరికినట్టు అరెస్టులు చేశారు. రైతుల ఆందోళనలతో గత కొంతకాలంగా రాష్ట్రం అట్టుడుకుతున్నది. రైతు సంఘం నేత, సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే అమ్రారామ్ సహా పలు రైతు సంఘాల నేతలను పలుసార్లు అరెస్టులు కూడా చేశారు. రుణమాఫీ చేయాలని, పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

బీహార్‌లో ఎన్డీయే కూటమికి బీటలు

పాట్నా : బీహార్ మాజీ ముఖ్యమంత్రి, హిందుస్థానీ ఆవామ్ మోర్చా అధినేత జితిన్ రామ్ మాంఝీ నేషనల్ డెమోక్రటిక్ అలియెన్స్ (ఎన్డీయే)కు గుడ్‌బై చెప్పారు. బీహార్ 'మహా కూటమి'లో చేరనున్నట్టు తెలుస్తున్నది. కాగా, ఇందుకు సంబంధించి అధికారికంగా గురువారం ప్రకటించనున్నారు. 'మాంఝీ నా తల్లిదండ్రులకు చాలా పాత స్నేహితుడు. అతనికి మేం స్వాగతం పలుకుతున్నాం' అని ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ వ్యాఖ్యానించారు. లోక్‌సభ (అరారియా), రెండు అసెంబ్లీ స్థానాలకు (జహనాబాద్, భబువా) త్వరలో ఉప ఎన్నికలు జరుగనున్నాయి. కాగా, ఈ ఎన్నికల్లో జహనాబాద్ నియోజకవర్గం నుంచి తన కుమారుడిని ఎన్డీయే తరఫున పోటీలోకి దించాలని మాంఝీ ప్రయత్నించారు. ఆ స్థానంలో జేడీయూ తన అభ్యర్థిని ఇప్పటికే ఖరారుచేసింది. దీంతో మాంఝీ ఎన్డీయేకు గుడ్‌బై చెప్పారు. దీంతో మనస్తాపం చెందిన మాంఝీ.. ఏకంగా ఎన్డీఏ నుంచి బయటికొచ్చేశారు. మాంఝీ సన్నిహితుడు రాంచీ జైలులో ఉన్న లాలూను ఇటీవలే కలుసుకున్నారని, జహనాబాద్ టికెట్‌పై హామీ లభించిన తర్వాతే మహా కూటమిలో చేరే నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది.

సోషల్ మీడియాలో పోస్టులు

ఐఏఎస్ అధికారికి నోటీసులు

లక్నో: ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు చేసినందుకు గాను ఉత్తరప్రదేశ్‌లోని ఇద్దరు అధికారులకు యోగి ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. పోస్టులపై వెంటనే వివరణ ఇవ్వకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. వివరాల్లోకి వెళ్తే... విక్రమ్ సింగ్ బరేలి జిల్లాలో డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్నారు. ఈ యేడాది జనవరి 26న కాస్‌గంజ్‌లో జరిగిన అల్లర్లలో ఒక యువకుడు మరణించినప్పుడు.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయన ఫేస్‌బుక్‌లో పోస్టులు చేశారు. ఈ పోస్ట్‌లు వైరల్ అయ్యాయి. అలాగే అమేథి జిల్లా సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ అశోక్ శుక్లా.. ప్రభుత్వంపై చేసిన కామెంట్లపైనా ప్రభుత్వం వివ రణ కోరింది. ఇద్దరు అధికారులు వెంటనే వివరణ ఇవ్వాలని.. వివరణ 'సంతృప్తికరంగా' లేని పక్షంలో ఇరువురిపై విచారణకు ఆదేశిస్తామని హెచ్చరించింది.

తీస్తా సెతల్వాద్‌కు ఏబీవీపీ బెదిరింపులు

వారణాసి: మానవహక్కుల కార్యకర్త, ప్రముఖ జర్నలిస్ట్ తీస్తా సెతల్వాద్ హాజరవ్వాల్సిన మీడియా వర్క్ షాప్‌నకు ఏబీవీపీ విద్యార్థులు భంగం కలిగించారు. అంతటితో ఆగకుండా సెతల్వాద్‌తో పాటు కార్యక్రమాన్ని తలపెట్టిన విద్యార్థులను వారు బెదిరించారు. సాక్షాత్తు ప్రధాని మోడీ నియోజకవర్గమైన వారణాసిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఉండే మహాత్మాగాంధీ కాశీ విద్యాపీఠ్(ఎంజీకేవీపీ)లో మంగళవారం జరిగే సమావేశానికి ముందు ఏబీవీపీ విద్యార్థులు అక్కడకు చేరుకొని కార్యక్రమానికి భంగం కలిగించి నానా హంగామా సృష్టించారు.

3,972 కోట్లు ఎగ్గొట్టాడు



లక్నో : యూపీలోని కాన్పూరు కేంద్రంగా మరో బ్యాంకు రుణ ఎగవేత మోసం బయటపడింది. ఇక్కడి వస్త్రాల కంపెనీ 'శ్రీ లక్ష్మీ కొట్సిన్ లిమిటెడ్' 16 బ్యాంకులకు రూ.3,972కోట్ల మేర రుణాలు ఎగవేసింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన సెంట్రల్ బ్యాంకుతో పాటు పలు బ్యాంకుల వద్ద నుంచి ఈ కంపెనీ గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎంపీ అగర్వాల్ పెద్ద మొత్తంలో రుణాల్ని తీసుకున్నారు. కానీ వాటిని తిరిగి చెల్లించకుండా వదిలేశారు. దీంతో రంగంలోకి దిగిన బ్యాంకు అధికారులు రుణాలను రికవరీ చేసుకునేందుకు సదరు కంపెనీకి చెందిన ఆస్తులు వేలం వేసేందుకు చర్యలు తీసుకున్నారు.

బ్యాంకింగ్ రంగంలోనే పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) రూ.11,300కోట్ల కుంభకోణం సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాంకింగ్ రంగంలో పలు మోసాలు, రుణ ఎగవేతలు బయటపడటం మొదలైంది. కొద్ది రోజుల క్రితం ఇదే కాన్పూరు నగరానికి చెందిన రోటామాక్ పెన్నుల కంపెనీ అధినేత విక్రమ్ కొఠారి రూ.3,695కోట్ల మేర రుణాలను ఎగవేసిన కేసు బయటపడింది. ఇప్పుడు ఇదే విధంగా శ్రీ లక్ష్మీ కొట్సిన్ కంపెనీ బాగోతం బయటకొచ్చింది.

శ్రీ లక్ష్మీ కొట్సిన్ కంపెనీ ఇప్పటికే రూ.1646కోట్ల మేర నష్టాల్లో ఉన్నట్టు తెలుస్తోంది. బ్యాంకుల వద్ద నుంచి లాంగ్ టర్మ్ రుణాల కింద రూ.2,406కోట్లు తీసుకోగా.. షార్ట్ టర్మ్ రుణాల కింద మరో రూ.937కోట్లు తీసుకున్నట్టు సమాచారం. బ్యాలెన్స్ షీట్ ప్రకారం ఆ కంపెనీ ఆస్తుల విలువ రూ.1,495కోట్లు మాత్రమే ఉన్నాయి. సదరు కంపెనీ తీసుకున్న రుణాలు రాబట్టుకునేందుకు బ్యాంకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ఇప్పటిదాకా పలు బ్యాంకుల్లో ఆ కంపెనీ చేసిన డిపాజిట్లు కేవలం రూ.2కోట్లా 54లక్షల మాత్రమే. వస్త్ర తయారీ, ఆటోమొబైల్ బ్లాస్ట్ ప్రూఫ్ తయారీ...అన్నవి కంపెనీ ప్రధాన వ్యాపారాలు. ఏడాదికి వీటిద్వారా వస్తున్న ఆదాయం రూ.311 కోట్లు ఉన్నట్టు తెలుస్తోంది.

నీరవ్ మోడీ, 'రోటామాక్' విక్రమ్ కొఠారి మాదిరిగానే...పాత రుణాల్ని తీర్చకుండానే, బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో కొత్త రుణాల్ని 'శ్రీ లక్ష్మీ కొట్సిన్ లిమిటెడ్' యజమాని ఎంపీ.అగర్వాల్ పొందారు. చివరికి అది కొండంతైంది. తమ రుణాల్ని తీర్చాలని బ్యాంకులు అడిగితే...చేతులెత్తేశాడు. దివాలా తీసినట్టు ప్రకటించాడు. చివరికి పరిస్థితి ఎలా తయారైందంటే, మూతబడ్డ నాలుగు యూనిట్లను అనేక ప్రయత్నాల మీద అమ్మితే...వచ్చినమొత్తాన్ని రుణ వసూలు కింద బ్యాంకులు జమకట్టుకున్నాయి. పరిస్థితి గ్రహించిన బ్యాంకులు కేసును 'నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్'కు బదిలీ చేసి, చేతులు దులుపుకున్నారు.

లీడ్ బ్యాంక్ 'సెంట్రల్ బ్యాంక్'

'శ్రీ లక్ష్మీ కొట్సిన్ లిమిటెడ్' సంస్థకు మొత్తం 16 బ్యాంకుల కన్సార్టియం సుమారుగా రూ.4వేల కోట్లను రుణాలుగా అందజేశాయి. కన్సార్టియంలో లీడ్ బ్యాంక్‌గా కాన్పూర్ 'సెంట్రల్ బ్యాంక్' వ్యవహరిస్తోంది. కన్సార్టియంలోని ఇతర బ్యాంకులు ఇవి..సిండికేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, కెనరాబ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఎస్‌బీఐ, ఎగ్జిమ్ బ్యాంక్, ఓబీసీ బ్యాంక్, ఐడీబీఐ, విజయా బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్, సారస్వత్ బ్యాంక్, ఆంధ్రాబ్యాంక్, ఎడిల్‌వైస్ ఎస్టేట్.



తొమ్మిదేండ్ల బాలికపై లైంగికదాడి

న్యూఢిల్లీ: మదరసాలో అరబిక్ నేర్చుకోవడానికి వచ్చిన తొమ్మిదేండ్ల బాలికపై గురువే లైంగికదాడికి పాల్పడ్డ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన ఢిల్లీలోని నరేలాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... ఢిల్లీలోని మదరసాలో జకీర్ అలామ్ (67) కొన్నేండ్లుగా అరబిక్ భాషను నేర్పుతున్నాడు. భాష నేర్చుకోవడానికి వచ్చిన ఓ బాలికపై ఇటీవల లైంగికదాడికి పాల్పడ్డాడు. అంతేగాక ఈ విషయాన్ని ఎవ్వరికీ చెప్పవద్దని బెదిరించాడు. అమ్మాయి అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లడంతో విషయం వెలుగులోకి వచ్చింది. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు జకీర్‌ను అరెస్టు చేశారు.

పెద్దనోట్ల రద్దుపై గోప్యతా..?

వివరణ ఇవ్వాలని పీఎంఓకు సమాచార కమిషన్ ఆదేశం

న్యూఢిల్లీ: 2016, నవంబరు 8వ తేదీన ప్రకటించిన పెద్దనోట్ల రద్దు కార్యక్రమం చుట్టూ చోటుచేసుకున్న పరిణామాలపై దాపరికం ఎందుకని ప్రధానమంత్రి కార్యాలయాన్ని కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) ప్రశ్నించింది. సమాచార హక్కు చట్టం కింద దాఖలు చేసిన ప్రశ్నకు సమాధానాన్ని తిరస్కరించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కొంత సమాచారాన్ని వెల్లడిస్తే... దేశ ఆర్థిక ప్రయోజనాలపై ప్రతికూల ప్రభావం ఎలా చూపుతుందో వివరణ ఇవ్వాలని సీఐసీ కోరింది. పెద్ద నోట్ల రద్దు జరిగిన వారం రోజులకు అంటే 2016 నవంబరు 15న దూరదర్శన్‌లో ప్రధాని చేసిన ప్రసంగం పూర్తి పాఠం కాపీ కావాలని, నోట్ల రద్దుకు దారితీసిన పరిస్థితులను తెలియచేయాలని కోరింది. ఈ ప్రశ్నలకు సెంట్రల్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారి (సీపీఐఓ) ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందని ఖైన్ ఏప్రిల్ 13న సీఐసీని ఆశ్రయించారు. రూ. 500, రూ. 1000 రూపాయల నోట్ల రద్దుకు ప్రధాని ఆమోదం పొందిన సర్టిఫైడ్ కాపీని అందించాలని సీఐసీ ముందు జరిగిన విచారణలో పీఎంఓను ఖైన్ కోరారు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా చట్టం, 1934 సెక్షన్ 24 కింద కొత్తగా ప్రవేశపెట్టిన రూ. 2,0000 నోట్ల సిరీస్ వివరాలను కూడా ఇవ్వాల్సిందిగా కోరారు. పాత నోట్లు రద్దు కాకముందే... కొంతమంది వ్యక్తులకు కొత్త రూ. 2,000 నోట్లు చేరాయనీ, దీనిపై ఆర్‌బీఐ విచారణ చేపట్టాలని ఆయన కోరారు.

రాజన్ బాధ్యతల్లోనే ఉండగా... కొత్త నోట్లపై పటేల్ సంతకం ఎలా వచ్చింది?

ఈ కొత్త నోట్లపై ప్రస్తుత ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ సంతకం ఎందనీ, వీటి ముద్రణ ప్రారంభమైన సమయంలో ఆర్‌బీఐ గవర్నర్ బాధ్యతల్లో రఘురామ్ రాజన్ విధుల్లో ఉన్నారని ఖైన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఖైన్ అడిగిన ప్రశ్నలకు పీఎంఓ (ఆర్‌టీఐ) కార్యదర్శి పర్వేన్ కుమార్ సమాధానం ఇస్తూ ఫిర్యాదుదారు అడిగిన కొన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం 'దేశా ఆర్థిక ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుంది' అని విచారణ సందర్భంగా సీఐసీకి తెలిపారు. ఆర్‌టీఐ చట్టం సెక్షన్ 8 (1) కింద ఆయన ప్రశ్నలకు సమాధానాన్ని మినహాయించబడిందని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న సీఐసీ మాథుర్ వాటికి సమాధానాలు ఇస్తే దేశ ఆర్థిక ప్రయోజనాలకు ఏ విధంగా నష్టదాయకమో వివరణ ఇవ్వాల్సిందిగా పీఎంఓను ఆదేశించారు.

ఈ సమ్మర్ హాట్ గురూ..

- అప్పుడే ముదురుతున్న ఎండలు : ఐఎండీ

న్యూఢిల్లీ : ఫిబ్రవరిలోనే దేశవ్యాప్తంగా ఎండ తాకిడి పెరిగిపోయింది. పలు నగరాల్లో వేడిగాలులు కూడా మొదలయ్యాయి. దీనిని బట్టి ఈ ఏడాది వేసవికాలంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తాజాగా పేర్కొంది. దేశవ్యాప్తంగా ఇప్పటికే పలు చోట్ల ఉష్ణోగ్రతలు పెరిగాయని, ఎండాకాలం ముందే వచ్చేసిందని, గతంలో కన్నా తీవ్రంగా ఈసారి ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని ఐఎండీ అంచనా వేస్తోంది. ఫిబ్రవరి 28నాటికి ఉండాల్సిన సగటు ఉష్ణోగ్రతలకన్నా 2–5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా నమోదైందని, ముందు ముందు అధిక



వేడి పంట దిగుబడులపై, ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఐఎండీ బుధవారం ఒక ప్రకటన చేసింది.

గుజరాత్‌లో దళిత యువకుడిపై దాడి

అహ్మదాబాద్: గుజరాత్‌లో మరో కులవివక్ష ఘటన వెలుగులోకి వచ్చింది. మీసాలు పెంచుకున్నాడనే కారణంతో ఓ దళిత యువకుడిని నిర్దాక్షిణ్యంగా చితకబాదిన ఘటన గత శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... రాష్ట్రంలోని సబర్కాంత జిల్లాలోని గోరల్ గ్రామంలో అల్పేశ్ పాండ్య అనే యువకుడు తన స్నేహితుడితో కలిసి బైక్‌పై వెళ్తున్న క్రమంలో ఠాకూర్ వర్గానికి చెందిన కొందరు యువకులు వారిని అడ్డగించి కర్రలు, ఐరన్ రాడ్‌లతో దాడి చేశారు. మీసాలు ఎందుకు పెంచుకున్నావంటూ ప్రశ్నించారు. వారి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించగా అతన్ని లాగి పడేసి బలవంతంగా రేజర్‌తో మీసాలు తొలగించారు. తనపై జరిగిన దాడిపై పాండ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన తల్లిదండ్రులపై కూడా దాడి చేశారని, దళితుడిని కావడం వల్లే వారు తనని కొట్టారని పాండ్యా ఫిర్యాదులో పేర్కొన్నట్టుగా పోలీసులు వెల్లడించారు. అట్రాసిటి చట్టం కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు 8 మంది నిందుతులను అరెస్టు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ సౌరభ్ సింగ్ తెలిపారు.

అంతర్జాతీయం



ప్రపంచంలోనే అతిపెద్ద విమానం స్ట్రాటోలాంచ్

లండన్ : మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ సన్నిహితుడు పాల్ ఆలిన్ ప్రపంచంలోనే అతిపెద్ద విమానమైన స్ట్రాటోలాంచ్‌ను ఆవిష్కరించారు. ఈ విమానం రెక్కలు 385 అడుగులు ఉన్నాయి. రెక్కల పొడవు దాదాపు ఓ ఫుట్‌బాల్ మైదానానికి సమానం. స్ట్రాటోలాంచ్‌కు ఆరు ఇంజిన్లు (దాదాపు 4వేల కిలోలు) ఉన్నాయి. అంతరిక్షంలో రాకెట్‌లను ప్రయోగించేందుకు స్ట్రాటోలాంచ్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆలిన్ తెలిపారు. గంటకు 74కిలోమీటర్ల వేగంతో స్ట్రాటోలాంచ్ టెస్ట్ రైడ్ బుధవారం నిర్వహించారు.

బ్రిటన్ మహిళకు జీవితఖైదు

- ఆస్ట్రేలియా సుప్రీంకోర్టు

లండన్ : ఓ ఆస్ట్రేలియా యువకుడిని అతిదారుణంగా హత్య చేసిన కేసులో బ్రిటన్ మహిళను ఆస్ట్రేలియా సుప్రీంకోర్టు దోషిగా తేల్చింది. ఈ కేసులో ఆమెకు జీవితఖైదు విధించినట్టు న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. హత్యలో ఆమెకు సహకరించిన స్నేహితురాలికి కూడా ఇదే శిక్ష ఖరారు చేశారు. ప్రాసిక్యూషన్ వెల్లడించిన వివరాల ప్రకారం...ఆస్ట్రేలియాలోని పెర్త్ నగరంలో 2016, జూన్13న ఆరన్ పాజిక్(18) అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. బ్రిటన్‌కు చెందిన జెమ్మా లిల్లీ (26) అనే మహిళ పెర్త్ నగరంలో ఆరన్‌ను కత్తితో పొడిచి చంపింది. ట్రూడీ లెనాన్ అనే మరో మహిళ ఈ హత్యకు సహకరించింది. ఆమెపై మోపిన అభియోగాలు కూడా ధ్రువీకరించబడ్డాయి. న్యాయస్థానం లిల్లీతో పాటు ట్రూడీకు కూడా జీవిత ఖైదు విధించింది. లిల్లీపై హారర్ సినిమాల, పుస్తకాల ప్రభావం ఉన్నట్టు విచారణ సమయంలో అంగీకరించిందని ప్రాసిక్యూటర్ జేమ్స్ మెక్ టాగర్ట్ తెలిపారు.

అల్జీరియా చేరుకున్న ఎర్డోగన్

అల్జీర్స్: టర్కీ అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్ అల్జీరియాలో పర్యటించారు. ఆ దేశ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ బౌటెఫ్లికాతో ద్వైపాక్షిక సంబంధాలతో సహా వివిధ అంశాలపై చర్చించారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం పెంపుదలకు అనువైన మార్గాలను అన్వేషించటంతో పాటు సిరియా సంక్షోభం వంటి ఉమ్మడి ప్రయోజనాలున్న ఇతర అంశాలపై కూడా ఇరువురు నేతలూ చర్చించినట్టు స్థానిక మీడియా సంస్థలు పేర్కొన్నాయి. ఈ పర్యటనలో భాగంగా జరిగిన అల్జీరియన్–టర్కిష్ బిజినెస్ ఫోరమ్ సదస్సులో ఆయన అల్జీరియా ప్రధాని అహ్మద్ ఓయాహియాతో కలిసి హాజరయ్యారు. ఈ పర్యటనలో ఇరుదేశాల మధ్య ఏడు భాగస్వామ్య ఒప్పందాలు కుదిరాయని, విద్యుత్, ఉన్నత విద్య, దౌత్యం, సాంస్కృతిక, పర్యాటక, వ్యవసాయ రంగాలలో సహకారానికి సంబంధించి అవగాహనా పత్రాలపై సంతకాలు జరిగాయని మీడియా తన కథనాలలో పేర్కొంది. టర్కీ అధ్యక్షుడిగా ఎర్డోగన్ అల్జీరియాలో పర్యటించడం ఇది రెండోసారి కావడం గమనార్హం.

ఈజిప్టులో రెండు రైళ్లు ఢీ

15 మంది మృతి

కైరో : ఈజిప్టులో రెండు ప్యాసింజర్ రైళ్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో 15 మంది మృతి చెందారు. మరో 19 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... కోమ్ హమదా రైల్వే స్టేషన్‌కు సమీపంలో బుధవారం రెండు ప్యాసింజర్ రైళ్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో 15 మంది ప్రయాణికులు మృతి చెందారు. సమాచారం అందుకున్న అంబులెన్స్‌లు ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.



అమెరికా సైనిక స్థావరంలో కవర్ కలకలం

11 మందికి అస్వస్థత

వాషింగ్టన్: వర్జీనియా సైనిక స్థావరంలో ఓ కవర్ కలకలం రేపింది. దాన్ని తెరవడంతో 11 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో ముగ్గురిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అస్వస్థతకు గురైన వారిలో 9 మంది మెరైనర్లు ఉన్నారు. ఆర్లింగ్టన్‌లోని ఫోర్ట్ మైర్ హెండర్సన్ హాల్‌లో ఆ ఎన్వెలప్‌ను తెరవగా అందులోని గుర్తుతెలియని పదార్థం వల్ల అక్కడున్న వారు ఉన్నట్టుండి అస్వస్థతకు గురయ్యారు. చేతులు, ముఖంపై దురద వచ్చిందని, ముక్కులో నుంచి రక్తం వచ్చిందని ఓ మెరైన్ అధికారి చెప్పినట్లు ఎన్‌బీసీ న్యూస్ వెల్లడించింది. వెంటనే అధికారులు ఆ భవనాన్ని ఖాళీ చేయించారు.

సైనిక స్థావరంలోని మెరైన్ హెడ్‌క్వార్టర్స్ చిరునామాతో ఆ లెటర్ వచ్చిందని అధికారులు తెలిపారు. ఆ కవర్‌ను అక్కడి నుంచి తొలగించామని చెప్పారు. నావల్ క్రిమినల్ ఇన్వెస్టిగేటివ్ సర్వీస్, ఎఫ్‌బీఐ ఘటనపై దర్యాప్తు ప్రారంభించాయని అధికారులు వెల్లడించారు. ఫోర్ట్ మైర్ స్థావరం ఆర్మీ, మెరైన్ కాప్స్ నియంత్రణలో ఉంటుంది. ఇక్కడ 'ఓల్డ్ గార్డ్'గా పిలిచే మూడో ఇన్‌ఫాంట్రీ రెజిమెంట్ ఉంటుంది. వీరు అధ్యక్షుడికి ఎస్కార్ట్‌గా వెళ్లడం, అధికారిక వేడుకల్లో పాల్గొనడం, వాషింగ్టన్‌కు భద్రత కల్పించడం చేస్తుంటారు.



కొద్ది రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోడలు వానెస్సా ట్రంప్ కూడా ఇలాగే అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. తన భర్త జూనియర్ ట్రంప్ పేరు మీద వచ్చిన పార్సిల్ తెరవడంతో అందులోని గుర్తుతెలియని తెల్లటి పౌడర్ ఆమెపై పడడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. అయితే ఆ పౌడర్ వల్ల ప్రమాదమేమీ లేదని తర్వాత అధికారులు స్పష్టంచేశారు.

లైంగిక వేధింపుల ఫిర్యాదునకు ఐరాసలో హెల్ప్‌లైన్



గ్యూటర్స్

న్యూయార్క్ : మహిళా ఉద్యోగుల భద్రతకు కట్టుబడి ఉన్నట్టు ఐరాస ప్రకటించింది. దీనిలో భాగంగా ఐరాసలో పనిచేస్తున్న మహిళలు సైతం లైంగిక వేధింపులకు గురవుతున్నట్టు ఫిర్యాదులు అందినట్టు పేర్కొన్నది. వీటి నివారణ కోసం 24 గంటల హెల్ప్‌లైన్ నెంబర్‌ను ఏర్పాటు చేసినట్టు ప్రకటించింది. పని ప్రదేశంలో వారు ఎదుర్కొన్న లైంగిక వేధింపుల గురించి గోప్యంగా చెప్పుకొనేలా ఈ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్టు ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గ్యూటర్స్ వెల్లడించారు. ఆ హెల్ప్‌లైన్ ద్వారా ఉద్యోగులు వారికి కలిగిన అసౌకర్యం, వేధింపులు, కష్టాన్ని వివరిస్తే.. వారికి సరైన న్యాయం చేయడంతో పాటు వారికి సరైన భద్రతను కల్పించి మద్దతుగా నిలుస్తామని గ్యూటర్ తెలిపారు. ఐరాస నిఘా సంస్థ ఆఫీస్ ఆఫ్ ఇంటర్నల్ ఓవర్‌సైట్ సర్వీసెస్.. ఆయా ఫిర్యాదులకు సంబంధించిన కేసులను దర్యాప్తు చేస్తుందని అన్నారు. అందుకుగానూ ఓ ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కాగా, ఇప్పటికే ఆ హెల్ప్‌లైన్ అందుబాటులోకి వచ్చిందని ఐరాస ప్రతినిధి స్టెఫానే డుజారిక్ తెలిపారు.

అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థల జాబితాలో ఏడు గ్రూపులు

వాషింగ్టన్: అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థల జాబితాలో ఏడు గ్రూపులను చేర్చినట్టు అమెరికా విదేశాంగ శాఖ పేర్కొన్నది. ఈ గ్రూపులకు చెందిన ఇద్దరు వ్యక్తులను అంత ర్జాతీయ ఉగ్రవాదులుగా గుర్తించినట్టు తెలిపింది. ఈ ఏడు గ్రూపుల్లో మూడు గ్రూపులు ఐఎస్–పశ్చిమ ఆఫ్రికా, ఐఎస్–ఫిలిప్పైన్స్, ఐఎస్–బంగ్లాదేశ్‌లను విదేశీ తీవ్రవాద సంస్థ (ఎఫ్‌టిఓ)లుగా పేర్కొంది. ఈ సంస్థలతో అమెరికా పౌరులెవరూ ఎటువంటి కార్యకలాపాలను నిర్వహించ రాదు. అమెరికా పరిధిలోని వాటి ఆస్తులను, ఇతర ప్రయోజ నాలను కూడా నిషేధించారు. ఈ సంస్థలకు ఏ రకమైన తోడ్పాటు నందించినా లేదా వనరులను సమకూర్చినా అది తెలిసిచేసినా, చేయడానికి ప్రయత్నించినా కూడా నేరంగానే పరిగణిస్తారు.

అంతరిక్షం నుంచి భూమికి...

సురక్షితంగా దిగిన వ్యోమగాములు

కజకిస్థాన్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్)లో పనిచేసిన ముగ్గురు వ్యోమగాములు తిరిగి భూమిపైకి సురక్షితంగా చేరుకున్నారు. అమెరికాకు చెందిన ఇద్దరు, రష్యాకు చెందిన ఓ వ్యోమగామి ఈరోజు ఉదయం కజకిస్థాన్‌లో ల్యాండ్ అయ్యారు. రష్యాకు చెందిన అలెగ్జాండర్ మిసర్కిన్, అమెరికాలోని నాసా వ్యోమగాములు మార్క్ వాండే, జోయ్ అకాబా ఐదు నెలల పాటు ఐఎస్–ఎస్‌లో పనిచేసి కిందకు వచ్చారు. ముగ్గురు వ్యోమగాములు భూమిపైకి ల్యాండ్ అయ్యే ఆపరేషన్ ప్రణాళిక ప్రకారం పూర్తయిందని, ముగ్గురు



సురక్షితంగా ఉన్నారని రష్యా స్పేస్ ఏజెన్సీ వెల్లడించింది.

40ఏండ్ల మిసర్కిన్ నిన్న ఐఎస్‌ఎస్ కమాండ్ పదవిని ఆంటోన్ షకప్లెరోవ్‌కు అప్ప గించారు. మిస్కరిన్ రెండు మిషన్లలో 334 రోజులు అంతరిక్షంలో ఉన్నారు. 50ఏండ్ల జోయ్ అకాబా మూడు మిషన్లలో కలిపి పది నెలలు అంతరిక్షంలో ఉన్నారు. మరో వ్యోమగామి మార్క్ వాండే తొలిసారి అంతరిక్షంలో ఉండి వచ్చారు.

ట్రంప్ అల్లుడికి షాక్..!

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్లుడు జేర్డ్ కష్నర్‌కు గట్టి షాక్ తగిలింది. ఆయన టాప్ లెవల్ సెక్యూరిటీ క్లియరెన్స్‌లో విఫలమయ్యారు. అంటే అమెరికాకు చెందిన అత్యంత కీలకమైన రహస్య సమాచారాలను తెలుసుకునే అనుమతి ఉండదు. ట్రంప్ కుమార్తె ఇవాంక ట్రంప్ భర్త కుష్నర్. 37ఏండ్ల కుష్నర్ ట్రంప్ యంత్రాంగంలో కీలక వ్యక్తిగా పనిచేస్తున్నారు. ట్రంప్‌కు సలహాదారుగా వ్యవహరిస్తున్నారు. అయితే, కుష్నర్ ఉన్నత స్థాయి సెక్యూరిటీ క్లియరెన్స్‌లో విఫలమవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఆయన 'టాప్ సీక్రెట్/సెన్సిటివ్ కంపార్ట్‌మెంటెడ్ ఇన్ఫర్మేషన్' తెలుసుకునే అవకాశం కోల్పోయారని సంబంధిత వర్గాలు చెప్తున్నాయి. కానీ వైట్‌హౌస్ గానీ, అధ్యక్షుడు ట్రంప్ గానీ దీనిపై స్పందించలేదు.

కుష్నర్ ఉన్నత స్థాయి భద్రతపరమైన క్లియరెన్స్‌లో విఫలమవ్వడం అందరికీ పలు అనుమానాలు కలిగిస్తోంది. వైట్‌హౌస్‌లో ఏం జరుగుతుందోనని అనుకుంటున్నారు. కుష్నర్ మధ్య ప్రాచ్యంలో శాంతి నెలకొల్పేందుకు చర్చలు జరుపుతున్నారు. ఇజ్రాయెల్, పాలస్తీనాల మధ్య రాజీ కుదిర్చేందుకు ప్రయత్నిస్తున్న



వారిలో కుష్మర్ ముఖ్యమైన వారు. అయితే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వైట్‌హౌస్ పర్యటనకు వచ్చిన కొద్ది రోజుల్లోనే కుష్నర్ విషయంలో ఇలాంటి నిర్ణయం తీసుకోవడం గమనార్హం. అయితే ఈ మార్పు వల్ల కుష్నర్ పదవిపై ఎలాంటి ప్రభావం పడదని అధికారులు చెప్పినట్టు తెలుస్తోంది. ట్రంప్ యంత్రాంగంలోని ప్రముఖ సహాయకుడు రాబ్ పోర్టర్ పూర్తి సెక్యూరిటీ క్లియరెన్స్ లేకుండానే కొన్ని నెలల పాటు పనిచేయడంతో వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జాన్ కెల్లీ క్లియరెన్స్ సిస్టమ్‌లో మార్పులు చేయాలని ఆదేశించారు. ఇటీవల దక్షిణ కొరియాకు వెళ్లిన ఇవాంక ఆ దేశ అధ్యక్షుడు మూన్ జే ఇన్‌తో ఉత్తర కొరియాపై తాజా ఆంక్షల గురించి మాట్లాడారట. దీంతో ఇవాంక ట్రంప్ సెక్యూరిటీ క్లియరెన్స్ కూడా ప్రశ్నార్థకంగానే ఉందని సమాచారం.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థ



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

- ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించిన కమిషన్

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చట్ట పరమైన అధికారాలు వినియోగించుకునే శక్తివంతమైన స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థ అని తెలంగాణ ఉపముఖ్య మంత్రి కడియం శ్రీహరి అన్నారు. రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్‌గా డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ సభ్యులుగా నర్సింహా, రాంబాల్ నాయక్, కె.లీలా దేవి, ఎస్ దేవయ్య, విద్యాసాగర్ ప్రమాణ స్వీకారం బుధవారం జరిగింది. ముఖ్య అతిధిగా కడియం వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష, ప్రభుత్వానికి సలహాలు 1958, 1989 సంవత్సరాలలోని సిఐఎ, సిసిఆర్ అట్రాసిటీ చట్టాల అమలుపై విచారణ వంటి అంశాలను పరిశీలించే అధికారం కమిషన్‌కు ఉందని ఆయన తెలిపారు. ఒక్కోసారి అట్రాసిటీ కేసుల్లో సివిల్ సర్వీస్ అధికారులను కూడా విచారించే విస్తృతాధికారాలు కమిషన్‌కు ఉన్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ నిమిత్తం ప్రత్యేక అభివృద్ధి నిధిని కేటాయించిందని ఆ నిధులను సవ్యంగా వినియోగించుకోవాల్సిన బాధ్యత కమిషన్‌పై ఉందన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అంకిత భావంతో పని చేసిన ప్రతివారిని గుర్తించి గౌరవించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమంలో ఏ నిబద్ధతతో పనిచేసారో ఇప్పుడు అదే నిబద్ధతతో పనిచేస్తారని తాను ఆశిస్తున్నానని హరీశ్ అన్నారు. కష్టపడి పనిచేసేవాళ్లకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని కొనియాడారు. రాజకీయాల కోసం కాదని, ప్రజల కోసమే పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ ఎస్సీ,ఎస్టీ కమిషన్ ఉన్నదనే భరోసా కల్పించాలన్నారు. డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస యాదవ్, నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్, పార్లమెంటు సభ్యులు గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బీసీ కమిషన్ చెర్మెన్ బిఎస్ రాములు తదితరులు పాల్గొన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఉన్న సమర్థవంతంగా పనిచేయించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అంబర్‌పేట నియోజక వర్గం, టీఆర్ఎస్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్, జె.డి రాహుల్, సతీష్, రాము, నవీన్, సుధా, చిన్నా, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

చెప్పకుండానే పొత్తు లేదన్నారు

- బీజేపీపై చంద్రబాబు విమర్శ : ఏ పార్టీలోనూ విలీనం ఉండబోదని వ్యాఖ్య


మాట్లాడుతున్న ఏపీ సీఎం చంద్రబాబు

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

2014 ఎన్నికల సమయంలో బీజేపీతో పెట్టుకున్నాం. మనం ఇరవై సీట్లు గెలిచాం. ఆ సందర్భంగా ఒక ఎమ్మెల్సీని కూడా గెలిపించుకున్నాం. తరువాత వచ్చిన రాజకీయ పరిణామాల్లో మనకు చెప్పకుండానే బీజేపీ తెలుగుదేశం పార్టీతో పొత్తు లేదని వాళ్లే ప్రకటించారు. రెండు పార్టీలు పొత్తు పెట్టుకున్నప్పుడు ఏది చేసినా చెప్పి చేయాలి. కానీ బీజేపీ అలా చేయలేదు. మనతో చెప్పకుండానే పొత్తు లేదని ప్రకటించిందని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌భవన్‌లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, పొలిట్‌బ్యూరో సభ్యులతో భేటిఅయ్యారు. అనంతరం సాధారణ సమావేశంలోనూ మాట్లాడారు. దీనికి పార్టీ అధ్యక్షులు ఎల్.రమణ అధ్యక్షత వహించారు. తెలంగాణలో టీడీపీ బలోపేతంపై చర్చించారు. ఈసందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ తెలంగాణలో ఉన్న పార్టీ నేతలు, కార్యకర్తలు నాకెప్పుడు గుర్తుంటారు. ఎన్నో త్యాగాలు చేశారు. ఎన్నో విధాలుగా పోరాటాలు చేశారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా, తెలంగాణలో తీవ్రవాద సమస్యతో కుటుంబ సభ్యులు చనిపోయినా పార్టీని వదిలిపెట్టలేదు. రాజకీయ కక్షలో చాలావరకూ పార్టీ కార్యకర్తల్ని, నాయకుల్ని వేధింపులకు గురిచేసినా, మా ఆస్తులు పోయినా పరవాలేదని, కార్యకర్తలందరూ తెలుగుదేశం పార్టీ జెండా మోశారు. కొంతమంది నాయకులు పోయారు. కానీ కార్యకర్తలు పార్టీని నమ్ముకుని ఉన్నారు. అందుకని నేను ఒకటే చెబుతున్నా. నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉంటే తెలుగుదేశం పార్టీని తప్పకుండా ఆదరిస్తారు. మళ్లీ పాత రోజులు వస్తాయి. అప్పుడే పార్టీకి భవిష్యత్తు ఉంటుందని గతంలోనే టీటీడీపీ అధ్యక్షులు రమణకి చెప్పాను. రాజకీయాలు మారుతూ ఉంటాయి. ఆ విషయం గుర్తు పెట్టుకోవాలని సూచించారు. 35 సంవత్సరాలుగా నమ్ముకున్న కార్యకర్తల్ని కాపాడే బాధ్యత నాపై ఉంది. అదే సమయంలో తెలుగువారి కోసం పెట్టిన పార్టీని రెండు ప్రాంతాల్లో కాపాడుకోవాలి. అందుకే నేను ఎక్కడా రాజీపడలేదు. అయితే పని ఒత్తిడి వల్ల నేను ఎక్కువగా రాలేకపోతున్నా. భవిష్యత్తులో తగిన సమయంలో తగిన నిర్ణయాలు తీసుకుంటానని చాలా సమావేశాల్లో చెప్పా అని అన్నారు. నేను అసెంబ్లీకి ఎంపికై 40 ఏండ్లు పూర్తయిందన్నారు. నా సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నానని చెప్పారు. పార్టీని స్థాపించిన మహానాయకుడు ఎన్టీఆర్ స్ఫూర్తి మన దగ్గర ఉన్నంత వరకు మనకు ఎదురులేదన్నారు. క్రమశిక్షణ ,అంకిత భావంతో పనిచేస్తే విజయం మనతో ఉంటుందని అభిప్రాయపడ్డారు.

మాకు జూనియర్ ఎన్టీఆర్ కావాలి
బాబు సమక్షంలోనే నినాదాలు

తెలంగాణ టీడీపీ బాధ్యతలు జూనియర్ ఎన్టీఆర్‌కి అప్పగించాలని చంద్రబాబు ఎదుటే ఆ పార్టీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో చంద్రబాబు భేటీ ఆయిన సందర్భంగా ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కార్యకర్తలు ప్లకార్డుల ప్రదర్శన, నినాదాలతో సమావేశం దద్దరిల్లింది. టీఆర్ఎస్‌లో టీడీపీని విలీనం చేస్తే ఆత్మహత్య చేసుకుంటామని కార్యకర్తలు నినాదాలు చేశారు. తెలంగాణలో బీజేపీతో పాటు టీఆర్ఎస్‌తో కూడా పొత్తు వద్దని చంద్రబాబును కోరారు. దీంతో నినాదాలు చేస్తున్న కార్యకర్తలను సముదాయిస్తూ చంద్రబాబు తన ప్రసంగాన్ని కొనసాగించారు. తెలుగుదేశం పార్టీ తెలంగాణలో ఎల్లకాలం ఉంటుందని చెప్పారు. పార్టీని విలీనం చేసే హక్కు ఎవరికీ లేదని వ్యాఖ్యానించారు. కార్యకర్తల అభిప్రాయం మేరకే పొత్తులు ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నామా నాగేశ్వర్‌రావు, ఎంపీ గరికపాటి మోహన్ రావు, జాతీయ ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, జాతీయ నాయకులు ఇ.పెద్దిరెడ్డి, అరవింద్‌కుమార్‌గౌడ్, దయాకర్‌రెడ్డి ఉపాధ్యక్షులు ఎం.అమర్‌నాథ్‌బాబు, ప్రధానకార్యదర్శి బండ్రు శోభారాణి, జి.బుచ్చిలింగం, బి.మల్లయ్యయాదవ్ పాల్గొన్నారు.

మోత్కుపల్లి గైర్హాజరు

పొలిట్‌బ్యూరో సభ్యులు మోత్కుపల్లి నర్సింహులు చంద్రబాబుతో జరిగిన సమావేశానికి గైర్హాజరయ్యారు. అసలు ఆయనకు ఆహ్వానం పంపలేదని, కొందరు పంపినా ఆయన రాలేదని మరికొందరు అభిప్రాయపడ్డారు. టీడీపీని టీఆర్ఎస్‌లో విలీనం చేయాలని పార్టీ నాయకత్వం ఆగ్రహానికి గురైన సంగతి తెలిసిందే. ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని పార్టీ చెప్పినా, ఆ మేరకు నర్సింహులు వ్యవహరించకపోవడంతో ఆయన్ను ఈ సమావేశానికి ఆహ్వానించలేదని తెలిసింది.

జీవో 14 ప్రకారం వేతనాలివ్వాలని
15 నుంచి సమ్మె

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

మున్సిపల్ కార్మికులకు జీవో నెంబర్ 14 ప్రకారం వేతనాలను అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మిక సంఘాలు సమ్మె బాట పడుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వేతనాల అమలుకు జీవో విడుదల చేయనందుకు నిరసనగా ఈనెల 15 నుంచి సమ్మె చేస్తున్నట్టు ప్రకటించాయి. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్‌ను బుధవారం తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పాలడుగు భాస్కర్ (సీఐటీయూ), ఏసురత్నం (ఏఐటీయూసీ), వనమాల కృష్ణ (ఐఎఫ్‌టీయూ) కలిసి నోటీసు ఇచ్చారు. అనంతరం ఓ ప్రకటన విడు దల చేశారు. 2016, ఫిబ్రవరి 19న విడుదలైన జీవో నెంబర్ 14 ప్రకారం మున్సిపాల్టీల్లో పనిచేస్తున్న కార్మికులకు కేటగిరీల వారీగా వేత నాలు నిర్ణయించారని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు రూ.12 వేలు, డ్రైవర్లకు రూ.15 వేలు, బిల్ కలెక్టర్, జూనియర్ అసిస్టెంట్లకు రూ.17,500 వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. జీవో నెంబర్ 14 విడు దలై 24 నెలలు గడుస్తున్నా నేటికీ అమలు కావడం లేదని తెలిపారు. ఆ జీవో వర్తింపచేయాలని 2017, ఆగస్టు 3న రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసు ఇచ్చామని పేర్కొన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌తో నాలుగు దఫాలుగా చర్చలు జరిగాయని తెలిపారు. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు జీవో నెంబర్ 14 ప్రకారం వేతనాలు అమలు చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చినా వేతనాల పెంపు జీవో విడుదల కాలేదని తెలిపారు. అనివార్య పరిస్థితుల్లో తిరిగి పోరాటంలోకి వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. జిల్లాల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాల పెంపు కోసం సమ్మెతోసహా అన్ని రకాల ఆందోళనలకూ పూనుకోవాలని తెలిపారు. జీవో నెంబర్ 14 ప్రకారం వేతనాలను కేటగిరీల వారీగా అమలు చేసేందుకు కొత్త జీవో విడుదల చేయాలని కోరుతూ ఈనెల 15,16,17 తేదీల్లో మూడురోజులపాటు సమ్మె చేయనున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వ స్పందనను బట్టి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని, అవసరమైతే నిరవధిక సమ్మెకు వెనుకాడబోమని తెలిపారు.

నారాయణ స్కూల్స్ జయకేతనం

- హోమిబాబా ఒలింపియాడ్స్‌లో సత్తాచాటిన విద్యార్థులు


Gutta Sindhuja, Chukka Tanuja, Varanasi Sai Tej, Challa Yashwanth Reddy, Adarsh Reddy Madhur, V V Sai Keerthan

హైదరాబాద్: హోమిబాబా ఒలింపియాడ్స్‌లో నారాయణ స్కూల్స్ విద్యార్థులు సత్తా చాటారు. హోమిబాబా ఒలింపియాడ్‌లో విద్యార్థులు విజయం సాధించడం గర్వకారణమని విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్. పి. సింధూర నారాయణ బుధవారం తెలిపారు. హోమిబాబా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్ జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఇండియన్ నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్ (ఐఎన్ఎంఓ) రెండో దశ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి స్కూల్ స్థాయిలో వి. వి. సాయికీర్తన ఒక్కరే ఎంపికయ్యారన్నారు. అలాగే ఇండియన్ నేషనల్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్ రెండో దశ ఫలితాల్లో సి. యశ్వంత్‌రెడ్డి, జి.సింధుజ, సి.హెచ్. తనూజ రెండు తెలుగు రాష్ట్రాల్లో టాప్ మార్కులు సాధించారని తెలిపారు. ఇండియన్ నేషనల్ ఆస్ట్రానమీ ఒలింపియాడ్‌లోనూ వి. సాయితేజ, యం. ఆదర్శ్‌రెడ్డి ఉత్తమ మార్కులు సాధించారన్నారు. కాగా వీరంతా ముంబయిలో జరిగే ఓరియంటేషన్ కం సెలక్షన్ క్యాంపునకు హాజరవుతారని తెలిపారు. ఘనవిజయం సాధించిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. పునిత్ ప్రత్యేకంగా అభినందించారు.

ఆటోలో తరలిస్తున్న రూ.12 లక్షల పట్టివేత

నవతెలంగాణ–సుల్తాన్‌బజార్



అక్రమంగా తరలిస్తున్న రూ.12 లక్షల నగదును హైదరాబాద్‌లోని సుల్తాన్‌బజార్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. సుల్తాన్‌బజార్ ఏసీపీ చక్రవర్తి వివరాల ప్రకారం కర్మన్‌ఘాట్‌కు చెందిన ప్రకాశ్ నిమ్మెల్లి అడ్డ నుంచి బేగంబజార్‌కు ఆటోలో గోనెసంచిలో మూట కట్టి డబ్బులు తరలిస్తున్నాడు. కోఠి మెడికల్ కళాశాల బస్టాప్ దగ్గర వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆసిఫ్‌నగర్ ఎస్ఐ వెంకటేశ్వర్లుకు ఆటోలో గోనెసంచి కనిపించింది. దానిని విప్పి చూడగా రూ.12 లక్షలు (10 రూపాయల నోట్ల కట్టాలు) ఉన్నాయి. ప్రకాశ్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రాజు, ట్రాఫిక్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై సీఎం సమీక్షలు పూర్తి..

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

బడ్జెట్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్షలు పూర్తయ్యాయి. సీఎం క్యాంపు కార్యాలయంలో గత పదిహేను రోజులుగా ఆయన ఈ రివ్యూలు నిర్వహించారు. ముఖ్యమైన రెవెన్యూ, పంచాయతీరాజ్, పురపాలక, పట్టణాభివృద్ధి, రోడ్లు, భవనాల శాఖల కేటాయింపులపై ఆయన శనివారం సమీక్షించారు. అనంతరం బడ్జెట్ పద్దుకు ఆయన ఆమోదం తెలిపినట్టు అధికారిక వర్గాలు తెలిపాయి. మరోవైపు హోళి సందర్భంగా ప్రభుత్వం గురువారం సెలవుదినంగా ప్రకటించిన ప్పటికీ ఆర్థికశాఖ అధికారులు మాత్రం విధులకు హాజరు కావాలం టూ ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్రంలో 20 గ్రామాలను దత్తత

మాతా అమృతానందమయి వెల్లడి

- హరీశ్‌రావుకు ఆశీర్వాదం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి



రాష్ట్రంలో 20 గ్రామాలను దత్తత తీసుకుని వాటి అభివృద్ధి కోసం కృషి చేస్తామని మాతా అమృతానందమయి తెలిపారు. సికింద్రాబాద్‌లోని మఠంలో నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు బుధవారం ఆమెను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా అమృతానందమయి మాట్లాడుతూ అందరికీ మంచి వైద్యం అందించటానికి, పరిశుభ్రమైన వాతావరణంలో అందరూ జీవించటానికి తమ మఠం కృషి చేస్తున్నదని తెలిపారు. భారత దేశ యాత్రలో భాగంగా అమృతానందమయి తెలంగాణలో పర్యటిస్తున్నారు. రాష్ట్రంలో నిర్మిస్తున్న కాళేశ్వరం, పాలమూరు తదితర ప్రాజెక్టుల గురించి, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునర్నిర్మాణం గురించి హరీశ్‌రావు ఆమెకు వివరించారు. రైతుల ఆత్మహత్యల నివారణ కోసం కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తున్నది తెలిపారు. ఈ కార్యక్రమాల పట్ల అమృతానందమయి హర్షం వ్యక్తం చేశారని మంత్రి కార్యాలయం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మాత చూపిస్తున్న ప్రేమ మానవ జాతికి మంచి సందేశమని హరీశ్‌రావు అన్నారు. ఒత్తిడిని జయించటానికి శాంతి, సహనం అవసరమన్నారు.

త్వరలో ఎమ్మెల్యేల భవనాల ప్రారంభం

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని శాసనసభ్యుల కాలనీలోని బహుళ అంతస్తుల భవనాలను ఈ నెలలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు రోడ్లు భవనాలశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రూ.166 కోట్ల అంచనా వ్యయంతో మూడెకరాల స్థలంలో ఒక్కొక్కటి 2,500 చదరపు అడుగుల వైశాల్యంతో 120 క్వార్టర్ల నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఇందులో క్లబ్ హౌస్, స్విమ్మింగ్‌పూల్, సిబ్బంది క్వార్టర్లు, వాణిజ్య సముదాయం వంటి ఆధునిక హంగులను సమకూర్చుతున్నారు.

జెమ్స్ పరిశ్రమలో ఉద్యోగభద్రత కల్పించాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సీఐటీయూ వినతి

నవతెలంగాణ బ్యూరో– హైదరాబాద్

రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం మండలం రావిరాల గ్రామంలోని సెజ్‌లో ఉన్న హైదరాబాద్ జెమ్స్ పరిశ్రమలోని కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో సీఐటీయూ రాష్ట్ర రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, ఎం సాయిబాబు, రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...2006లో హైదరాబాద్ జెమ్స్ పరిశ్రమ ఏర్పడిందనీ, దీని నిర్మాణానికి ప్రభుత్వం 171ఎకరాల భూమి, విద్యుత్ మౌలిక సదుపాయాలతో పాటు అనేక రాయితీలిచ్చిందని చెప్పారు. ప్రస్తుతం పరిశ్రమలో 700 మంది కార్మికులు పనిచేస్తున్నారనీ, వీరిలో 200లకు పైగా మంది వికలాంగులున్నాయని తెలిపారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు–నీరవ్‌మోడీకి సంబంధించిన రూ.11,400కోట్ల కుంభకోణం నేపథ్యంలో జెమ్స్ పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని చెప్పారు. ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఆదాయపన్ను శాఖ అధికారులు పరిశ్రమలోని ఆస్తులను విచారించి, సీజ్ చేశారని తెలిపారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని, ఈ పరిశ్రమలోని ఉత్పత్తిని కొనసాగిస్తూ, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

గ్రూప్-2 పరీక్షలపై హైకోర్టు కీలక ప్రకటన

- ఐదువేల మంది ఓఎంఆర్ షీట్లను పరిశీలిస్తామని ఆదేశాలు
- ముగ్గురు సీనియర్ల లాయర్లతో కమిటీ



నవతెలంగాణ–హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర సర్కార్ నిర్వహించిన గ్రూప్–2 పరీక్షల్లో వైట్‌నర్, బబ్లింగ్ వినియోగంపై ఆరోపణలు వచ్చిన దష్ట్యా ఆ పరీక్షల్లో అగ్రస్థానంలోని అయిదు వేల మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను పరిశీలిస్తామని హైకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. ఇందుకోసం ముగ్గురు సీనియర్ లాయర్లతో కమిటీని ఏర్పాటు చేస్తూ బుధవారం హైకోర్టు న్యాయమూర్తి పి.నవీన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ వచ్చే నెల 19కి వాయిదా వేశారు. ఓఎంఆర్ షీట్లలో తప్పులున్నా, కొట్టివేతలున్నా, వైట్‌నర్ వాడినా, కిందివైపున పేర్లు రాసిన వారిని అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన చరణ్‌దాస్ గోస్వామి మరో 20 మంది, రామచంద్రారెడ్డి మరో 14 మంది పలు వ్యాజ్యాలను దాఖలు చేశారు. ఇదే సమయంలో వైట్‌నర్ వాడిన అభ్యర్థులు చాలా తక్కువని, వారి కోసం పరీక్షలపై స్టే ఇస్తే పెద్ద సంఖ్యలో అభ్యర్థులు నష్టపోతారంటూ కూడా రిట్లు దాఖలయ్యాయి. వీటిని బుధవారం హైకోర్టు మరోసారి విచారణ జరిపి న్యాయవాదులతో కమిటీ ఏర్పాటు చేసి అగ్రస్థానంలో ఉన్న అయిదు వేల ఓఎంఆర్ షీట్లను పరిశీలించాలని ఆదేశించారు. సీనియర్ లాయర్లు నిరంజన్‌రెడ్డి, రఘునందన్‌రావు, రఘురామ్‌లు కమిటీలో ఉంటారని, ఈ కమిటీ శని, ఆది వారాల్లో అయిదు వేల ఓఎంఆర్ సీట్లను పరిశీలించాలని ఆదేశించారు. అందుకు అనుగుణంగా ఓఎంఆర్ షీట్లను అందుబాటులో ఉంచాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను న్యాయమూర్తి ఆదేశించారు. కమిటీ టాప్‌లో ఉన్న అయిదు వేల మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను పరిశీలించి నిబంధన మేరకు ఎన్ని ఉన్నాయో, సర్వీస్ కమిషన్ నిబంధనల్ని ఉల్లంఘించినవి ఎన్ని ఉన్నాయో తేల్చాలని న్యాయమూర్తి ఆదేశించారు. సర్వీస్ కమిషన్ రికార్డులను కూడా పరిశీలించాలని ఆదేశించారు. ఈ కమిటీ సమగ్రంగా పరిశీలించి పూర్తి నివేదికను అందజేయాలని కమిటీని ఆదేశించారు.

తొలుత కేసు విచారణ ప్రారంభం కాగానే వైట్‌నర్ వాడ రాదని సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్‌లో స్పష్టంగా ఉందని, అయినా వైట్‌నర్ వాడారని, అదే విధంగా బబ్లింగ్ జరిగిందని పిటిషనర్ న్యాయవాదులు చెప్పారు. వైట్‌నర్ వినియోగించిన జవాబు పత్రాల్ని కంప్యూటర్లు ఆమోదించవని చెప్పిన సర్వీస్ కమిషన్ ఆ తర్వాత వాటిని ఎలా ఆమోదించిందో అర్థం కావడం లేద న్నారు. చట్ట ప్రకా రం హైకోర్టు తగిన ఆదేశాలిస్తే అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరుగుతుందన్నారు. 1032 పోస్టుల భర్తీ కోసం 1:3 నిష్పత్తిలో 3093 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతోందన్నారు. అనంతరం అడ్వకేట్ జనరల్ ప్రకాష్‌రెడ్డి వాదిస్తూ.. ఓఎంఆర్ షీట్లను పరిశీలించేందుకు కమిటీ ఏర్పాటు చేస్తామంటే తమకు అభ్యంతరం లేదన్నారు.

నాయీ బ్రాహ్మణ యువతకు కిట్స్ పంపిణీ

నవతెలంగాణబ్యూరో– హైదరాబాద్

ఆధునిక శిక్షణ పూర్తి చేసుకున్న నాయీ బ్రాహ్మణ యువతి, యువకులకు కిట్స్, సర్టిఫికెట్లను పర్యాటక, సాంస్కృతిక, బి సి సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ప్రదానం చేశారు. డిఎస్ఎస్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటేశ్ మాట్లాడుతూ యువత అభిరుచులకు అనుగుణంగా వారి హెయిర్ స్టయిల్‌తో పాటు బ్యూటిఫికేషన్ లలో మార్పులు వచ్చాయన్నారు. 31 జిల్లాల నుండి 650 మంది నాయీ బ్రాహ్మణ యువతి, యువకులను ఎంపిక చేసి వారికి ఆరు సంస్థల ద్వారా అధునికమైన శిక్షణను ఇచ్చామన్నారు.

పేదల శ్రమను దోచుకుంటూ వారి వేడి నెత్తురు జుర్రుకుంటున్న ధనస్వాములు, మత సంబంధమైన నీతి శాస్త్రాల ముసుగులో తలదాచుకోవడం ఘోరమైన విషయం. - డా॥ బి.ఆర్. అంబేద్కర్

సంపాదకీయం

ప్రశ్నిస్తున్న రాష్ట్ర పాలకులు

దమ్ముంటే కేంద్ర ప్రభుత్వం రైతు పండించే పంటకు మద్దతుధర పెంచాలని ముఖ్యమంత్రి కేసీఆర్ సవాల్ విసిరారు. కరీంనగర్‌లో జరిగిన రైతు సమన్వయ సమితి సభ్యుల ప్రాంతీయ సదస్సులో మాట్లాడుతూ మోడీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. మోడీ ప్రభుత్వాన్ని ఇంతటి తీవ్ర స్వరంతో విమర్శించే దమ్ము రాష్ట్ర సర్కారుకు గత నాలుగేండ్ల పాటు ఎందుకు లేదన్నదే ఇప్పుడు చర్చనీయాంశం. ఈ సందర్భంగా ప్రధాని మోడీ పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి పార్లమెంటరీయేతర భాష వాడారన్న ఆరోపణలున్నాయి. ఉపన్యాస క్రమంలో భావోద్వేగ ఫలితంగా పొరపాటున జారిన మాటలైతే ఆ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం వివరణ ఇవ్వాలి.

ఇప్పుడు రైతులను సంఘటితం చేయడం గురించి మాట్లాడడంలో రహస్యం ఇదే. ఏ వైపు నుంచి చూసినా కేంద్ర, రాష్ట్ర పాలకుల అవకాశ వాద ఎత్తుగడలే తప్ప ప్రజా ప్రయోజనాలు మాత్రం విస్మరించారు. ఎన్నికల వేడిలో మాట్లాడడం తప్ప చిత్తశుద్ధి జాడలేదు. ఇదే రాష్ట్ర ప్రజలు గుర్తించాల్సిన సత్యం.

రైతుల ఆత్మహత్యలకు కేంద్రంలో అధికారం చెలాయించిన బీజేపీ, కాంగ్రెస్‌లదే బాధ్యత అన్నారు. అందులో నిజం లేకపోలేదు. గత నాలుగేండ్లుగా మోడీ ప్రభుత్వ వైఫల్యాలు రాష్ట్ర ప్రభుత్వాధినేతలకు ఎందుకు కన్పించలేదన్న ప్రశ్న సహజంగానే ముందుకు వస్తుంది. దేశం దురవస్థలకు కాంగ్రెస్, బీజేపీ విధానాలు కారణమన్న విషయంలో ఏ మాత్రం భిన్నాభిప్రాయానికి తావులేదు. కానీ తెలుగు రాష్ట్రాలను పాలిస్తున్న టీఆర్ఎస్, టీడీపీల విధానాలు కూడా ఇందుకు భిన్నంగా లేవు కదా..! కేంద్ర రాష్ట్ర పాలకులకు తమ తమ రాజకీయ ప్రయోజనాలే తప్ప ప్రజాప్రయోజనాలు పట్టలేదు. అవకాశవాదంలో అవి పోటీ పడుతున్నాయి.

దేశాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్ విధానాలను చూపించి అధికారం చేపట్టిన మోడీ ప్రభుత్వం కాంగ్రెస్ చెప్పుల్లోనే కాళ్ళు పెట్టింది. అవే తప్పుడు విధానాలు... అదే అవినీతి... అదే అవకాశవాదం! అయినా రాష్ట్ర టీఆర్ఎస్ సర్కారు వీటిని ప్రశ్నించలేదు. పైగా దేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిన పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు వంటి ప్రజా వ్యతిరేక చర్యలకు పూర్తిమద్దతు పలికింది. బీజేపీ పాలిత ప్రభుత్వాల కంటే ముందే ...పోటీ పడి మోడీ చర్యలకు ఆమోదం తెలిపింది. శాసనసభను ప్రత్యేకంగా సమావేశపరిచి తీర్మానం చేసి పంపింది.



ఆంధ్రప్రదేశ్‌కు పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పొందుపరిచి చట్టబద్ధత కల్పించారు. తెలంగాణలో మాత్రం ఒక్క సాగునీటి ప్రాజెక్టును కూడా జాతీయ ప్రాజెక్టుగా ఆమోదం పొందలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు జాతీయ హోదా ఇస్తారని రాష్ట్ర ప్రజలు ఎదురు చూశారు. కానీ ఇది అంగీకరించేందుకు కేంద్రం సిద్ధంగా లేదని తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపలేదు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో తెలంగాణకు ఇచ్చిన వాగ్దానాలేవీ అమలు కావడం లేదు. అయినా ప్రశ్నించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడలేదు. ఇదేమిటని అడిగితే... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా సహకరించుకోవాలన్నారు. ఫెడరల్ రాజ్యాంగంలో రాష్ట్రాల హక్కుల కోసం కేంద్రం మీద ఒత్తిడి చేసే బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వానిదే. రాజకీయ నిబద్ధత లోపించినా వెన్నెముక లేని నాయకత్వం ఉన్నా కేంద్రాన్ని ఢీకొనడం సాధ్యం కాదు. తెలంగాణ పాలకులు వెన్నెముక లేనంత బలహీనులేమీ కాదు. రాజకీయ అవకాశవాదమే వీరి నోరు మూయించిందన్నది సత్యం.

నాలుగేండ్లుగా కేంద్ర, రాష్ట్ర పాలకుల మధ్య లాలూచీ కుస్తీ జయప్రదంగా సాగింది. తమ మధ్య రాజకీయ పొత్తులు ఏమీ లేవని ఇద్దరూ చెప్పుకున్నారు. కానీ వీరిద్దరి మధ్య బంధం లేకపోయినా అనుబంధం మాత్రం ఉన్నదని అందరికీ తెలిసిందే. ఇప్పుడు అనుబంధం వికటించినట్టున్నది. ఇప్పుడే అనుబంధం ఎందుకు వికటించినట్టు? రాష్ట్రంలో శాసనసభ నియోజకవర్గాల సంఖ్య పెరుగుతుందని టీఆర్ఎస్ నేతలు ఎదురుచూశారు. కేంద్రం ఇందుకు ఒప్పుకుంటే మోడీ ప్రభుత్వం ఎన్ని పాపాలు చేసినా మాఫీ అన్నమాట! ఇతర పార్టీల నుంచి ఫిరాయింపులు ప్రోత్సహించి టీఆర్ఎస్‌లో కలుపుకున్న వారందరికీ టికెట్లు ఇవ్వాలంటే శాసనసభ్యుల సంఖ్య పెరగాలి. లేనట్టయితే ఎంత వేగంగా టీఆర్ఎస్ గూటికి చేరారో అంతే వేగంగా పక్షులు గూడు విడిచి ఎగిరిపోతాయి. అందుకే టీఆర్ఎస్‌కు ఇది జీవన్మరణ సమస్య. ఈ సంఖ్యను ఇక కేంద్రం పెంచదన్న స్పష్టత వచ్చినట్టున్నది. అందుకే తట్టుకోలేనంత ఆగ్రహం వ్యక్తమైంది. నోరు జారేంత స్పీడు అందుకున్నది.

ముఖ్యమంత్రి ఉపన్యాసంలో రైతులు సంఘటితంగా లేరన్నారు. కేంద్రం అన్యాయం చేస్తే రైతుల ఆందోళనకు సమన్వయ సమితులు నాయకత్వం వహిస్తాయన్నారు. ఇది కూడా ఎన్నికల ఎత్తుగడే. దేశవ్యాప్తంగా రైతుల్లో వ్యక్తమవుతున్న ఆగ్రహాన్ని చూస్తున్నాం. ఇక్కడ కూడా ఆ సూచనలు కన్పిస్తున్నాయి. అసంతృప్తి తనవైపు మరలకుండా చూసుకునే ప్రయత్నమే ఇది. నెల రోజుల కిందనే లక్షలాది మంది రైతులు ఢిల్లీ నగరంలో రహదారులు దిగ్బంధం చేశారు. అయినా నోరు విప్పని రాష్ట్ర పాలకులు ఇప్పుడు రైతులను సంఘటితం చేయడం గురించి మాట్లాడడంలో రహస్యం ఇదే. ఏ వైపు నుంచి చూసినా కేంద్ర, రాష్ట్ర పాలకుల అవకాశ వాద ఎత్తుగడలే తప్ప ప్రజా ప్రయోజనాలు మాత్రం విస్మరించారు. ఎన్నికల వేడిలో మాట్లాడడం తప్ప చిత్తశుద్ధి జాడలేదు. ఇదే రాష్ట్ర ప్రజలు గుర్తించాల్సిన సత్యం.

ప్రజావాణి

మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు మంచి పరిణామం

తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంగా హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కాలేజీని ప్రతిపాదించటం మంచి పరిణామం. విశ్వవిద్యాలయంగా మార్చడానికి కోఠి ఉమెన్స్ కాలేజీకి అన్ని రకాల వసతులున్నాయి. దాదాపు 40 ఎకరాల్లో విస్తరించి, ప్రస్తుతం కోఠి ఉమెన్స్ కాలేజీలో 42 యూజీ కోర్సులు, పీజీ కోర్సులతో నడుస్తున్న ఉమెన్స్ కాలేజీలో రాష్ట్రంలోని 31 జిల్లాల విద్యార్థులు ఉన్నారు. వీరితో పాటు విదేశాలకు చెందిన చాలా మంది విద్యార్థినిలు కూడా చదువుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఒకటి ఉండగా, విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లింది. దీంతో తెలంగాణకు మహిళా విశ్వవిద్యాలయం లేకుండా పోయింది. ఇటీవల కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ దృష్టికి కూడా రాష్ట్ర నాయకులూ తీసుకెళ్ళారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణకు మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని, కేంద్రం ఇందుకు తగిన సాయం చేయాలని కోరారు. ప్రస్తుతం కోఠి ఉమెన్స్ కాలేజీని చూసిన తర్వాత తెలంగాణకు మహిళా విశ్వవిద్యాలయం చేయడానికి కావల్సిన అన్ని వసతులు ఇక్కడ ఉన్నాయని గుర్తించటం శుభపరిణామం. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం విశ్వవిద్యాలయంగా మార్చేందుకు అవకాశాలపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వటం కూడా జరిగింది. ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ 200 కోట్ల రూపాయలను కేటాయించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం అనుబంధ కాలేజీగా ఉన్న కోఠి ఉమెన్స్ కాలేజీకి 37 కోట్ల రూపాయలు కేటాయించారు. దీనితో కావలసిన అభివృద్ధి జరిపి విశ్వవిద్యాలయంగా మార్చవచ్చు. మహిళ విశ్వవిద్యాలయం వల్ల మహిళలకు ఉన్నత విద్య, పరిశోధన వంటి అంశాలు అందరికి చేరుతాయి. వచ్చే విద్యా సంవత్సరం మహిళా విశ్వవిద్యాలయం ప్రారంభం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకొని మహిళలకు యూనివర్సిటీ విద్య అందుబాటులో ఉండేలా కృషి చేయాలి.


- కందగట్ల శ్రవణ్ కుమార్, కాకతీయ యూనివర్సిటీ.

ఇంకెప్పుడిస్తారు ఉద్యోగాలు?

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా ఉద్యోగాల కోసం మరోసరి ఉద్యమించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. 2014 నుంచి 2017 ఆఖరి వరకు అన్ని ప్రభుత్వ నియామక సంస్థల ద్వారా దాదాపు 28వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ మ్యానిఫెస్టో ప్రకారం లక్షా 7 వేల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించింది. కానీ 2017 ఆఖరి వరకు 28వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసింది. మిగిలిన ఉద్యోగాలు ప్రభుత్వం ఎలా భర్తీ చేస్తుందో మేధావులకు సైతం అంతుబడుటం లేదు. లక్షలాది నిరుద్యోగులు ఆత్రంగా ఎదురుచూస్తున్న ఉద్యోగాలు గ్రూప్-1. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వం గ్రూప్-1 నోటిఫికేషన్ ప్రకటించలేదు. ఆఖరిసారిగా గ్రూప్-1 నోటిఫికేషన్ 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇచ్చింది. దాదాపు ఏడేండ్లు కావస్తున్నా ప్రభుత్వం ఇంతవరకు గ్రూప్-1 నోటిఫికేషన్ ప్రకటించలేదు. 2015 డిసెంబర్ 31న వెలువడిన గ్రూప్-2 ఉద్యోగాలు ఇంతవరకు భర్తీ కాలేదు. కొత్తగా గ్రూప్-3, గ్రూప్-4, వీఆర్వో, పంచాయతీ సెక్రెటరీ మొదలగు ఉద్యోగాల నోటిఫికేషన్ ఇంతవరకు ప్రభుత్వం ప్రకటించలేదు. సాధారణ డిగ్రీ కలిగిన నిరుద్యోగులు రాష్ట్రంలో ఎక్కువ సంఖ్యలో వున్నారు. వారి కోసం ప్రభుత్వం ఇంతవరకు ఎటువంటి నోటిఫికేషన్ విడుదల చేయలేదు. సాధారణ డిగ్రీ చదివిన నిరుద్యోగ యువత ఎక్కువగా వున్నారు. ఇచ్చిన ఒక్క గ్రూప్-2 నోటిఫికేషన్ ఉద్యోగాలు ఇంకా భర్తీ కాలేదు. రాష్ట్రంలో ఎంతోమంది నిరుద్యోగులు ఆత్మ బలిదానాలను సైతం లెక్క చేయకుండా తెలంగాణ కోసం పోరాడారు. కానీ వారి ఆశలన్నీ ఆడియాశలయ్యాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి.

- కె.శేఖర్ బాబు, హైదరాబాద్.

రైతు సమన్వయ సమితులు ఆత్మహత్యలను నివారిస్తాయా?



సారంపల్లి మల్లారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా హైదరాబాద్ ప్రగతి భవన్‌లోను, కరీంనగర్ పట్టణంలోనూ రైతు సమన్వయ సమితుల జిల్లా కార్యవర్గాల సమావేశం జరిపింది. మొత్తం రాష్ట్రంలో 1.60 లక్షల మంది సమితి సభ్యులను ప్రత్యేక బస్సుల్లో ఆహ్వానించి రైతులకు చేయాల్సిన కర్తవ్యాలను ముఖ్యమంత్రే స్వయంగా బోధించారు. ఈ సమన్వయ సమితిలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ పరిష్కారం చూపాలని, రైతును రాజుగా తీర్చిదిద్దాలని ఉద్బోధించారు. ఏప్రిల్ 15 నుండి ప్రతీ ఎకరాకు ఒక పంటకు రూ.4,000 చొప్పున ఇవ్వాలని, క్రాప్ కాలనీలను ఏర్పాటు చేయాలని, గిట్టుబాటు

బహుళ పంటల విధానాన్ని ప్రోత్సహించాలి. రైతులను మోసగించే వ్యాపారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. విత్తనాల వలన మోసపోయిన రైతులకు పూర్తి పరిహారం ఇప్పించాలి. పంటలబీమా, ప్రీమియమ్ రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి. టర్కీ లాంటి చిన్న దేశాలలో రైతులకు 8 రకాల సహాయాలు చేస్తున్నారు. ఆ విధంగా రైతు సమన్వయ సమితుల పని విధానాన్ని నిర్మాణాన్ని సవరించాలి. అప్పడే రైతుకు కొంత మేలు జరుగుతుంది. ఆత్మహత్యలు నివారించబడతాయి.

ధర కల్పించాలని, విత్తనాలు, ఎరువులు అందుబాటులో పెట్టాలని, పంటల విధానాన్ని రూపొందించాలని సమితి సభ్యులను ఆదేశించారు. గిట్టుబాటు ధరల నిర్ణయాన్ని కేంద్రంపైకి నెట్టి, విమర్శలు చేశారు. రైతు సమన్వయ సమితులను వాటికి నిర్దేశించిన ఆదేశాలను పరిశీలిస్తే రానున్న కాలంలో రైతు రాజు అవుతాడా? లేక మరింత బికారి అవుతాడా? అన్నది పరిశీలించాలి.

ప్రస్తుతం మార్కెట్‌లో కందులు రూ.5420కు క్వింటాలు మద్దతుధర కాగ రూ.3200కు రైతులు అమ్ముకుంటున్నారు. ఏ మార్కెట్‌లో కొనుగోళ్లు లేవు. కొనుగోలు చేయాలని రాస్తోరోకోలు, ధర్నాలు చేస్తున్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపైకి సమస్యలను నెట్టివేస్తోంది. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం చేయాలని పదేపదే ఆదేశిస్తున్నది. నాలుగు క్వింటాళ్ల కందులు అమ్మిన రైతులు రూ.8,000 నష్టపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్‌లో రూ.4 వేలు రాయితీ ఇస్తుంది. అయినా రైతు మరో రూ.4,000 నష్టపోతున్నాడు. పసుపు, జొన్నలు, వేరుశనగ పంటలకు కనీస మద్దతు ధరలు అమలు కావడం లేదు. మరో రెండువారాలలో మిరప మార్కెట్‌కు వస్తుందనగా ధరలు తగ్గుతున్నాయి. ఇప్పటికే క్వింటాలుకు రూ.2,000 తగ్గించారు. రైతునుండి పంట వ్యాపారుల చేతికి వెళ్లగానే ధరలు పెరుగుతున్నాయి. పంటల కాలంలో మార్కెట్‌లో ధరలు తగ్గినప్పటికీ వినియోగదారుడు మాత్రం తగ్గింపునకు నోచుకోవడం లేదు. కేంద్రం - రాష్ట్రం ఇట్లాంటి మార్కెట్ వ్యవస్థను తెల్చుకోలేక సతమతమవుతుండగా "రైతు సమన్వయ సమితి"లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ సమితుల ద్వారా రైతుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని ప్రచారం చేస్తున్నారు. గతంలో రైతుమిత్ర కమిటీలు, రైతు క్లబ్‌లు, సాగునీటి సంఘాలు, జేఎల్‌జీ కమిటీలు, మార్కెట్ కమిటీలు, సహకార సంఘాలు వేశారు. కానీ, ఏ సంఘం రైతుల సమస్యలను పరిష్కరించలేదు. రైతు సమితుల నియమకానికి రాష్ట్ర ప్రభుత్వం జీవో 39 తెచ్చి, తమ పార్టీకి చెందిన వారినే సమితులలో సభ్యులుగా గుర్తిస్తూ జిల్లా మంత్రి ఎంపిక చేశారు. ఈ సమితులు రైతులు ఎన్నుకున్నవి కావు. ఈ సమితులు భూ యజమానులకు మాత్రమే సౌకర్యాలు చేకూరుస్తాయి. కౌలు రైతులు, పోడుభూములు సాగుచేసే రైతులు, దేవాదాయ కౌలు చేసే రైతులు, అసైన్డ్ భూములు కొనుగోలు చేసిన వారు దశాబ్దాల తరబడి ప్రభుత్వ భూములు సాగుచేస్తున్నవారికి భూములపై ఎలాంటి హక్కులేకుండా కనీసం సాగుహక్కు లేకుండా శాసనసభలో చట్ట సవరణ చేశారు. ఈ విధంగా రాష్ట్రంలోని 55లక్షల కమతాలు కలిగిన రైతుల నుండి వాస్తవ సాగుదారులు 20లక్షలమంది వరకు ప్రభుత్వ అర్హత పొందే హక్కును కోల్పోయారు. 54లక్షలమంది భూయజమానులకే (వారుఎక్కడున్న) వారికి రాయితీ లభిస్తుంది. వ్యవసాయ శాఖ మంత్రి చెప్పిన ప్రకారం భూయజమాని - కౌలు రైతు రాయితీ సమస్యను పరిష్కరించుకోవాలట. ఇది సాధ్యమయ్యే పనేనా?

మరో అత్యంత ప్రమాదకరమైన అంశం ఏమిటంటే క్రాప్ కాలనీలను ఏర్పాటుచేసి ఒకే పంట పండిస్తారు. గతంలో ఏకపంట వల్ల క్రిమి, కీటక దాడుల వల్ల దిగుబడులు సరిగ్గా రాక రైతులు నష్టపోయారు. ప్రస్తుతం బహుళ పంటల విధానం వల్ల కొద్దో, గొప్పో దిగుబడులు వస్తున్నాయి. క్రాప్ కాలనీలు విత్తన కంపెనీలకు లాభాలు చేకూర్చిపెడతాయి. గత ఖరీఫ్‌లో తెలంగాణ రాష్ట్రంలో 18 లక్షల ఎకరాలలో బీటీ-3 పేరుతో పత్తి విత్తనాలను అమ్మి రైతులను నిట్టనిలువునా ముంచారు. అనుమతి లేని విత్తనాలను అమ్మినవారిపై కేసులు పెట్టాలని ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసిన ఏ ఒక్క నకిలీ వ్యాపారిపై కేసు పెట్టలేదు. నకిలీ వ్యాపారులకు, వ్యవసాయ శాఖకు ఎంత మైత్రి ఉన్నదో బోధపడుతున్నది. ఏటా రాష్ట్రంలో 4, 5 లక్షల ఎకరాల పంటలు నాణ్యత లేని విత్తనాల వల్ల దిగుబడులు బాగా నష్టపోతున్న పరిస్థితి. విత్తనోత్పత్తి రాష్ట్రానికి విత్తన చట్టం లేదు. 2015లో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా విత్తన చట్టం కాగితాలకే పరిమితమైంది. భూసార పరీక్షలు, విత్తన ఎరువుల పరీక్షలు జరపడానికి ల్యాబ్స్ పనిచేయడం లేదు. మార్కెట్‌లో ధరలు తగ్గినపుడు నిల్వ పెట్టే సౌకర్యం లేదు.

గతంలో ఉన్న 4లక్షల టన్నుల గోదాముల తోడుకు మరో 20లక్షల టన్నుల గోదాముల ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నామని మార్కెటింగ్ శాఖ మంత్రి ప్రకటించారు. ఎన్నేండ్లకు నిర్మాణం పూర్తవుతుందో తెలియని పరిస్థితి ఉంది. వ్యవసాయ పరిశోధనలు మూలబడి నాలుగేండ్లకు పైగా గడిచింది. బీటీ విత్తనాల వల్ల రైతులు నష్టపోయారు. వచ్చే ఖరీఫ్‌కు ఏ విత్తనాలు వేయాలో తెలియని గందరగోళ పరిస్థితి ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే రైతులు చేతికందిన విత్తనాలు తప్ప మంచి విత్తనాలను సేకరించలేరు. విత్తన సబ్సిడీలు ఇవ్వడమే తక్కువ. ఆ సందర్భంలో విత్తనాల రేట్లు బాగా పెంచివేస్తారు. అలా పెంచడం వల్ల సబ్సిడీ ఏటా రూ.170 కోట్లు ఏజెంట్ల జేబుల్లోకి చేరుతున్నాయి. పంట రుణాలు పరిశీలిస్తే బ్యాంకులు రుణాలివ్వడం పూర్తిగా తగ్గించి



వేశాయి. మైక్రో ఫైనాన్స్, ప్రయివేటు వడ్డీ వ్యాపారులు, వ్యవసాయ రంగానికి రుణాలిస్తున్నాయి. అధిక వడ్డీలు చెల్లించలేక రైతులు ఆస్తులు కోల్పోతున్నారు. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా కేంద్ర ఫైనాన్స్ కమిషన్ ఏటా రూ.3 వందల కోట్లు రాష్ట్రానికి ఇస్తున్నది. ఈ మధ్య నిజామాబాద్ జిల్లాలో వడగండ్ల వర్షం వల్ల 20 వేల ఎకరాల పంటలు నష్టపోగా వారికి కనీసం ఫైనాన్స్ నిధుల నుండి 50 కోట్లు పరిహారం ఇవ్వడానికి ప్రభుత్వానికి వీలు పడలేదు. 2015-16లో 791 కోట్లు కేంద్రం పరిహారం ఇచ్చింది. అందులో సగం నిధులే పంపిణీ చేశారు. ఇటువంటి సమస్యల్ని రైతు సమన్వయ సమితులు ఏ మేరకు పరిష్కరిస్తాయి.


రాష్ట్రంలో సాగు విస్తీర్ణం 1.62 కోట్ల ఎకరాలు ఉన్నప్పటికీ ఏనాడూ 1.15 కోట్ల ఎకరాలకు మించి సాగు కాలేదు. వాస్తవ సాగుదారులందరికీ ఒకపంటకు ఎకరాకు రూ.4 వేల చొప్పున ఇచ్చినప్పటికీ రూ.4400 కోట్లకు మించి వ్యయం కావు. నేడున్న వ్యవసాయ సంక్షోభ పరిస్థితిని అధిగమించడానికి ఆత్మహత్యలను నివారించడానికి రైతుకు పెట్టుబడి ఉచితంగా ఇవ్వాలి. రైతుల బాకీలను పూర్తిగా రద్దు చేయాలి. తిరిగి బాకీలో పడకుండా విత్తనాలు మొదలు మార్కెట్ వరకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి. కేంద్రంపైకి నెట్టివేసి తప్పుకోవడం సరికాదు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తున్న బడ్జెట్ నామకా ఉన్నాయి. ఏటా ప్రణాళిక, ప్రణాళికేతర కలిపి రూ.5500 - 6000 వేల కోట్ల మధ్య ఉన్నాయి. ఇందులో 500 కోట్లు ప్రణాళికేతర వ్యయం పోగా మరో రూ.4250 కోట్లు రుణమాఫీ కింద కేటాయించారు. ఇక వ్యవసాయానికి మిగిలింది రూ.800 కోట్లు మాత్రమే ఇందులో పావలా వడ్డీ, పంటల సంరక్షణ, హార్టీకల్చర్, అడవులు, పట్టుశాఖ, మార్కెటింగ్ శాఖ, వర్షాభావ ప్రాంతాలు, జాతీయ ఆహార భద్రత, నూనెగింజలు, పామాయిల్ పరిశోధన తదితర అంశాలకు ఖర్చు చేయాలి. రూ.800 కోట్లతో ఇది సాధ్యమేనా? వ్యవసాయ ప్రత్యేక బడ్జెట్ అంటూ 22 శాఖలను పద్దులను ఒకచోట చేర్చి శాసన సభలో చెప్పటం, ఏ శాఖకు తమ బడ్జెట్‌లు లాగివేస్తే వ్యవసాయ శాఖకు మిగిలేది రూ.1000-800 కోట్లు మాత్రమే. 27 పరిశోధనా కేంద్రాలు నిధులు లేక మూతబడ్డాయి.

పంటల విధానానికి సంబంధించిన ప్రణాళిక, వ్యవసాయశాఖ రూపొందించలేదు. సాంప్రదాయకంగా వస్తున్న వార్షిక ప్రణాళిక మాత్రమే ప్రకటిస్తారు. వర్షాభావ పరిస్థితులల్లో గత మూడేండ్లలో ఏనాడు కాంటిన్‌జెన్సీ పథకం రూపొందించలేదు. అందువల్ల ప్రస్తుతం ఏర్పడిన రైతు సమితులు రైతాంగ సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలి.

వాస్తవ సాగుదారులకు (కౌలుదారులతో సహా) ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి. నాణ్యత గల విత్తనాలను, అక్కడి ప్రాంతానికి అనువైన విత్తనాలను ఉచితంగా సరఫరా చేయాలి. వడ్డీలేని రుణాలివ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం ధరల నిర్ణయాక సంఘాన్ని ఏర్పాటుచేసి ఉత్పత్తి వ్యయంపై 50శాతం కలిపి వ్యవసాయోత్పత్తులధరలు నిర్ణయించి రాష్ట్ర అవసరాల మేరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలి. ఎగుమతి అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వమే పరిశీలించి బాధ్యత తీసుకోవాలి. రైతు సమన్వయ కమిటీలను ప్రజాస్వామ్యయుతంగా రైతు సమావేశాలు జరిపి ఎంపిక చేయాలి. గ్రామ రైతు సభలు నిర్వహిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలి. బహుళ పంటల విధానాన్ని ప్రోత్సహించాలి. రైతులను మోసగించే వ్యాపారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. విత్తనాల వలన మోసపోయిన రైతులకు పూర్తి పరిహారం ఇప్పించాలి. పంటలబీమా, ప్రీమియమ్ రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి. టర్కీ లాంటి చిన్న దేశాలలో రైతులకు 8 రకాల సహాయాలు చేస్తున్నారు. ఆ విధంగా రైతు సమన్వయ సమితుల పని విధానాన్ని నిర్మాణాన్ని సవరించాలి. అప్పడే రైతుకు కొంత మేలు జరుగుతుంది. ఆత్మహత్యలు నివారించబడతాయి.

సెల్ : 9490098666

శాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారం చేయాలి




ఎస్. వెంకట్రావు

ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి 28ని జాతీయ సైన్సు దినోత్సవంగా జరుపుకుంటున్నాం. సైన్సులో నోబెల్ బహుమతి పొందిన ఏకైక భారత శాస్త్రవేత్త సివి రామన్ తన శాస్త్రీయ ఆవిష్కరణ 'రామన్ ఎఫెక్ట్'ను 1928 ఫిబ్రవరి 28న ఆవిష్కరించినందుకు గుర్తుగా ఈ రోజును జరుపుకుంటున్నాం. రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరించి నేటికి 90 ఏండ్లు గడిచింది. మనకు స్వాతంత్ర్యం వచ్చి గతేడాదికి 70 ఏండ్లు నిండాయి. ఈ కాలంలో దేశం శాస్త్ర సాంకేతి రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించింది. కానీ దానికి అనుగుణంగా ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం అభివృద్ధి కాకపోవడం విచారకరం. శాస్త్రీయ దృక్పథం లేని శాస్త్ర-సాంకేతికాభివృద్ధి అశాస్త్రీయ పద్ధతిలో వినియోగించబడుతుంది. అది దేశ ప్రజలకు మేలు కన్నా కీడే ఎక్కువ చేస్తుంది.

పెరిగిన పరిశ్రమలు ప్రజలను నిరుద్యోగులను చేస్తున్నా యన్నా, పెరిగిన వైద్య సాంకేతిక పరిజ్ఞానం ప్రజలను భయ పెడుతోందన్నా, ఉన్నత చదువులు పిల్లలను ఆత్మహత్యలకు గురిచేస్తున్నా యన్నా కారణం శాస్త్ర-సాంకేతి కాభివృద్ధితో పాటు ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెరగకపోవడమే.

పౌరుల ప్రాథమిక విధులను గురించి వివరించే రాజ్యాంగంలోని 51ఎ అధికరణంలో... 'శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతావాదాన్ని, అన్వేషణ, సంస్కరణ స్ఫూర్తినీ పెంపొందించడం' పౌరుని ప్రాథమిక విధిగా పేర్కొన్నారు. ఇలా రాజ్యాంగంలో పేర్కొన్నారంటే మన దేశ పరిస్థితుల్లో దానికో ప్రాధాన్యత ఉంది. దేశంలో విస్తారమైన ప్రజానీకం నిరక్షరాశ్యులుగా ఉండడం, సమాజంపై ఫ్యూడల్ ఆలోచనా ప్రభావం బలంగా ఉండడం, సుదీర్ఘకాలం దేశం వలస పాలనలో మగ్గడం... ఈ కారణాల రీత్యా స్వాతంత్ర్యా నంతరం దేశం పురోగమించాలంటే ప్రజల ఆలోచనా విధానం అభివృద్ధికర మార్గంలో సాగాలనే ఉద్దేశంతో రాజ్యాంగంలో ఈ అంశాన్ని చేర్చారు.



శాస్త్రీయ దృక్పథం (సైంటిఫిక్ టెంపర్) అనేది ఒక జీవన విధానం. ఆధునిక సైన్సు ఏ పద్ధతుల్లో అభివృద్ధి చెంది నేడు మానవాళికి సేవ చేస్తోందో ప్రజలు కూడా రోజువారీ జీవనంలో అటువంటి పద్ధతులు అనుసరించాలని దీనర్థం. శాస్త్రీయ పద్ధతిలో ప్రతిదాన్నీ ప్రశ్నించడం, భౌతిక వాస్తవికతను పరిశీలించడం, పరీక్షించడం, సైద్ధాంతీ కరించడం, విశ్లేషించడం, ఇతరులకు చెప్పడం అనే క్రమం ఉంటుంది. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించా లంటే ప్రజల్లో తర్కం, చర్చ, వాదన, విశ్లేషణ వంటి గొప్ప ధోరణులను అభివృద్ధి చేయాలి.

యూరప్‌లో లిబరల్ బూర్జువా వర్గం ఈ దృక్పథాన్నే ఆయుధంగా చేసుకుని ఫ్యూడల్ శక్తులపై పోరాడి పారిశ్రామిక విప్లవం సాధించింది. అభివృద్ధి చెందింది. మన దేశంలో కూడా స్వాతంత్ర్య పోరాటంలో లిబరల్ బూర్జువా వర్గం ఈ ఆయుధాన్నే ఉపయోగించుకుంది. నిజానికి శాస్త్రీయ దృక్పథం అనే మాటను వాడింది మన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ. ఈ ధోరణి మన దేశంలో పారిశ్రామిక, శాస్త్ర సాంకేతిక పునాది పడడానికి ఎంతగానో తోడ్పడింది.

కానీ ఇప్పుడు అధికారం చేపట్టిన చీకటి శక్తులు ఈ శాస్త్రీయ దృక్పథానికీ, విజ్ఞాన శాస్త్రానికీ విరుద్ధమైన భావజాలాన్ని ప్రజల్లో ప్రచారం చేస్తున్నారు. డార్విన్ పరిణామవాదం తప్పు అని ఒక కేంద్ర మంత్రి బహిరంగంగా ప్రకటిస్తే, దేశ ప్రధాని అంతటి వాడు జాతీయ సైన్సు కాంగ్రెస్‌లో పురాణాల కాలంలోనే మనవాళ్లు ప్లాస్టిక్ సర్జరీలు చేసేశారని ఏ ఆధారాలు లేకుండా చెప్పేశారు. అదే సైన్సు కాంగ్రెస్‌లో ఒక ప్రబుద్ధుడు వేదకాలంలోనే మన వాళ్లు విమానాలు తయారు చేశారని ఏకంగా పత్రమే ప్రవేశపెట్టారు. సూర్య 'దేవునికి' స్కూళ్లలో నమస్కారాలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్ద కార్యక్రమం ప్రకటించారు. ఒక ఆర్ఎస్ఎస్ ప్రచారకుడు వ్యవసాయానికి ఆవు పేడ, మూత్రం చాలు... వ్యవసాయ విశ్వవిద్యాలయాన్నిటినీ మూసేయాలని శెలవిచ్చాడు. 'అన్నీ వేదాల్లోనే ఉన్నాయష' అంటూ ఏ చాందసత్వాన్నయితే మహాకవి గురజాడ ఈసడించుకున్నారో ఆ చాందస వాదం నేడు గద్దెనెక్కి మనల్ని పరిపాలిస్తోంది. ఈ చాందస వాదం ప్రకటనలకే పరిమితం కాలేదు. పాలకుల అండతో పాఠ్యపుస్తకాల ద్వారా, మీడియా ద్వారా, చాందసవాదుల అశాస్త్రీయ కార్యకలాపాల ద్వారా ప్రజల మస్తిష్కాలను ఆవహించేస్తోంది. ప్రతిరోజూ టీవీ కార్యక్రమాల ద్వారా, సినిమాల ద్వారా, పత్రికల శీర్షికల ద్వారా ఎన్నెన్ని మూఢ నమ్మకాలు, అశాస్త్రీయ భావాలు ప్రచారం అవుతున్నాయో చూస్తున్నాం. నిజానికి ఇవన్నీ రాజ్యాంగ విరుద్ధ చర్యలు. అయినా పాలకులు దీనిపై చర్యలు తీసుకుంటున్నది లేదు. కానీ రాజ్యాంగంలో పౌరుల విధిగా పేర్కొన్న శాస్త్రీయ దృక్పథాన్ని గురించి ఈ ప్రసార మాధ్యమాల్లో ఎన్ని కార్యక్రమాలు వస్తున్నాయంటే... దాదాపు లేనట్టే.

ప్రజలు శాస్త్రీయ దృక్పథం నుండి తప్పుకుంటే ఏమవుతుందో ఈనాడు మనం ఆఫ్ఘనిస్థాన్, ఇరాక్ వంటి దేశాల్లో చూస్తున్నాం. ఒకప్పుడు ఆధునికత వైపు అడుగు లేస్తున్న ఈ దేశాలపై అమెరికా దాడి చేసి చాందస శక్తులను పెంచి పోషించిన ఫలితంగా నేడు అక్కడ చీకటి శక్తులు రాజ్యమేలు తున్నాయి. పౌర హక్కులు, ప్రజాస్వామ్యం లేని అంధ యుగంలోకి ఆ దేశాలను తీసుకుపోయాయి. భారతదేశం కూడా ఆ స్థితికి వెళ్లకుండా ఉండాలంటే ప్రజల మస్తిష్కాలపై చాందస శక్తులు పూర్తి విజయం సాధించకుండా అడ్డుకోవాలి. దీనికి ప్రజల్లో సైన్సునూ, శాస్త్రీయ దృక్పథాన్నీ ప్రచారం చేయడం అవసరం.

మెయిల్ @ నవతెలంగాణ

సిరియా వాసులు కూడా తోటి మనుషులే..



సయ్యద్ రఫీ

సిరియావాసులపై జరుగుతున్న రాక్షసత్వాన్ని, మానవులమైతే ఖండించి తీరాలి. మృతిచెందిన వారిని, గాయపడిన చిన్న చిన్న పిల్లలను చూస్తుంటే మనసు తల్లడిల్లి పోతున్నది. దాడి చేసే వాడి క్రూరత్వాన్ని చూస్తుంటే, వారు మానవ రూపంలో ఉన్న మృగాల్లా కనపడుతున్నారు. వారితో యావత్తు ప్రపంచానికే ప్రమాదం అనే భావన కలుగుతుంది.

ఎవరో సిరియా వాళ్ళపై దాడులు కదా! మనకెందుకు అనుకుంటే, తదుపరి దాడి మనపై కూడా జరగవచ్చు అనే సంగతి మరవద్దు. ఇంత పరిణితి చెందిన సమాజంలో ఇంకా యిలాంటి భయంకర హింసలు జరగడం విచారకరం. ప్రపంచ శాంతి అవార్డు గ్రహీతలు ఎక్కడ పడుకొని ఉన్నారో? ప్రపంచ శాంతి కోసం స్థాపించబడిన ఐక్య రాజ్య సమితి రద్దైయ్యిందో ఏమో! సడీ చప్పుడు లేదు. ఇతర దేశాలన్నీ, ముఖ్యంగా సిరియా చుట్టూ పక్క దేశాలు కూడా మౌనం పాటించడం దారుణం. ఆ దేశాలు మౌనం పాటిస్తున్నాయి అంటే వారిలో పిరికితనమన్నా ఉండాలి. లేదా అమానవీయత అయినా ఉండాలి. లేదా మనకెందుకులే అనే నిర్లిప్తతయినా ఉండాలి. ఇందులో ఏది ఉన్నా కూడా రాను రాను ప్రపంచమంతా అల్లకల్లోలమయ్యే పరిస్థితి నెలకొనడం ఖాయం. హింస, ప్రతిహింస, పగ, శత్రుత్వం, వివక్ష, ఆక్రమణల కోసం చేసే దాడుల వాళ్లిద్దరికీ నష్టమే.సిరియా వాసుల అవస్థలు మీడియాలో కంటే సోషల్ మీడియాలో ఎక్కువ కనపడుతున్నాయి. ఎక్కువ శాతం మెయిన్ స్ట్రీమ్ మీడియా కూడా ఏమీ పట్టకుండా ఎందుకు వ్యవహరిస్తుందో? ఇంత ఘోరమైన సంఘటనలను విస్మరించి పనికిమాలిన చర్చలకు ప్రాధాన్యతనిస్తున్న తీరు చూస్తుంటే, మీడియా ఉద్దేశాలు బయటపడిపోతున్నాయి. ఇంత పెద్ద దుర్ఘటనలనుకూడా వార్తలా భావించారా?

సోషల్ మీడియాలో కొన్ని వీడియోలు చూస్తుంటే కండ్లు చెమ్మగిల్లిపోతున్నాయి. ప్రతీరోజూ ఐదు సార్లు నమాజ్ చేసే వారు ఇప్పుడు ఆరుసార్లు చేయవల్సి వస్తున్నదట. ఆ ఆరోసారి చేసే నమాజు 'జనజీ కి నమాజ్' అనగా మరణించిన వారి అంతక్రియలకంటే ముందు నిర్వహించే నమాజ్. ఇండ్లన్నీ కుప్పకూలిపోయి ఎంతో మంది కూలిన శిధిలాలకిందే సమాధి అయిపోయారు. బతికున్న వాళ్లకు ఆహారం, వసతి, కప్పుకోడానికి దుప్పట్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎందరో అవయవాలు కోల్పోయి, ఎంతో అవస్థ పడుతున్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో, బాధితుల పట్ల వర్ణ, ప్రాంత, కుల, మత బేధాల వ్యర్థ ఆలోచనలను బొందపెట్టి, వారికి సహాయ సహకారాలు అందించి ఆదుకోవడం తోటి మానవుడి తక్షణ కర్తవ్యం. సమస్త ప్రపంచం ముక్త కంఠంతో దాడి చేసిన దేశాన్ని హెచ్చరించి. ఇక ముందు ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసుకోవడం అత్యవసరం!

సెల్:9966025325



సినిమా రంగుల కళ. ఎంతోమంది కలల స్వప్నం. ఆ సెల్యూలాయిడ్‌పై తమ వర్ణచిత్ర ఆవిష్కరణకోసం తపించినవారెందరో. తమ అద్భుతమైన నటనాకౌశలంతో ప్రేక్షకులను మైమరిపింపచేసినవారు మరెందరో. నాటి మధుబాల నుంచి... నేటి శ్రీదేవి దాకా నటనే ప్రాణంగా జీవించిన నటీమణులనేకం. ముఖాలపై రంగులతో ఎందరి జీవితాల్లోనో సంతోషం నింపిన వారి జీవితాలెందుకు చీకటికోణంలో మిగిలిపోతున్నాయి? అప్పటిదాకా ఓ వెలుగు వెలిగిన తారల జీవితాలెందుకు ఒక్కసారే ఆరిపోతున్నాయి? అర్ధాంతరంగా ముగుస్తున్న వారి జీవితాల వెనుక ఉన్న రహస్యాలేమిటి? అందానికి బంధీ అవుతున్నారా? డబ్బును మేనేజ్ చేయలేకపోతున్నారా? జీవితాన్ని సమన్వయం చేసుకోవడంలో విఫలమవుతున్నారా? ఇలాంటి ప్రశ్నలెన్నో!



సావిత్రి నుంచి శ్రీదేవి వరకు...

శ్రీదేవి అకాల మరణం ఎన్నో సందేహాలకు తెరతీసింది. అప్పటిదాకా ఆరోగ్యంగా ఉన్న 54 ఏళ్ల నటి ఆకస్మిక మరణం అనగానే ఎన్నో ప్రశ్నలు... ఇంకెన్నో చర్చలు. గుండెపోటే కారణమని కుటుంబం చెప్పినా... ఆ గుండె పోటుకు గల కారణాలను దేశం మొత్తం అన్వేషించింది. నటనను పక్కన పెట్టి కేవలం అందం ఇమేజ్‌కే అపాదించడం వల్ల... ఆ అందాన్ని కాపాడుకోవడానికి ఆమె చేసిన ప్రయత్నాలే కారణమయ్యాయని ఎన్నో విశ్లేషణలు. 29 శస్త్రచికిత్సలే ఆమె ప్రాణం తీశాయంటే... హార్మోన్ల ప్రభావమే హృదయంపై పడి ఉంటుందని చర్చోపచర్చలు. ఒక్క హీరోయిన్లే కాదు... హీరోలెందరో కూడా ఈ తరహా శస్త్ర చికిత్సలు చేసుకుంటూనే ఉంటారు. కానీ హీరోల విషయంలో ఎప్పుడూ జరగనంత చర్చ... హీరోయిన్ల విషయంలోనే ఈ చర్చ మొదలవుతుంది. జరుగుతుంది. కొనసాగుతూ ఉంటుంది. మరణానికి చింతించాల్సిందిపోయి... శల్యపరీక్షలు చేయడం మొదలుపెడతారు. ఆమెను అందానికి బందీ చేసి... 40 ఏండ్లు వచ్చినా, 50 ఏండ్లు దాటినా ఆమె 20 ఏండ్ల వయసు లాగానే కనిపించాలనే చూసే ఓ పురుష భావజాలం ఉంటుంది. గుండెపోటు కారణం కాదని వైద్యులు తేల్చాక... ఆమెనెవరైనా హత్య చేసి ఉంటారా? చేస్తే ఎందుకు చేస్తారు? ఆర్థిక వ్యవహారాలే అకాల మరణానికి కారణమయ్యాయా? ఎన్నో సందేహాలు. ప్రమాదవశాత్తు బాత్‌టబ్‌లో పడి మరణించారని పోస్టుమార్టం నివేదిక చెబుతున్నా... ఆమె మరణం ఒక వీడని మిస్టరీనే.

అనుకోని రీతిలో...

హీరోయిన్ల జీవితాలెందుకింత మిస్టరీగా మిగులుతున్నాయి. శ్రీదేవి మాదిరిగానే సినీ నటీమణులు పలువురు ఆకస్మికంగా, అనుమానాస్పదంగా, యుక్త వయస్కులుగా ఉండగానే మరణించారు. అలనాటి మహా నటి సావిత్రి 47 ఏళ్లకే మరణించారు. 'సంసారం' సినిమాతో సెల్యూలాయిడ్‌పై వెలుగు వెలిగిన సావిత్రి తర్వాత పలు తెలుగు సినిమాల్లో ఎన్నో ఆదర్శప్రాయమైన పాత్రలు పోషించారు. పురాణ గాథల నుంచి సామాజిక అంశాల నేపథ్యంతో వచ్చిన ఎన్నో సినిమాల్లో నటించారు. తొలిసారి 'పెళ్లి చేసి చూడు' సినిమాలో ఆమె లీడ్ పాత్ర పోషించారు. దక్షిణాది తారలు అక్కినేని నాగేశ్వర్ రావు, ఎన్టీఆర్, జెమినీ గణేశన్ తదితర ప్రముఖ కథా నాయకులతో పలు సినిమాల్లో నటించారు. తర్వాతి దశలో జెమినీ గణేశన్‌ను వివాహం చేసుకున్నారు. కారణాలేమైనా జెమినీ గణేశన్‌తో వైవాహిక జీవితంతో విభేదాలొచ్చాయి. ఆ తరువాత అనేక సమస్యలు వచ్చాయి. సమస్యలు చుట్టుముట్టడంతో ఒత్తిడితో ఆమె మద్యానికి బానిసయ్యారు. ఆ ఒత్తిడితోనే 19 నెలలు కోమాలోకి వెళ్లిపోయారు. మళ్లీ మామూలు మనిషి అవుతుందనుకున్నారు. కానీ దక్షిణాది సినీ రంగాన్ని 'మహారాణి'గా ఏలిన మహానటి సావిత్రి.. అనుకోనిరీతిలో కన్నుమూయడం విషాదమే.



19 ఏండ్లకే...

టాలీవుడ్, బాలీవుడ్‌లోనూ తన అందం, అభినయంతో కట్టిపడేసిన నటి దివ్యభారతి. శ్రీదేవిలాగే 16 ఏళ్ల వయసులోనే హీరోయిన్‌గా దివ్యభారతి మారింది. కొద్దికాలంలోనే టాలీవుడ్, బాలీవుడ్‌ల్లోనూ మంచి అవకాశాలు వచ్చాయి. 1990లో వెంకటేశ్ నటించిన బొబ్బిలి రాజా సినిమాతో తెరంగేట్రం చేసింది. మూడేళ్లే ఇండస్ట్రీలో ఉన్నా.. ఎన్నో హిట్ సినిమాల్లో నటించింది. తెలుగులో ఆమె నటించిన బొబ్బిలి రాజాతోపాటు అసెంబ్లీ రౌడీ, రౌడీ అల్లుడు, ధర్మక్షేత్రంలాంటి సినిమాలన్నీ హిట్టే. హిందీలోనూ 'షోలా ఔర్ షబ్నమ్', 'దీవానా', 'విశ్వాత్మ'లాంటి హిట్ సినిమాలు ఉన్నాయి. తెలుగులో 'తొలిముద్దు' సినిమా చేస్తున్నపుడే ఆమె చనిపోయింది. 1993, ఏప్రిల్5న ముంబైలోని తన అపార్ట్‌మెంట్‌లో ఐదో అంతస్తు నుంచి కింద పడి మ తి చెందింది. అప్పుడామె వయసు 19 సంవత్సరాలు మాత్రమే. మద్యం మత్తులో బాల్కనీ నుంచి కింద పడిందని, ఎవరో తోసేశారని, ఆత్మహత్య చేసుకుందని.. ఇలా రకరకాల వార్తలు వచ్చాయి. ఆమె ఎలా కింద పడిపోయిందన్నది మాత్రం తేలనేలేదు. పోస్టుమార్టమ్ రిపోర్ట్ మాత్రం ప్రమాదవశాత్తు కిందపడి చనిపోయినట్లు స్పష్టంచేసింది. దీనిపై విచారణ చేపట్టిన ముంబై పోలీసులు 1996లో కేసును మూసేశారు. ప్రమాదవశాత్తు జరిగిన మరణంగా తేల్చేశారు. ఎన్నో కలలుగంటూ సినీలోకంలో వెలుగు వెలగాలనుకున్న నటీమణికి 19 ఏండ్లకే వందేండ్లు నిండిపోయాయి. ఆమె టాలెంటే ఆమెకు శత్రువయ్యిందా? నమ్మినవాళ్లే నట్టేట ముంచేశారా? ఏమీ తెలియలేదు. మరణం వెనుక రహస్యాలేమీ బయటకు రాలేదు. ఆమె ప్రాణం మాత్రం పోయింది.



నమ్మినవాళ్లే మోసం చేస్తే...

తక్కువ కాలంలోనే 450కి పైగా సినిమాల్లో నటన 1980వ దశకంలో ధైర్య సాహసవంతమైన సినీ నటి సిల్క్ స్మిత. ప్రజల హృదయాల్లో గూడుగట్టుకున్న సినీ నటి అంటే అతి శయోక్తి కాదు. 1960 – 1996 వరకు సినీ రంగంలో తనదైన ముద్ర వేసిన కథా నాయిక సిల్క్ స్మిత. 1979లో తమిళ మూవీ 'వండిచక్కారం' సినిమాలో 'సిల్క్' పాత్ర పోషించడంలో ఫేమ్ అయ్యింది. ప్రజల దృష్టిని ఆకర్షించింది. అతి తక్కువ కాలంలో పేరు సంపాదించుకున్నది. హిందీ. తెలుగు, తమిళ భాషల్లో 450కి పైగా సినిమాల్లో నటించింది. ఆమె కెరీర్ పీక్‌లో ఉండగానే ఓ మలుపు తిరిగింది. నిర్మాతగా మారి రెండు సినిమాలు తీసింది. అవి రెండు అట్టర్‌ఫ్లాప్. ఒక్కసారిగా అప్పుల ఊబిలో కూరుకుపోయింది. ఆమెతో సినిమాలు తీసి సంపాదించుకున్న వాళ్లెవ్వరూ కష్టకాలంలో ఆమెను ఆదుకోవడానికి ముందుకు రాలేదు. పేదరికంలో పుట్టిన స్మితకు... ఈ ఆర్థిక నష్టాలు పెద్ద లెక్క కాదు. కానీ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయినట్లు పోలీసులు చెప్పారు. పోస్టుమార్టం చేసిన డాక్టర్లు ఆమె కడుపులో అరటిపండ్లు చాక్లెట్లు తప్ప మరో ఆహారం లేదని, చాలా రోజుల నుంచి ఆమె ఆహారమే తీసుకోలేదని తేల్చి చెప్పారు. అసలు ఆహారమే తీసుకోలేని స్థితిలోకి ఆమె ఎందుకు వెళ్లిపోయింది? నిజానికి ఆమే ఉరివేసుకుందా? ఎన్నో సమాధానం లేని ప్రశ్నలు. సిల్క్ స్మిత మరణంకూడా మిస్టరీలాగానే మిగిలిపోయింది.

ప్రేమరాహిత్యం...

ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడం, వచ్చిన విజయాన్ని నిలబెట్టుకునే స్థితి రాకపోవడం ఒక ఎత్తయితే... హీరోయిన్ల మరణాల విషయంలో కీలక పాత్ర పోషించింది ప్రేమ రాహిత్యం కూడా. అందుకు ఉదాహరణ జియాఖాన్. బ్రిటిష్ అమెరికా సంతతి యువతి జియాఖాన్ (1988 – 2013) న్యూయార్క్‌లో జన్మించినా.. బాలీవుడ్ లో 2007లో 'నిషాద్' సినిమాలో రంగ ప్రవేశం చేసింది. అమితాబ్ బచ్చన్ సరసన నటించింది. అదే సినిమాకు ఫిల్మ్ ఫేర్ అవార్డును అందుకున్నది. పలు ప్రాంతీయ భాషా చిత్రాల్లో నటించిన జియాఖాన్ ఆత్మహత్య చేసుకుంది. ప్రేమించిన వ్యక్తి కాదన్నందుకు... తన ప్రాణాలనే వదిలేసింది. గత ఏడాదే మరణించిన టీవీనటి, చిన్నారిపెళ్లికూతురు ఫేమ్ ప్రత్యూష బెనర్జీ విషయంలోనూ ఇదే జరిగింది. ఆమె కెరీర్ మంచి



పీక్‌లో ఉండగా... ప్రేమించిన వ్యక్తి మరో పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. ఎంగేజ్‌మెంట్‌దాకా వెళ్లింది. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. తరువాత ప్రత్యూష శవమై తేలింది.

హాలీవుడ్ మిస్టరీ

ఇది ఒక్క టాలీవుడ్, బాలీవుడ్‌కో మాత్రమే పరిమితం కాలేదు. ఫ్యాషన్ ఐకాన్ మార్లిన్ మన్రో విషయంలోనూ ఇదే జరిగింది. ఆమె నవ్వితే హాలీవుడ్ నవ్వింది. ఏడిస్తే ఏడ్చింది. బార్బాంక్ అనే ఫోటోగ్రాఫర్ దృష్టి ఆమెపై పడడంతో సినిమా అధ్యాయానికి తెర లేచింది. 1946లో మన్రో తన మొదటి చిత్రం ది అస్ఫాల్ట్ జంగిల్' ఒప్పందంపై సంతకం చేసింది. అక్కడ మొదలైన ఆమె ప్రస్థానం సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే దిశగా అడుగేసింది. అందానికి తోడు ఆహార్యం...ఆ ఆహార్యానికి తగ్గ అభినయంతో మన్రో ఇక హాలీవుడ్లో తిరుగులేని



నటిగా గుర్తింపు తెచ్చుకుంది. హాలీవుడ్‌ని మహారాణిలా ఏలింది. విజయాలకు, ఘన విజయాలకు అలవాటు పడిన మన్రోకు అపజయాలు ఎదురయ్యాయి. అపజయ భారంతో మన్రో కుంగిపోయింది. ఒక వైపు వ త్తిజీవితం, మరోవైపు వ్యక్తిగత జీవితం రెండూ సంక్షోభంలో పడ్డాయి. 1962 ఆగస్ట్ 5న నటి మార్లిన్ మన్రో చనిపోయింది. లాస్ ఏంజిల్స్‌లోని మన్రో ఇంట్లోని బెడ్ దగ్గర స్లీపింగ్ పిల్స్ కనిపించాయి. కొందరు హత్య అన్నారు. మరి కొందరు ఆత్మహత్య అన్నారు. ఇంకొందరు 'డ్రగ్' ఎక్కువగా తీసుకోవడం వల్ల చనిపోయింది అన్నారు. చివరికి చివరి కారణాన్నే అధికారికంగా ధ్రువీకరించారు. ప్రపంచ ఫ్యాషన్ ఐకాన్ అలా అర్ధాంతరంగా తనువు చాలించింది.

పుట్టి, పెరిగిన నేపథ్యం వేరు. రంగుల ప్రపంచం వేరు. రెండింటి మధ్య పెద్ద వైరుధ్యం. దాన్ని సమన్వయం చేసుకునేందుకు మానసికంగా, ఆర్థికంగా, శారీరకంగా ఎంతో సంఘర్షణ. పెనుగులాట. వీటికితోడు సహజంగా ఉండే ప్రేమ, ఆకర్షణలు. అన్నింటినీ అర్థం చేసుకుని అడుగేయడంలో ఎక్కడో తొట్రుపాటు. ఫలితం అంతులేని మనోవేదన. ఇవన్నీ కలగలిపి అనారోగ్యాలకు అకస్మిక మరణాలకు, ఆత్మహత్యలకు కారణమవుతున్నాయి. ఎన్నో కలలతో కళల ప్రపంచంలోకి అడుగుపెట్టిన కళ్లు.. అవేవీ చూడకుండానే కనుమరుగైపోయాయి. పోతున్నాయి. ఇన్ని జీవితాలను చూశాకనైనా ఈ తరం ఆచితూచి అడుగు వేయాలి. ఆర్థిక క్రమశిక్షణ అలవరుచుకోవాలి. వ్యక్తిగత, వృత్తిగత జీవితాలను కాపాడుకోవాలి.

ముఖం తాజాగా...

నిమ్మరసం: నిమ్మరసం మంచి బ్లీచింగ్ ఏజెంట్. ముఖంపై నలుపు రంగు ప్యాచెస్ ఉంటే ఆ ప్రదేశంలో నిమ్మతొక్కతో మసాజ్ చేయాలి. 15 నిముషాల తర్వాత చల్లటి నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. ఇలా వారానికొకసారి చేస్తే సరిపోతుంది.

ఆరెంజ్ జ్యూస్: ఆరెంజ్ జ్యూస్ కూడా నేచురల్ బ్లీచింగ్ ఏజెంట్. అయితే నిమ్మలో కంటే ఎక్కువ ఔషధగుణాలు ఆరెంజ్‌లోఉంటాయి. కాబట్టి సెన్సిటివ్ స్కిన్ ఉన్నవారు ఆరెంజ్ జ్యూసును ముఖానికి అప్లై చేసి పది నిమిషాల



తర్వాత కడిగితే ముఖం తాజాగా తయారవుతుంది.

తేనె: తేనె నేచురల్ ఎక్స్ ఫ్లోయేటర్ గా పనిచేస్తుంది. ఇది మృత కణాలను తొలగిస్తుంది. దీని వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్సు ఉండవు.

కలబంద : కలబంద సహజ సిద్ధమైన యాంటీ ఆక్సిడెంట్. ముఖంపై ముడతలు, మొటిమలు ఉన్నవారు రాత్రి పడుకునే ముందు ముఖానికి కలబంద రసాన్ని అప్లై చేసి పడుకోవాలి. మర్నాడు ఉదయం చల్లటి నీటితో కడిగితే మంచి ఫలితం కనిపిస్తుంది.

పాలు: పాలలో ల్యాక్టిక్ యాసిడ్ సమృద్ధిగా ఉంటుంది. ఇది డార్క్ ప్యాచెస్‌ను తొలగిస్తుంది. సెన్సిటివ్ స్కిన్ ఉన్నవారు ముఖానికి పాలను ఉపయోగించడం మంచిది. పాలు చర్మాన్ని మృదువుగా ఉంచడంతో పాటు హైడ్రేట్ చేస్తాయి.



తమలపాకు స్పెషల్స్...

చాక్లెట్ పాన్.. స్వీట్ పాన్.. కోవా పాన్.. మసాలా పాన్... ఇలా ఎన్ని రకాల పాన్‌లు ఉన్నాకూడా బేసిక్ ఇన్‌గ్రేడియెంట్ మాత్రం తమలపాకు. తమలపాకులో ఎన్నో పోషక విలువలు ఉన్నాయి. ఇవి ఎక్కువగా పండే దేశాలు ఇండియా, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక. అందుకే మన దేశ సంప్రదాయం ప్రకారం భోజనం అయిన వెంటనే తమలపాకు తాబులం తినాల్సిందే! తమలపాకు జీర్ణక్రియను వేగవంతం చేయడంతో పాటు ఇతర అనారోగ్య సమస్యలను దూరం చేస్తుంది. తమలపాకును డైరెక్టుగా తీసుకోని వారు స్నాక్స్ మాదిరి ప్రయత్నించి చూడండి! రుచికరమైన తమలపాకు స్పెషల్ స్నాక్స్ మీ కోసం...



తమలపాకు బజ్జీకూర...

కావాల్సిన పదార్థాలు: తమలపాకులు–ఆరు, శనగపిండి–ఒక కప్పు, బియ్యం పిండి–సగం కప్పు, తరిగిన ఉల్లిపయ–ఒకటి, తరిగిన పచ్చిమిరపకాయలు–రెండు, వంటసోడా–చిటికెడు, ఉప్పు–తగినంత, కారం–తగినంత, పసుపు–చిటికెడు, టమాటో పేస్టు–ఒక కప్పు, కరివేపాకు–రెండు రెమ్మలు, నూనె–వేయించడానికి సరిపడా.

తయారీ విధానం: ఒక పాత్రలో బియ్యపు పిండి, శనగ పిండి, కొద్దిగా కారం, సరిపడా ఉప్పు, చిటికెడు వాము, చిటికెడు వంటసోడా వేసి బజ్జీ పిండి మాదిరిగా కలుపుకోని పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత తమలపాకులను చిన్నగా కట్ చేసుకొని ముందుగా కలుపుకున్న బజ్జీ పిండిలో కలుపుకోని నూనెలో దోరగా వేయించుకొని పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత మరో పాత్రలో నూనె పోసి వేడి చేసుకోవాలి. నూనె కాస్త వేడి కాగానే దాంట్లో ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, కొద్దిగా కరివేపాకు, టమటా పేస్టు, పసుపు, ఉప్పు వేసి నూనెలో వేయించుకోవాలి. ఇవి నూనెలో వేగాక దాంట్లో బజ్జీలు, కొన్ని నీళ్లు పోసుకొని ఐదు నిమిషాలు ఉడికించుకుంటే సరిపోతుంది.

పకోడీ...

కావాల్సిన పదార్థాలు: తమలపాకులు–నాలుగు, శనగపిండి–సగం కప్పు, వాము–ఒక చెంచా, అల్లంవెల్లుల్లి పేస్టు–ఒక చెంచా, ఉప్పు–తగినంత, కారం–తగినంత, కొత్తిమీర–కొద్దిగా, కరివేపాకు–రెండు రెమ్మలు, నూనె–వేయించడానికి సరిపడా.

తయారీ విధానం: ముందుగా స్టవ్ మీద పాత్ర పెట్టి దాంట్లో నూనె పోసుకోవాలి. ఆ తర్వాత ఒక పాత్రలో శనగ పిండి, కొద్దిగా ఉప్పు, తగినంత కారం, వాము, కొత్తిమీర, కరివేపాకు తగినంత, తరిగిన తమలపాకులు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి చిక్కగా బజ్జీ పిండి మాదిరిగా కలుపుకోవాలి. ఆ తర్వాత నూనెలో వేయించుకుంటే చాలు వేడి వేడి పకోడీలు రెడీ! తమలపాకు పకోడీలను సాయంత్రం పూట స్నాక్స్ మాదిరి తీసుకుంటే సరిపోతుంది.

వడలు...

కావాల్సిన పదార్థాలు: తమలపాకులు–ఆరు, నానబెట్టిన శనగపప్పు–ఒక కప్పు, తరిగిన పచ్చిమిరపకాయలు–రెండు, జీలకర్ర–ఒక చెంచా, తరిగిన అల్లం–ఒక చెంచా, ఉప్పు–తగినంత, శనగపిండి–రెండు చెంచాలు, కొత్తిమీర–కొద్దిగా, నూనె–వేయించడానికి సరిపడా.

తయారీ విధానం: ముందుగా నానబెట్టుకున్న శనగపప్పును మెత్తగా కాకుండా కచ్చపచ్చగా గ్రైండ్ చేసుకోవాలి. ఇలా గ్రైండ్ చేసుకున్న శనగపప్పులోనే తరిగిన తమలపాకులు, కొద్దిగా శనగ పిండి, కొద్దిగా అల్లం, పచ్చిమిరపకాయలు, కొద్దిగా జీలకర్ర, రుచికి సరిపడా ఉప్పు, కొద్దిగా కొత్తిమీర, కొన్ని నీళ్లు పోసుకొని చిక్కగా కలుపుకోవాలి. ఆ తర్వాత స్టవ్ మీద పాత్ర పెట్టి దాంట్లో నూనె పోసుకోవాలి. నూనె వేడి కాగానే దాంట్లో వడలు వేసుకుంటే సరిపోతుంది.



తమలపాకు రోల్స్...

కావాల్సిన పదార్థాలు: తమలపాకులు–ఐదు, ఉడికించిన ఆలుగడ్డ–ఒకటి, మైదా పిండి–కొద్దిగా, సోంపు–ఒక చెంచా, ఆమ్‌చూర్–ఒక చెంచా, ధనియాల పొడి–ఒక చెంచా, ఉప్పు–రుచికి తగినంత, కారం–ఒక చెంచా, నూనె వేయించుకోవడానికి సరిపడా.

తయారీ విధానం: ముందుగా ఒక పాత్రలో ఉడికించిన ఆలుగడ్డ, కారం, ఉప్పు, ధనియాల పొడి, కొద్దిగా సోంపు, ఆమ్‌చూర్ పొడి వేసి బాగా కలుపుకోవాలి. ఇలా కలుపుకున్న మిశ్రమాన్ని తమలపాకు మధ్యలో పెట్టి గుండ్రంగా చుట్టి పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత మైందా పిండిని చపాతిలా చేసుకొని సన్నగా, పొడవుగా కట్ చేసుకోని తమలపాకు చుట్టు మైందా రోల్స్ ను చుడితే సరిపోతుంది. ఇలా చుట్టిన రోల్స్‌ను నూనెలో దోరగా వేయించుకుంటే సరిపోతుంది.

రోల్స్



బజ్జీకూర...





పకోడి...

మీ అత్తను ఆశ్రమంలో పడెయ్యి!

రంగనాయకమ్మ

- 2 -

'ఇల్లు' అనేది, మానవులకు స్వంత స్థలం, స్వంత జీవితం. 'ఆశ్రమం' అనేది, పరాయి స్థలం, పరాయి జీవితం. ఆశ్రమాల్లో, వృద్ధుల కోసం పనులు చేసే వారందరూ ఎవరు? వాళ్లు, స్వంత పిల్లలా? కారు. చాలీచాలని జీతాల తో, రాత్రింబవళ్లూ చాకిరీ చేసే డజన్ల, డజన్ల నిరుపేద యువతీ యువకులు! వాళ్లందరూ చిన్నతరాల వాళ్లే. పెద్ద తరాల కోసం పనులు జరగాలంటే, చిన్న తరాలు చెయ్యవలి సిందే కదా? మరి, మీ పిల్లలు మీకు చెయ్యరుగానీ, జీతాల వాళ్లు మీకు చెయ్యాలా? 'జీతాలు తీసుకుంటున్నారుగా? మ నకి చాకిరీలు చెయ్యక ఏం చేస్తారు?' అనుకుంటున్నారు గానీ, 'మన పిల్లలు మన కోసం ప్రేమతో చెయ్యడంలేదు' అని మీకు అర్థం అవుతోందా? 'జీతాల' వాళ్లు, 'వాళ్ల బతుకు దెరువుల' కోసం చేస్తారు గానీ, మీ మీద ప్రేమతో కాదు. 'ప్రేమ' ఎలా వస్తుంది? ఆశ్రమాల్లో చేరే వాళ్లల్లో కొందరైతే, పిల్లలు శ్రద్ధగా చూడడం లేదనే చేరతారు. కానీ, కొందరైతే, ఇంతకు ముందు చెప్పుకున్నట్టు, బిజినెస్‌గా చేరే వాళ్లే మిగ తావాళ్లు. పిల్లలు చూడక దూరం అయిన తల్లిదండ్రులు, ఆ పిల్లల మీద విమర్శతో వుండరు. ఆ పిల్లలు ఒక కాయో పండో పట్టుకుని ఎప్పుడైనా వస్తే, అదంతా 'ప్రేమే' అనుకుం టారు. అసలు, తమని వదిలేసిన పిల్లలు, మళ్లీ చూడడానికి వస్తే, అది నాటకం అని తోచదా? ఈ తల్లిదండ్రులు, వాళ్ల మొహాలు చూడవచ్చా? ఈ పెద్దల్లో ఏమైనా చీమూ నెత్తుర్లు మిగిలి వుంటే, వీళ్లు, ఆశ్రమం వారితో ఏం చెప్పాలంటే, "మా పిల్లలు వచ్చినప్పుడు వాళ్లని లోపలికి పంపకండి! వాళ్ల మొ హాలు చూడడానికి మాకు ఇష్టం వుండదు. వాళ్లని వెళ్లి పొమ్మని చెప్పండి! మాకు అందించమని ఒక పండో గిండో మీకు ఇస్తారేమో! అలాంటివి తీసుకోకండి! మీ మాటలు వాళ్లు నమ్మకపోతే, వాళ్ల ముందు మీరు మాతో ఫోనులో మా ట్లాడండి! స్పీకర్‌లో మేం చెప్పేది వాళ్లకి బాగానే వినపడు తుంది. ఇంకా వాళ్లకీ మాకూ సంబంధాలేమిటి?" అని కచ్చి తంగా చెప్పాలి. కానీ చెప్పరు. డబ్బు లేని పెద్ద వాళ్ల కోసం, ఆశ్రమానికి డబ్బుని కొడుకులే కడతారనుకోండీ! అదంతా 'ప్రేమే' అనుకుంటారు తల్లిదండ్రులు. "మా పిల్లలు వేరే దేశంలో వున్నారు" అంటారు. దూరంగా వున్నా, ఏడాదికి ఒక్క సారి కూడా రారు. టూరిజాలకు బాగా తిరుగుతూ వుంటారు. స్వదేశంలోనే, స్వంత పట్టణంలోనే వున్న పిల్లలు కూడా, పెద్ద వాళ్లని ఆశ్రమాల్లో చేర్చేసి, డబ్బు కట్టే సంఘటనలు బోలెడు జరుగుతున్నాయి. ఇదంతా పెద్ద వాళ్లని వదిలించుకునే ఎత్తుగడ! రేపు తాము కూడా పెద్ద వాళ్లమై పోతామనే ఆలోచన వుండదు. ఆ ఆలోచన వున్నా, తమ పిల్లలు తమని అలా చెయ్యరని ధీమాగా అనుకుంటారు. లేదా, రేపు తాము, ఆశ్రమాల్లో చేరడం 'గొప్ప నాగరీకత' అని కూడా అనుకుంటారు. నేను ఒకే ఒక్క ఆశ్రమాన్నే చూశాను. అది ఎమ్.వి.భద్రంగారు పెట్టింది. దాని మీద నా వ్యతిరేకత అప్పుడే చెప్పాను. అయినా ఆయనకి 'సంస్కరణ' దృష్టి. ఇతర ఆశ్రమాల్ని నేను చూడకపోయినా, చాలా విషయాలు ఇతరుల ద్వారా తెలుస్తూ వుంటాయి. ఆశ్రమంలో చేరిన పెద్దలకు, చిన్న చిన్న ఆస్తులూ, నగలూ, వంటివి వుంటాయి. అవన్నీ తమని నిరాదరంగా వదిలేసిన పిల్లలకే ఇచ్చుకుంటారు ఆ పెద్దలు. వాటిని ఆశ్రమాలకే ఇచ్చెయ్యవచ్చు కదా? అలా ఇవ్వరు. "మా ఆస్తి అంతా ఈ ఆశ్రమానికే ఇస్తాం. మమ్మల్ని చివరి దశ దాకా చూడండి! మా మరణాలు జరిగినప్పుడు, మా అంత్యక్రియలు మీరే చేయించండి! మా పిల్లల నీడలు, మా కళేబరాల మీద పడకూడదు. మా కళేబరాలకు అవమానాలు జరగనివ్వకండి! మీరే మా అంత్యక్రియలు జరిపించెయ్యండి! మాకు చిన్న దినాలూ, పెద్ద దినాలూ, ఏమీ అక్కరలేదు. మీకు కాస్త గుర్తు వచ్చినప్పుడు మమ్మల్ని తల్చుకోండి! అది చాలు" అని చెప్పి, అదంతా ఒక కాయితం మీద రాసి, ఆశ్రమం వారికి ఇవ్వాలి. తమకు ఎంత ఆస్తి వున్నా దాన్ని ఆశ్రమానికే అప్పజెప్పాలి. పిల్లలు వదిలేసే వాళ్లని ఆ ఆశ్రమం చూస్తుంది కదా? కానీ, ఈ తల్లిదండ్రులకు చీమూ నెత్తుర్లు వుండవు. తమ మరణాలూ, కర్మ కార్యక్రమాలూ, పిల్లల దగ్గిర జరగకపోతే, స్వర్గానికి వెళ్లమేమో అనుకుంటారు. అంతా పరువు భయాలు. పిల్లల మీద ప్రేమలు ప్రదర్శించాలనే అనుకుంటూ, తమని తాము అవమానం చేసుకుంటారు. ప్రేమ లేని చోట ప్రేమ కోసం వెతికి 'ప్రేమ' అనే ఉత్తమ భావానికే అవమానం చేస్తారు.

నాకు బాగా తెలిసిన 2 ఉదంతాలు చెపుతాను. వృద్ధుల కోసం ఆశ్రమాలు అంటే, ఒళ్లు మండిపోయే నేను, ఒక కోడలికి, "మీ అత్తని ఆశ్రమంలో చేర్చెయ్యి!" అని సలహాలు చాలా సార్లు ఇచ్చాను. ఎందుకంటే ఆ అత్త, మనిషి రూపంలో వున్న రాక్షసి. కోడలు నిజంగా నోట్లో నాలుక లేని పిచ్చి మనిషి. అత్త కొడుకు అసమర్థుడు. తల్లి ఎలా వాగినా విని వూరుకుంటూ వుండే రకం. ఆ అత్త, ఇంటికి ఏ బంధువు వచ్చినా, కోడలి గురించి ఎలాగో ఎత్తి, "మా వాడు, ఎంతో అందంగా వుంటాడు కదా చిన్నప్పుడు? మా వాడికి అందమైన పిల్ల దొరకలేదమ్మా ఇప్పుడైతే కాస్త రంగులూ ఫింగులూ రాసుకుని, మీకందరికీ బాగానే కనపడుతుంది గానీ, ఆ రంగులు లేకపోతే, దాని మొహం కన్నా నా ముసలి మొహమే అందమైందంటారు మీరే. నా కొడుక్కి అదృష్టం లేదు, దానికి అదృష్టం పట్టింది" ఈ రకంగా వాగుతూ వుంటుంది, బంధువులతో. కొడుకు పెళ్లి నాటి నుంచే ఈ వాగుడు. ఇదంతా ఆ కోడలి ముందే! ఆ కోడలు, ఆ బంధువులకు కాఫీలూ అవీ ఇస్తూ అక్కడే తిరుగుతూ వుంటుంది. ఏమీ మాట్లాడదు. పెళ్లయిన కొత్తలో, అత్త మాటలకు బాగా జడిసేది. ఆ జడుపే అలవాటైపోయింది. కోడలు కూడా మందుల కంపెనీలో సైంటిస్టుగా వుద్యోగం చేసిన మనిషే. ఒక రోజు కోడలు, ఒక కొత్త జాకెట్టు కుట్టించుకుని తెచ్చి, స్టాండు మీద పడేసి బైటికి పోయింది. రెండు రోజుల తర్వాత చూస్తే, ఆ జాకెట్టుకి కుడి భుజం మీద పెద్ద కన్నం పీకుళ్లుగా కనపడింది. "అయ్యో! ఇదేమిటి? కొత్త జాకెట్టు కూడానూ" అని కోడలు గోల పెడుతోంటే, అత్త, "ఏ ఎలకలో కొరికి వుంటాయి. ఎక్కడబడితే అక్కడ పడేస్తావు అన్నీ. వాడి సంపాదన వుంది కాబట్టి సరిపోతోంది నీకు" అంటూ కోడల్ని తిట్టడం మొదలుపెట్టింది. కోడలికి అర్థమైంది, అది అత్త పనే అని. కోడల్ని తిట్టడానికి ఆ అత్తకి ఏదో ఒక సాకు కావాలి. అది తెలుసు కోడలికి. ఆ చింపడం ఏదో, జాకెట్టుకి ఎడం చేతి మీద అయితే, దాన్ని కుట్టుకోవచ్చు. పైట కింద ఆ చిరుగులు కనపడవు. ఎలాగో ఆ కొత్త జాకెట్టుని తనే కుట్టుకుని ఇంట్లోనే వాడేది కోడలు. 'వంటల' సంగతులైతే, కొత్త కాపురం రోజుల్లో అత్తే అన్నీ చెబుతూ వుండేది. కోడలు, పుట్టింట్లో అన్నీ నేర్చుకున్న పిల్లే. ఇప్పుడు కోడలికి అరవయ్యో ఏడు రాబోతోన్నా, ఇప్పటికీ, కూరల్లో ఉప్పు కారాలు అత్త చూడవలిసిందే. కూర ఉడుకుతోందంటే, అత్తకి రుచి చూపించాలి. ఒక రోజు అలా అత్తకి చూపించకపోతే, ఆ పూట అత్త ఆ కూర తినదు. 'పచ్చడితో తినేస్తా" అని ఆ పూట అలాగే చేస్తుంది. అత్త కోసం సాయంత్రానికి కొత్త కూర, ఆమెకి రుచి చూపించి మరీ వండాలి.

(తరువాయి భాగం సోమవారం సంచికలో..)

ఆనాటి సంగీతం ఏమైంది?



విరాజిత (నిజాగ్ని)

సంగీతం నేడు ధ్వని కాలుష్యంతో విలవిలలాడుతోంది. ఆనాడు సాహిత్యానికి అనుగుణంగా సంగీతం వినడానికి వినసొంపుగా ఉండేది. నేడు సంగీత, సాహిత్యాలు వికాలంగులయ్యాయి. దీనికి కారణం మన సినిమా మ్యూజిక్ డైరెక్టర్స్ అని చెప్పవచ్చు. ఆనాటి చక్కని సాహిత్యానికి మెండైన సంగీతం అందించిన మ్యూజిక్ డైరెక్టర్స్ నేడు సంగీతంలో ధ్వనిని పెంచేయడంతో సాహిత్యం అర్థం కావడం లేదు. అందులోనూ తెలుగు పాటల సాహిత్యంలో ఇతర భాషల ప్రవాహం ఎక్కువైపోవడం, ఒక్క వాక్యం కూడా అర్థం కాకపోవడం వల్ల సాహిత్యం మరుగున పడిపోతోంది. సినిమా సంగీతాన్ని పక్కన పెడితే భారతీయ సంగీతం ఒక్కప్పుడు అనేక సంప్రదాయ రీతులలో భాసిల్లినది. వాటిలో ముఖ్యమైనవి కర్ణాటక, హిందుస్థానీ సంగీత సంప్రదాయములు. కర్ణాటక సంగీతం రెండు విధాలుగా చీలిందని చెప్పుకోవచ్చు. పండిత రంజక సంగీతం, పామర రంజక సంగీతం. హిందుస్తానీ సంగీతం ముఖ్యంగా రాజస్తాన్ ప్రాంతం నుండి వచ్చింది. ఇది చాలా విభాగాలుగా రూపాంతరం చెందింది. భక్తి సంగీతం ఇందులో కేవలం కొన్ని పద్యాలు, స్తోత్రాలు, శ్లోకాలు, భజనలు ఉంటాయి. కానీ ఈ సంగీతం కేవలం భక్తి ప్రధానమైనది. కాబట్టి ఎక్కువ జనాలకు చేరలేకపోయింది. పురాణాలు, ఇతిహాసాల నుండి కొన్ని విషయాలను తీసుకొని చెప్పే సంగీతం దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందినది. నిజానికి నాటక రంగ సాహిత్యం నేడు కనుమరుగైందనే చెప్పాలి. ఒకప్పుడు జానపద సంగీతం అందరినీ ఆకట్టుకునేది. నేడు విదేశీ సంగీతం వచ్చి మన దేశ ప్రాచీన సంగీతాన్ని తుడిచిపెట్టేసింది. దీనికి వివిధ కారణాలున్నాయి. సంగీతానికి సాహిత్యం ముఖ్యం. సాహిత్యం అంటే భాష. కానీ నేడు ఆంగ్ల భాష మన భారతీయ భాషలను సమాధి చేసేస్తున్నది. ఇలాంటి సమయంలో రాబోయే తరం పిల్లలకి మన సాహిత్యం, సంగీతం అందించలేకపోతున్నాం. మన తెలుగు రాష్టాలలో చెప్పుకోదగ్గ ప్రభుత్వ సంగీత పాఠశాలలు లేవు. ప్రభుత్వాలు సంగీతం, సాహిత్యం మీద పెద్దగా ఆసక్తి కనపరచవు కూడా. అందుకే మన తెలుగు రాష్ట్రాలలో సంగీతమంటే డబ్బు ఉన్న వారు ప్రైవేటుగా వేల రూపాయలు ఖర్చు పెట్టి నేర్చుకోవాలి. కావున సాధారణమైన వారికి సంగీతం అందదు. నిజానికి మొన్నటి వరకు సంగీతం, సాహిత్యం పండితులకే అబ్బేది. కేవలం వారు మాత్రమే ఎక్కువ నేర్చుకునే వారు. సాహిత్యంలో మార్పులు మనం గమనించవచ్చు. కానీ సంగీతంలో ఇంకా రావడం లేదు. ఒకప్పుడు సాహిత్యాన్ని పండితులే రాసేవారు. కానీ నేడు అందరూ రాస్తున్నారు. ఆ రంగంలో చాలా మంది రాణిస్తున్నారు కూడా. ఎందుకంటే సాహిత్యం నేర్చుకునేది కాదు, పుస్తకాలు చదివి తనను తాను మెరుగుపరుచుకోవచ్చు. కానీ సంగీతంలో గురువులు లేకుండా రాణించడం కష్టమైన పని. కావున ప్రభుత్వాలు పెద్ద ఎత్తున సంగీత పాఠశాలలు ఏర్పాటు చేసి సంగీతాన్ని సామాన్య ప్రజలు కూడా నేర్చుకునేలా చేసి మన సంగీతాన్ని కాపాడాల్సిన బాధ్యత వారు తీసుకోవాలి. ఏది ఏమైనా భారతదేశ సాహిత్యం, సంగీతం ఎప్పటికీ వన్నె తరగని కిరీటాలు. వాటిని పరిరక్షించి భావి తరాలకు అందించాలి.

సెల్ : 9700747280

అంధకారంలో ఫార్మ్-డి విద్యార్థుల భవితవ్యం



ఎస్.నవీన్‌రెడ్డి



రవళి



మౌనిక

అమెరికాస్థాయి వైద్య చదువు, పేరుకు ముందు డాక్టర్ హోదా, ఈ పేరు వల్ల సమాజంలో మంచి గౌరవం. ఎవరైనా ఇలాంటి ఛాన్స్ వదిలిపెట్టుకుంటారా? దీనికితోడు కేంద్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని చెప్పడం. ఇంకేముంది తల్లిదండ్రులు తమ పిల్లలను డాక్టర్లుగా చూడాలని ఆశపడతారు. కోర్సు కోసం విద్యార్థులు కూడా క్యూ కట్టారు. తల్లిదండ్రులు లక్షల్లో డొనేషన్లు, ఫీజులు కట్టారు. 2008 సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఫార్మ్-డి అనే కోర్సు ప్రారంభమైంది. చూస్తుండగానే 5 సంవత్సరాల కోర్సు పూర్తయింది. మరో సంవత్సరం ఆస్పత్రులలో ఇంటర్న్‌షిప్ కూడా అయిపోయింది. ఈ నేపథ్యంలో 4 బ్యాచ్‌లుగా సుమారు 12 వేల మంది విద్యార్థులు ఈ కోర్సు చదివారు. విద్యార్థులకు మాత్రం ఉద్యోగాలు రాలేదు. విద్యార్థుల తల్లిదండ్రులకు అప్పులు తప్ప ఏమీ మిగలలేదు. కోర్సు తెచ్చిన ప్రభుత్వాలు ఆ తర్వాత దాని ఊసెత్తడం మానేశాయి. డాక్టర్ రోగానికి తగ్గట్టుగా మందు రాస్తే దాన్ని ఎలా వాడాలి? ఎంత మోతాదులో వాడాలి? రోగికి ఆ మందు ఎంతమేర పనిచేస్తుందన్న విషయాలను చెప్పడమే ఫార్మ్-డి కోర్సు ముఖ్య ఉద్దేశ్యం. వైద్యులు ప్రిస్క్రిప్షన్ రాస్తే దానిని రోగి ఎలా వాడాలో సంపూర్ణ పరిజ్ఞానం వీరికి ఉంటుంది. ఫార్మ్-డి డాక్టర్లు ఔషధ సేవలను అందించడంలో ఎండీ వైద్య నిపుణులతో సరిసమానమైన నైపుణ్యతను కలిగి వుంటారు. అలాగే ప్రస్తుత కాలానికి తగినట్టు అధునాతన వైద్య పద్ధతులను అందిస్తారు. పేషెంట్ కౌన్సిలింగ్‌లోనూ ప్రాణాంతక రోగాలకు ఉపయోగించే ఔషధాల వల్ల కలిగే దుష్ప్రభావాలను తగ్గించడంలోనూ తర్ఫీదు పొంది ఉంటారు. ఇలాంటి నైపుణ్యం కలిగిన కోర్సును ప్రభుత్వాలు గుర్తించకపోవడంతో వారు ఆందోళన బాట పట్టారు. తెలంగాణ రాష్ట్రంలోని 65 కళాశాలల్లో ఫార్మ్-డి విద్యను అభ్యసిస్తున్న సుమారు 12 వేల మంది విద్యార్థులు గత 25 రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని దీక్షలు చేస్తున్నారు. ఫార్మ్-డి విద్యార్థుల ఉద్యోగ అవకాశాలపై అధ్యయనం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2015 సంవత్సరంలో త్రిసభ్య కమిటీని వేసింది. ఈ కమిటీలో డీఎంఈతోపాటు, డ్రగ్ కంట్రోల్ అథారిటీ నుండి ఒకరు, తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ నుండి మరొకరు వుండాలని జీవోలో ప్రభుత్వం పేర్కొంది. ఇంతవరకూ ఈ కమిటీ ఒక్కసారి కూడా సమావేశం లేదు. ఇప్పటివరకూ తెలంగాణకు ఫార్మసీ కౌన్సిల్ అనేదే లేదు. కమిటీ ఏర్పడి 2 సంవత్సరాలైనా ఇంతవరకూ ఉలుకూపలుకూ లేదు. ప్రభుత్వం మాత్రం త్రిసభ్య కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగానే తదుపరి కార్యాచరణ ఉంటుందని అంటున్నది. కేరళ, మహారాష్ట్రలలో మాత్రమే ఈ కోర్సును చదివిన విద్యార్థులకు అక్కడి ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పించాయి. కేంద్ర ప్రభుత్వం 2015లో ఫార్మసీ ప్రాక్టీస్ రెగ్యులరైజేషన్ పేరుతో ఒక చట్టాన్ని రూపొందించింది. దీనికి కేరళ, ఛత్తీస్‌ఘఢ్ ప్రభుత్వాలు ఆమోదం తెలిపాయి. దీనివల్ల ఫార్మ్-డి చదివిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశముంది. దీనికి ఇప్పటివరకూ తెలంగాణ రాష్ట్రం ఆమోదం తెలపలేదు. అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో క్లినికల్ ఫార్మసీ అవసరాన్ని గుర్తించి, రోగి సేవలకు వినియోగించవలసిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించడం లేదు. ఎంసెట్ ద్వారా ఈ కోర్సులో విద్యార్థులు చేరుతుంటారు. 4 సంవత్సరాలలో ఎంబీబీఎస్ పూర్తిచేసుకొని సంతోషంగా చాలా మంది వైద్య వృత్తిలో స్థిరపడి పోతుండగా, 6 సంవత్సరాల ఫార్మ్-డి కోర్సు పూర్తిచేసి ఎందుకూ పనికిరాకుండా పోతున్నామనే ఆవేదనలో ఫార్మ్-డి డాక్టర్లు వున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఫార్మ్-డి విద్యార్థుల సేవలను వినియోగించుకోవడం ద్వారా ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వాలు భరోసా ఇవ్వవచ్చు. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో డ్రగ్ ఇన్ఫర్మేషన్, పాయిజన్ ఇన్ఫర్మేషన్ సెంటర్లలో, పేషెంట్ కౌన్సెలింగ్ విభాగాలలో వీరి వైద్య సేవలను వినియోగించుకోవచ్చు. తద్వారా ఫార్మ్-డి చదువుతున్న వేలాదిమంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చు.సత్వరం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వా లు ఫార్మ్-డి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి.

సెల్ : 9912741649

కోలిండియా సింగరేణి సంస్థల మనుగడ ప్రశ్నార్థకమేనా?



ఎం.కష్ణ మోహన్

1973వ సంవత్సరంలో బొగ్గు రంగ జాతీయాకరణ ద్వారా కోలిండియా సింగరేణి సంస్థలకు గుత్తాధిపత్య రక్షణ కవచం తొడిగారు. ఆ రక్షణ కవచం ప్రధానమంత్రి అధ్యక్షతన జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల కమిటీ (సీసీఈఏ) తీసుకున్న నిర్ణయంతో తొలగించబడింది. ఈ నిర్ణయం వలన ప్రైవేట్ బొగ్గు సంస్థలు వ్యాపారపర ప్రయోజనాలకు బొగ్గు తవ్వకాలు చేయవచ్చును. ఇకపై ప్రైవేట్ సంస్థలకు పెద్ద, మధ్య తరహా, చిన్న గనులు బొగ్గు తవ్వకాలకు అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం ప్రైవేట్ రంగ సంస్థలు తమ స్వంత వినియోగానికి మాత్రమే బొగ్గు మైనింగ్ చేసే అర్హత కలిగి వున్నారు.

నేషనలైజేషన్ - డినేషనలైజేషన్

జాతీయం చెయ్యటం, ప్రైవేటీకరణ చెయ్యటం అన్నవి రెండూ పరస్పరం వ్యతిరేకమైనవి. సాధారణంగా కొన్ని రంగాలలో వున్న సంస్థలను జాతీయం చెయ్యటం పరిపాటి. జాతీయం అనగా ప్రభుత్వ యాజమాన్యం ఆస్తిగా గల సంస్థలు. ప్రముఖంగా చెప్పుకోవలసి వస్తే - రవాణా (ఉదా: భారత రైల్వే, ఆర్టీసీ) సమాచార (ఉదా: దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో) ఇంధన (ఉదా: హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్), రక్షణ (భార జల కర్మాగారం, బీడీఎల్), సహజ వనరులు (సింగరేణి, ఓఎన్‌జీసీ), బ్యాంకింగ్ (స్టేట్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్) రంగాలలో ఉన్న సంస్థలు ప్రభుత్వ అధీనంలో ఉంటాయి. ప్రభుత్వం - పరిపాలన, చట్టాలు తయారు చెయ్యటం, వాటిని అమలు చెయ్యటం, అన్ని రంగాల నియంత్రణ, పౌర, దేశ రక్షణ మొదలగు వాటికే పరిమితమై ఉండాలి అన్నది ఒక వాదన. అదే విధంగా ప్రభుత్వం - వ్యాపారం, ఉత్పత్తి, వస్తు/యంత్ర తయారీ రంగాలలో అడుగు పెట్టకూడదు అన్నది మరి కొందరి బలమైన వాదన, లేక నమ్మకం. జాతీయం లేక జాతీయాకరణ అన్నది సామ్యవాదం వైపు వేసే అడుగులు, మరి ప్రైవేటీకరణ అన్నది పెట్టుబడిదారీ విధానం వైపు వేసే అడుగులు. మొదటిది ఆర్థిక సమానత్వం నెలకొల్పే దిశగా ప్రయాణమైతే, రెండవది ఆర్థిక అసమానతలకు, గుత్తాధిపత్యానికి మార్గం వేస్తుంది. ప్రభుత్వ అధికారులలో అవినీతి అధికమని. అదే విధంగా ప్రభుత్వరంగ ఉద్యోగస్తులలో నైపుణ్యం నిబద్ధత తక్కువని కొంతమంది భావిస్తారు. ప్రభుత్వ రంగ సంస్థలలో, ప్రైవేట్ రంగ సంస్థలలో పని చేసేవారు ఒకే విద్యా వ్యవస్థ నుంచి వచ్చినవారు అన్న విషయం మనం గుర్తు పెట్టుకుంటే మన ఈ అపోహ నిరాధారమని మనమే గ్రహించగలం. వారిలో తేడాలు వ్యక్తిగతమే కాని సంస్థాగతం కాదు. దేశమంతా అవినీతితో, బంధుప్రీతి, కుల ప్రీతితో కొట్టుమిట్టాడుతోందన్న విషయం గ్రహించాలి. ప్రభుత్వ రంగంలో ఉన్న వాటిని ప్రైవేట్ రంగపరం చెయ్యటంలో ఉన్న కొన్ని ముఖ్యమైన ప్రమాదాలు, లోపాలు : 1. జాతీయ వనరులని కొంత మంది చేతిలో పెట్టి దేశ భవిష్యత్తు ప్రశ్నార్థకం చెయ్యటం. 2. స్వలా భం కోసం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టటం. 3.సహజ వనరు లను దుర్వినియోగం ఇంకా నష్ట పరచటం. 4.లాభాపేక్షతో అడ్డగో లుగా ధరలు పెంచటం, నాణ్యత విషయంలో ఏకపక్ష నిర్ణయాలు. 5.ఆర్థిక అసమానతలు, వ్యత్యాసాలు పెరగటం. 6. స్వదేశంలోనే, దేశ పౌరులు కొందరి దయాదాక్షిణ్యాలపై అధార పడాల్సి రావటం. 7.ఉద్యోగ వకాశాలు సన్నగిల్లటం, అర్హులకు అందవు. 8. సామాజిక స్పృహ లేని వ్యక్తుల చేతిలో దేశ ప్రయోజనాలు ఆవిరి అవ్వటం.

ప్రైవేటీకరణ విధానాలు

1.పెట్టుబడుల ఉప సంహరణ (డిస్ ఇన్వెస్ట్మెంట్) - ఈ విధానంలో ప్రభుత్వ రంగ సంస్థలలో ప్రభుత్వ వాటాను తగ్గించుకోవటం. అంత మేరకు వచ్చిన ధనం ఇతర ప్రాముఖ్యం గల రంగాలకి మళ్లించటం జరుగుతుంది. అయితే పెట్టుబడుల ఉపసంహరణ తర్వాత ప్రభుత్వ వాటా ఆయా సంస్థలలో 51శాతం కంటే తగ్గకుండా చూసుకోవటం. 2.ప్రభుత్వం ఆయా రంగాల నుంచి పూర్తిగా ఉపసంహరించుకోవటం. 3. ప్రైవేట్ సంస్థలను కూడా ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు వ్యాపారం చేసుకోవటానికి అనుమతించటం - స్టీలు పరిశ్రమ, ఇన్సూరెన్స్, టెలికాం రంగాలను ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. ప్రస్తుత నిర్ణయం ఈ కోవకు చెందుతుంది.

ప్రభుత్వ రంగ సంస్థలలో లోటు పాట్లు

ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగులలో సంస్థ శాశ్వతత్వం, ఉద్యోగ భద్రత వలన - కర్తవ్యం పట్ల, సంస్థ ఆదాయ వ్యయాల పట్ల ఒక నిర్లిప్తత ఉంటుంది. ఈ సంస్థకు ఏమీ కాదు, ఎంత నష్టాల ఊబిలో కూరుకుపోతున్నా, అమ్మకాలు లేకున్నా, డిమాండ్ పూర్తిగా సన్నగిల్లినా ఎటువంటి ఉలికిపాటు ఉండదు. నెలనెలా టంచనుగా ఫస్టుకి జీతం వస్తుంది, డీఏ పెంపు, జీతం సవరణలు విధిగా జరిగిపోతాయి. మరీ పరిస్థితులు చేయిదాటిపోతే రాజకీయ నాయకులూ, ప్రభుత్వాలు ఉండనే ఉన్నాయి. సంస్థను బయటకు లాగటానికి (బైల్ అవుట్), చేయూతనివ్వటానికీ. ఇదీ వారి భరోసా! ఇక మేనేజ్‌మెంట్ ధోరణి మరోలా వుంటుంది. వారు తమ స్థాయిని బట్టి - సంస్థ దీర్ఘకాలిక, స్వల్పకాలిక ప్రయోజనాలపై దష్టి పెట్టాలి. అది వదిలి చాలా మంది నిరంతరం అధికార సమయ దుర్వినియోగం, అధికార దుర్వినియోగం, స్వార్ధ ప్రయోజనాల కోసం సంస్థ ఆస్థులనూ, ఉద్యోగులనూ వాడుకోవటం, కీలక పదవుల వేట, కీలక విభాగాల్లో ప్రవేశానికీ, కొనసాగటానికీ చేసే ప్రయత్నాలలో నిమగ్నమై ఉంటారు.

ప్రస్తుత డినేషనలైజేషన్ నిర్ణయం - కోలిండియా, సింగరేణిలపై ప్రభావం

1.ప్రస్తుతం కోలిండియా, సింగరేణిల వివిధ గ్రేడ్ల బొగ్గు అమ్మకం ధరలు విదేశీ బొగ్గు, ల్యాండెడ్ కాస్ట్ కొలమానంగా తీసుకొని నిర్ణయం చెయ్యటం జరుగుతోంది. ఇక ముందు అలా చెయ్యటానికి వీలు లేదు. ప్రైవేట్ రంగ ఉత్పత్తి దారుల సామర్థ్యం వారి అమ్మకం ధరలను కూడా పరిగణన లోనికి తీసుకోవాలి. ప్రైవేట్ రంగ బొగ్గు కంపెనీలు తమ ఉత్పత్తితోపాటు దిగుమతి చేసిన బొగ్గుతో మిశ్రమం చేసి అమ్మే అవకాశాలను కూడా కొట్టి పారేయలేం. అటువంటప్పుడు వారి ధరల పోటీ తట్టుకోవడం కోలిండియా, సింగరేణిలకు నిజంగా కష్ట సాధ్యమే. 2. ప్రభుత్వ రంగ సంస్థల జీతాలు ఎక్కువ, ఇతర సదుపాయాలు ఎక్కువ. అందువలన వారి ఉత్పత్తి ఖర్చులో వేతన ఖర్చు శాతం అధికంగా ఉంటుంది. ఇది స్థిర వ్యయం. దాదాపు అధిగమించలేని అడ్డుగోడ. 3. యంత్రాల, పరికరాల స్థిర వ్యయం అధికంగా ఉండటం, వాటిని స్వల్ప కాలంలో నియంత్రించలేక పోవడం. 4.వయసు మీరిన ఉద్యోగస్తులు, వారి మారని/మార్చలేని ఆలోచనా ధోరణి. 5.పాత మైన్లు వాటిపై వెనక్కి తీసుకోలేని ఖర్చులు (సంక్ కాస్ట్). 6.చట్టాల ఉల్లంఘన, టాక్సుల, అప్పుల ఎగవేత అన్నవి ప్రైవేట్ రంగ సంస్థలకు సాధారణం. అందుచేత అవి వారికి కలసి వచ్చే విషయం. 7.ప్రభుత్వ రంగ సంస్థలలో నిర్ణయాలు కేంద్రీకతమై ఉంటాయి (సెంట్రలైజ్డ్ డెసిషన్ మేకింగ్), అందుచేత నిర్ణయాలు ఆలస్యం అవుతాయి. ఆలస్యం అన్నది వ్యాపార నిర్ణయాలకు గొడ్డలి పెట్టు, మరణాంతకం. 8.వ్యాపారం సఫలీకతం కావటానికి రిస్క్ తీసుకోవటమన్నది విడదీయరానిది. అది ప్రభుత్వ రంగ సంస్థలు నేర్చుకోవాల్సిన విద్య. 9.ప్రభుత్వ రంగ సంస్థలు సొంత ధనంతో వ్యాపారం చేస్తాయి, ప్రైవేట్ రంగ సంస్థలు అరువు తెచ్చిన సొమ్ముతో వ్యాపారం చేస్తాయి, అందుచేత ఎగకొట్టి వెళ్లి పొయే అవకాశం వారికి ఎక్కువ.

సెల్ : 9491144121

ఆడపడుచుల ఆక్రందనలు



ముహమ్మద్ ముజాహిద్

మూడున్నరేండ్ల క్రితం కొలువుదీరిన నరేంద్రమోడీ ప్రభుత్వం ముస్లిం మహిళలకు న్యాయం చేస్తానంటూ ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేసింది. లోక్‌సభలో ముస్లిం మహిళల వివాహ పరిరక్షణ చట్టం బిల్లును తీసుకొచ్చింది. రాజ్యసభలోనూ బిల్లును ప్రవేశపెట్టి లేదంటే ప్రత్యేక ఆర్డినెన్సును జారీచేసి ఎలాగైనా ముస్లిం మహిళలకు న్యాయం చేసి, వారికి విముక్తి ప్రసాదించాలని మోడీ పట్టుపట్టారు. సరే ఇదంతా బాగానే ఉంది, కానీ ఈ దేశ వ్యాప్తంగా మన ఆడపడుచులపై జరుగుతున్న అమానుషాలు పత్రికల్లో, టీవీ ఛానెళ్లలో చూస్తుంటే కలవరపెడుతున్నాయి. గుండెల్ని మెలిపెడుతున్న ఈ సంఘటనలు జరగడం అత్యంత దురదష్టకరం. 2017, ఆగస్టు 25న కట్టుకున్న భార్య క్షయ వ్యాధితో ప్రభుత్వ ఆస్పత్రిలో కన్నుమూసింది. మతదేహాన్ని తీసుకువెళ్లేందుకు చేతిలో చిల్లి గవ్వ కూడా లేదు. తన భార్యకు ఎలాగైనా స్వగ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించాలని ఆ భర్త తపన. ఆమె మతదేహాన్ని తరలించేందుకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఏ ఒక్కరూ సాయం చేయలేదు. చేసేదిలేక శవంతో దనమాజీ అనే ఆ అభాగ్యుడు ఏకంగా 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న మేల్ఘర కు కాలినడకన బయలుదేరాడు. అది అత్యంత వెనకబడిన ప్రాంతం. వాస్తవానికి ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మహాపారాయణ అనే పథకాన్ని ప్రారంభించారు. దాని ప్రకారం ప్రభుత్వ ఆస్పత్రిలో చనిపోయినవారి మతదేహాల ను స్వగ్రామాలకు ప్రభుత్వం తరపున ఉచితంగా తరలించాలి. కానీ ఈ ఆస్పత్రి వర్గాలు ఆ భర్త వేదనకు ఏ మాత్రం స్పందించలేదు. సొంతగా వాహనం సమకూర్చుకునే తాహతు లేదని చెప్పినా సిబ్బంది కరుణించలేదు. చేసేదిలేక ఒక వస్త్రంలో భార్య మతదేహాన్ని చుట్టి 60 కి.మీ. దూరంలో ఉన్న మేల్ఘర గ్రామానికి బయలుదేరాడు. 10 కిలోమీటర్లు వెళ్లిన తర్వాత కొంతమంది స్థానికులు వీరిని చూశారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అంబులెన్స్ సమకూర్చారు.

2017 సెప్టెంబర్ 5న బీహార్‌లో ఇలాంటిదే మరో దారుణం జరిగింది. ఓపీ కార్డు సమయానికి అందక.. ఓ చిన్నారి(9) ప్రాణాలు కోల్పోయింది. చివరికి ఆ అమ్మాయి చనిపోయిన తర్వాత మతదేహాన్ని తీసుకెళ్లేందుకూ అంబులెన్స్ ఇవ్వడానికి హాస్పిటల్ సిబ్బందికి మనసొప్పలేదు. దీంతో వేరే గతిలేక ఆ తండ్రి తన కుమార్తె శవాన్ని 4 కిలోమీటర్లు భుజాన మోసుకుంటూ వెళ్లాడు. లక్షిసరై జిల్లా కజ్రా గ్రామానికి చెందిన రామ్ బాలక్ దంపతుల విషాదమిది. కుమార్తె రౌషన్ కుమారి ఆరు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతుండటంతో ఎయిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడి సిబ్బంది తొలుత ఔట్ పేషెంట్ (ఓపీ) కార్డు తేవాలని చెప్పారు. నిరుపేద కూలి అయిన రామ్ బాలక్ ఓపీ కార్డు కోసం యత్నిస్తుండగా.. కుమార్తె పరిస్థితి తీవ్రంగా ఉందని అతని భార్య తెలిపింది. దీంతో వెంటనే తనకు ఓపీ కార్డు మంజూరు చేయాలనీ, తన చిన్నారి పరిస్థితి తీవ్రంగా ఉందనీ కౌంటర్‌లో ఉన్న అధికారిని అభ్యర్థించారు. తనను ముందుకు వెళ్లనివ్వాలని లైన్లో ఉన్నవారిని వేడుకున్నారు. అయితే ఓపీ కార్డులిచ్చే ఆయన ససేమిరా అన్నారు. చివరికి ఓపీ కార్డు తీసుకుని వచ్చేసరికి రోషణ్ కుమారి ప్రాణాలు కోల్పోయింది. ఇదిలా కుమార్తె శవాన్ని ఇంటికి తీసుకువెళ్లడానికి అంబులెన్స్ కూడా ఏర్పాటు చేయలేకపోయింది హాస్పిటల్. దీంతో చేసేది లేక తానే భుజంపై వేసుకుని 4 కిమీ.లు నడిచి ఇంటికి తీసుకెళ్లాడు. 2017 సెప్టెంబర్ 5న ప్రముఖ మహిళా జర్నలిస్టును మతోన్మాదులు కిరాతకంగా చంపేశారు. 55 ఏండ్ల గౌరీ లంకేశ్ ఆమె ఇంట్లోనే తుపాకి గుండ్లతో నేలకూల్చారు. ఈ సంఘటన పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడిగా ప్రజాస్వామ్యవాదులు, జర్నలిస్టులు నిరసించారు. ఇప్పటికీ గౌరీ లంకేశ్‌ను చంపిన నిందితులు పట్టుబడలేదు. 2017 సెప్టెంబర్ 21న బనారస్ హిందూ యూనివర్శిటీలో విద్యార్థిని లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. అప్పట్లో ఈ ఘటనపై విద్యార్థుల ఆందోళన హింసాత్మకంగా మారింది. హాస్టల్‌కు వెళ్తున్న ప్రథమ సంవత్సరం విద్యార్థినిపై ఇద్దరు మోటర్ బైక్‌పై వచ్చి లైంగికంగా వేధించారు. ఈ విషయాన్ని హాస్టల్ విద్యార్థినిలు యాజమాన్యానికి చెప్పినా లాభంలేక ఆందోళనకు దిగారు. విద్యార్థినులపై లాఠీఛార్జీ చేస్తే క్యాంపస్ గేటు ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ప్రధాని మోడీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఈ సంఘటనపై చోద్యం చూస్తూనే ఉండిపోయారు.

దేశవ్యాప్తంగా ఆడపడుచుల దుస్థితికి, మహిళలపై అత్యాచారాలు, కిడ్నాప్‌లు, హత్యలు, లైంగిక వేధింపులకు మచ్చుతునకలు మాత్రమే. నిత్యం ఆడపడుచుల శీల, మానాలకు రక్షణ లేకుండా పోతోంది. కళాశాలలు, పాఠశాలలు, పని ప్రదేశాలు చివరికి ఇండ్లల్లోనూ రక్షణ లేకుండా పోయింది. అభద్రతా భావానికి లోనవుతున్న సంఘటనలు సగటు మనిషి మనస్సును కలచివేస్తున్న సంఘటనలు పైన చెప్పినవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఈ సంఘటనలలో ఏ విషయంలోనూ ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో చిత్తశుద్ధిని నిరూపించుకోలేకపోయింది. మోడీ ప్రధానమంత్రి స్థాయిలో మహిళల గౌరవ మర్యాదలకు, శీల, మాన, ప్రాణాలకు రక్షణ కల్పించడంలో చిత్తశుద్ధి ఉంటే దేశవ్యాప్తంగా మన మహిళలపై ఇన్ని అమానుషాలు జరుగుతుంటే మన మహిళల అభివద్ధి, స్వావలంబన ఎలా సాధ్యమో? అన్న ప్రశ్నపై తీవ్రంగా యోచించాలి.

సెల్ : 9640622076

రాజకీయ పలుకుబడితోనే మహిళా సమస్యల పరిష్కారం



ప్రొ॥కె.విద్యాసాగర్‌రెడ్డి

వర్తమాన రాజకీయాల్లో ప్రజాస్వామ్య ప్రభుత్వాలంటేనే అందరికీ ఆసక్తి, ఆకర్షణ కూడా. ప్రజాస్వామ్యంలో ఆది నుండి తుది వరకు ప్రజలదే పైచేయి. ప్రజాభీష్టం మేరకు ప్రభుత్వం ఏర్పాటు, నడవడి, మనుగడ జరుగుతాయి. ప్రజల రాజకీయ హక్కులైన ఓటు, సీటు ద్వారానే అటువంటి ప్రభుత్వాలు పనిచేస్తాయి. పాలితులు వివిధ వర్గాలుగా, సమూహాలుగా విడిపోయి ఉన్నప్పటికీ తామెంచుకున్న పాలకులు కలిసుం డా లనే భావన నెలకొని ఉంది. అందుకే, పాలకు లంతా ఏకమై పాలితులపై ఆజమాయిషీ, పెత్తనం సాగిస్తుంటారు. ఈ పాలితులు ఓటర్లుగా మరింత విడిపోయి, కలహించుకొని తమకు దాసోహమనాలని పాలకులు కోరుకుంటారు. అందుకే పాలితుల మధ్య నెలకొని ఉన్న సామాజిక, వ్యక్తిగత స్పర్ధలు పెంచి పోషించబడతాయి. సామాజిక అశాంతికి, హింసకు కారణమవుతాయి. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సాధికారత పక్కనబెడితే కనీసం వారిలో సామరస్యం లేని పరిస్థితి కన్పిస్తుంది. నిరంతరం ప్రజా సమూహాలు అంతర్యుద్ధ వాతావరణంలో కొట్టుమిట్టాడుతాయి. సహజంగా ఇలాంటి పరిస్థితుల వల్ల, శాంతి భద్రత సమస్యలు తలెత్తి పోలీసు, పారా మిలటరీ, మిలటరీ నిర్మాణాలపై ప్రభుత్వాలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఆ విధంగా రాజకీయమంటే తగవులు పెంచి పోషించటమని అర్థమయ్యే పరిస్థితి నేడు ఉంది. ఈనేపథ్యంలో పరిశీలిస్తే విభజించి పరిపాలించే రాజకీ యాలదే పైచేయి తప్ప, కలిపి ఉంచి పరిపాలించే రాజకీయాలది కాదు. అందుకే మనువాద భావజాలమున్న రాజకీయాలు, సిద్ధాంతాలు, పార్టీల నేతలు మాత్రమే నేడు రాజకీయాల్లో గెలుపొందగలుగుతున్నారు. ప్రజలను విభజించటానికి మతం, కులం, ప్రాంతం, భాషా తదితర అంశాలను ఉపయోగించి, ఎన్నికల్లో లబ్ది పొందగలుగుతారు. వీటన్నింటికీ మించిన విభజన అంశం లింగ బేధం అయినప్పటికీ దాన్ని తెరపైకి రాకుండా కప్పిపుచ్చగలుగుతున్నారు ఈనాటి మనువాద పార్టీలు. నిజానికి మనిషికి మరో మనిషికి మధ్య లింగ విభజన తద్వారా అనేక సహజ బేధాలు స్త్రీ, పురుషుల్లో ఏర్పడి ఉన్నాయి. పుట్టుక నుండి చావు వరకు ఈ భేదాలు కొనసాగుతుంటాయి. జీవితకాలమంతా ఈవిభజన వల్ల ఆడవారి జీవితాలు మగవారి జీవితాలకంటే భిన్నంగా సాగుతుంటాయి. ఇంటా బయటా ఆ భేదాలు ప్రదర్శితమవుతాయి. ఒకరిపై మరొకరు అంటే స్త్రీపై పురుషుల పెత్తనం కొట్టొచ్చినట్టు కన్పిస్తుంది. అంతకుమించిన శారీరక, మానసిక తదితర విషయాల్లో దాడులు కొనసాగుతాయి. ఇటువంటి విభజన ప్రాతిపదికన రాజకీయాలెందుకు జరుగవో గాని దీని వల్ల పురుషులే లబ్ధి పొందుతున్నారు. ఏ రంగంలో చూసినా మగవారికే అత్యధిక అవకాశాలు హక్కులు, వున్నాయి. ఆడవారికి కేవలం కొన్ని విషయాల్లో తప్పితే మిగతా అన్ని చోట్లా అరకొర అవకాశాలే. అదేమంటే పితృస్వామ్యమంటారు. మగవారి ఆధిపత్యంలో స్త్రీలుండాలంటారు. ఆడవారిలో ఆ మేరకు శక్తి సామర్థ్యాలు లేవంటారు. వారిలో ఆత్మ విశ్వాసం కొరవడిందంటారు. అసలు రాజకీయాల్లో, ప్రభుత్వాల్లో వారు పనికిరారని కాకమ్మ కథలు చెబుతుంటారు. పెత్తనం చేయగల సత్తా తమకే ఉంటుందనీ, పరిపాలన తామే సరిగ్గా చేయగలమనీ కొందరి మగమహారాజుల భ్రమలు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ఏర్పడిన అన్ని ప్రభుత్వాల్లో ఈ మనువాద మగ మహారాజులదే పెద్ద పీట. సర్పంచ్ నుండి దేశాధ్యక్షుడి వరకు అన్ని కీలక పదవుల్లో మగ వారే ఉండేది. అత్యధిక సభ్యులు వారే. పదవులు, చట్ట సభల్లో ఆడవారి ప్రాతినిధ్య అత్యల్పం. ఆపాటి ప్రాతినిధ్యం కూడా తమ ఆడుగులకు మడుగులొత్తే ఆడవారిని కుటుంబ సభ్యులను రాజకీయ డమ్మీలుగా, రిమోట్‌లుగా పనికొచ్చే కొందర్ని చూస్తుంటారు. పేరుకు మాత్రమే వారు చట్టసభల్లో, మంత్రివర్గాల్లో ఉంటారు. తప్ప నిజమైన అధికారాలు వారింటిలో ఉండే మగవారిదేనని తెలుస్తుంది. ఇటీవలే ఉత్తర్‌ప్రదేశ్ మంత్రి స్వాతిసింగ్ ఇప్పటికీ తన భర్తదే పెత్తనమని సభాముఖంగా అంగీకరించారు. బయటికి చెప్పలేని మహిళా నేతలందరు ఇలాంటి అనుభవాలు కలిగి ఉండవచ్చు కూడా. దానర్థం నేటి రాజకీయాల్లో మహిళ పాత్ర కేవలం నిమిత్తమాత్రమే. నేటి అస్తవ్యస్త పాలనకు పూర్తి బాధ్యత మగమహారాజులదే.

రాజకీయాల్లో సగభాగముండాల్సిన మహిళలు ఇలా ప్రేక్షక పాత్ర పోషించినందువల్లనే దేశంలో అన్ని ప్రాంతాల్లో వివిధ స్థాయిల్లో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఎటువంటి సమస్యకు శాశ్వత ప్రాతిపదికన పరిష్కారం లభించకపోగా, మరిన్ని కొత్త సమస్యలకు తెరతీస్తున్నాయి. దేశం, రాష్ట్రం ప్రజలు వివిధ సమస్యల వలయంలో చిక్కుకొని ఉన్నారు. ఒకవైపు ఆర్థికపరమైన పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, అనారోగ్యం, అప్పులపాలు లాంటి సమస్యలుండగా మరోవైపు ఆర్థికేతర సమస్యలు మనిషిని పీడిస్తున్నాయి. మతపరమైన దాడులు, కుల, ఉపకులపరమైన వివక్ష, దోపిడీ, ప్రాంతీయ అసమానతలు, భాషాపరమైన భేదాలు నిరంతరం తెరపైకొస్తున్నాయి. వీటి పర్యావసానమే సామాజిక సామరస్యం కొరవడి, మనిషిని మరో మనిషి, సమూహాన్ని మరో సమూహం దోచుకునే పరిస్థితి దాపురించాయి. పితృస్వామిక వ్యవస్థను కొనసాగించే రాజకీయ పార్టీలో మనుగడ సాగిస్తున్నాయి. మగవారి పెత్తనాన్ని అరికట్టలేని ఈ అసమాన సమాజం వల్ల ఆడవారి సమస్యలు దినదిన గండంగా మారాయి. ఆర్థికమైన, ఆర్థికేతరమైన, చివరకు బలయ్యేది సగటు కుటుంబాలు, వాటికి మూలమైన ఆడవారేనని తెలుస్తుంటే సమస్యలను ఏకరువు పెట్టడం సరే, తక్షణ కర్తవ్యమేదో గ్రహించాలి. అందుకవసరమైన అడుగులేయాలి. అదేదో ఇప్పుడే చేయాలి. ఆ పని మనమే చేయాలి. మన సమస్యలకు కారణమైన మనువాద, పితృవాద భావజాలమున్న రాజకీయలైనప్పుడు, వాటిని సంస్కరించాలి. అవసరమైతే త్యజించాలి. అంతేగాని చిన్న చిన్న చిట్కాలతో రాజకీయ మార్పులతో ప్రస్తుత యథాతథ సామాజిక వ్యవస్థను నిర్మూలించలేం. పూర్తిస్థాయిలో రాజకీయ శస్త్ర చికిత్స చేసినప్పుడే వ్యవస్థలోని లోపలి, బయటి సమస్యలను పరిష్కరించగలం. ఆ దిశలో అడుగేయాలంటే తరతరాలుగా కొనసాగుతున్న మగవారి పెత్తనంలో నడుస్తున్న మగవారి రాజకీయ పార్టీలను, నేతలను ఎన్నికల్లో మట్టికరిపించాలి. రాజకీయ పార్టీల్లో కనీసం సగభాగమైన మహిళా శక్తి లేకుండా, మహిళా రాజకీయాలను ఊహించలేం. మహిళా నేతగా, మహిళ శక్తే సగభాగమున్న రాజకీయ వేదికను ఆవిష్కరించాల్సిన సమయం ఆసన్నమైనది. రాజ్యాధికారంలో తమ వంతు వాటా అన్ని మతాలు, కులాలు, ఉపకులాలు అడిగిన విధంగా మహిళలు కూడా 50శాతం అవకాశాలు పొందాలి. అప్పుడే మహిళా శక్తికి గుర్తింపు. ఆ మేరకు న్యాయం సాధ్యం. కాదంటే అంతేసంగతులు. భారత రాజకీయాల్లో కాన్షీరాం ప్రయోగించిన బహుజన సమాజ సూత్రం వల్ల, ఆయన పార్టీ (బీఎస్‌పీ) ఏ పాటి లబ్ది పొందిందో తెలియదు గాని, దాదాపు అన్ని రాజకీయ పార్టీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు నేతలకు ప్రాతినిధ్యం పెరిగింది. కొందరు బహుజన నేతలు తెరపైకి వచ్చారు. బహుజన సమాజానికి సంబంధించిన సమస్యలు వెలుగు చూశాయి. ఎంతోకొంత మేలు జరిగింది. అలాగే మహిళా శక్తి ప్రాతిపదికగా ఆవిర్భవించే మహిళా రాజకీయ వేదిక కూడా మహిళా సమాజంలో చైతన్యం తెస్తుంది. ఆత్మవిశ్వాసం ఇనుమడింపచేస్తుంది. అనేక మంది మహిళలు, వెన్నెముక కలిగిన నేతలుగా రాణిస్తారు. తమవంతు వాస్తవ వాటా రాజకీయ పార్టీల్లో, ప్రభుత్వాల్లో పొందగలిగినప్పుడు మహిళా సాధికారత పెరుగుతుంది. అధికారంలో భాగస్వామ్యమున్న మహిళా శక్తి వల్లనే మహిళా సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. అప్పుడే వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆ మేరకు సమాజంలో జరిగే నిరంతర దాడులు, అఘాయిత్యాలు, అత్యాచారాలు అరికట్టబడతాయి.

సెల్ : 9436769468

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్లు లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా రాయాలి. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి.

- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@navatelangana.com Postal Address: M.H.Bhavan,plot No.21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020. Ph:27664520,27673787,9490099077/78. Fax:040-27652228

బోనాల సొమ్ముపై విజిలెన్స్ విచారణ

- దేవాదాయశాఖ మంత్రితో కమిషనర్ భేటీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బోనాల నిధుల దుర్వినియోగంపై దేవాదాయశాఖ కమిషనర్ ఎన్ శివశంకర్ విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్టు తెలిసింది. నిధుల దుర్వినియోగంపై ఆశాఖ మంత్రి ఏ ఇంద్రకరణ్‌రెడ్డి ఆరా తీసి, కమిషనర్‌తో చర్చించారు. విజిలెన్స్ విచారణ జరిపి 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఈ సందర్భంగా మంత్రి కమిషనర్‌ను కోరినట్టు సమాచారం. 'బోనాల సొమ్ము బొక్కేశారు' శీర్షికతో ఈనెల 26న నవతెలంగాణలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని దేవాదాయశాఖ మంత్రి ఏ ఇంద్రకరణ్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. మూడేండ్లుగా యుటిలిటీ సర్టిఫికెట్లు ప్రభుత్వానికి ఎందుకు ఇవ్వలేదని ఆయన కమిషనర్‌ను ప్రశ్నించారు. దీనిపై హైదరాబాద్ జిల్లా కలెక్టర్ యోగితారాణా ఇప్పటికే ఆ శాఖకు షోకాజ్ నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. నవతెలంగాణ కథనం తర్వాత తాజాగా ఆమె ఆశాఖకు మరో నోటీసు ఇచ్చారు. 15 రోజుల్లో యుటిలిటీ సర్టిఫికెట్లు ఇవ్వకుంటే క్రమశిక్షణా చర్యలు తప్పవని ఆ నోటీసులో హెచ్చరించారు. పత్రికా కథనం తర్వాత దేవాదాయ శాఖ అధికారులు తమకు ఇస్తున్న ప్రతి యుటిలిటీ సర్టిఫికెట్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. దానికి అనుబంధంగా ఉన్న బిల్లులపై కూడా వివరాలు తెలుసుకుంటున్నారు. మూడేండ్లలో బోనాల నిర్వహణ కోసం రాష్ట్రప్రభుత్వం రూ.18.15 కోట్ల నిధుల్ని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ సొమ్ములో దాదాపు రూ.15 కోట్ల వరకు వివిధ ఆలయ కమిటీల పేర్లపై చెక్కులు ఇచ్చేశారు. అయితే ఉనికిలో లేని ఆలయాలు, బినామీ కమిటీల పేర్లపై కూడా చెక్కులు ఇచ్చేశారనేది ఆరోపణ. చిన్న చిన్న ఆలయాలకు కూడా పెద్ద మొత్తంలో నిధుల్ని ఎలా ఇచ్చారనే విషయంపై విజిలెన్స్ విచారణ ర్యాండమ్‌గా జరగనుంది. చెక్కులు ఎవరికి ఇచ్చారు...ఆ ఆలయాలు ఉన్నాయా లేవా...కమిటీల్లో ఉన్నవారి పేర్లు, హోదాల పరిశీలనతో పాటు ప్రభుత్వం ఇచ్చిన నిధులకు అదనంగా ఆయా ఆలయాలు చందాల రూపంలో ఎంత సొమ్మును వసూలు చేశారు...దేనికోసం ఖర్చు చేశారు అనే వివరాలను కూడా పరిశీలించనున్నారు.

జర్నలిస్టులకు ప్రభుత్వ అండ

కౌన్సిల్ చైర్మెన్ స్వామిగౌడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని శాసనమండలి చైర్మెన్ కె.స్వామిగౌడ్ అన్నారు. బతుకుపై భరోసా కల్పించిందని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్షేమ నిధి చెక్కులను జర్నలిస్టుల కుటుంబాలకు పంపిణీ చేశారు. 74మంది లబ్దిదారులకు రూ.65.50లక్షల మేర ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాన ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనదని కొనియాడారు. ఉద్యమంలో జర్నలిస్టులు రెండడుగులు ముందుండి నాయకులను నడిపించారని గుర్తు చేశారు. రాజ్యసభ సభ్యులు కె.కేశవరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమంతో పాటు వృత్తిపరమైన శిక్షణకు అకాడమీ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ మీడియా సలహాదారు కెవి రమణాచారి మాట్లాడుతూ జర్నలిజంలో ఉన్నవారికి అక్రిడిటేషన్ అవసరమన్నారు. పింఛను పథకం కోసం గతంలో ప్రయత్నం చేసినట్టు చెప్పారు. మీడియా అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ నిధికి రూ. 100 కోట్లు ప్రకటించిందని గుర్తు చేశారు. కర్నాటక మీడియా అకాడమీ చైర్మెన్ సిద్దరాజు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందించారు. ఈకార్యక్రమంలో బుద్ధపూర్ణి ప్రాజెక్టు అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య, అకాడమీ పాలకమండలి సభ్యులు కె.శ్రీనివాస్, కె.శ్రీనివాసరెడ్డి, గౌరి శంకర్, స్టీవెన్‌సన్, అకాడమి కార్యదర్శి రాజమౌళి, సమాచార శాఖ అదనపు డైరెక్టర్ నాగయ్య కాంబ్లె, జాయింట్ డైరెక్టర్ సుజాత, జర్నలిస్టు సంఘం నాయకులు పల్లె రవికుమార్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న స్వామిగౌడ్

నపుంసక చట్ట సవరణపై ఆలోచించండి

- ప్రభుత్వానికి కోర్టు సూచన

నవతెలంగాణ-హైదరాబాద్

నిజాం పాలనలో 1919లో హిజ్రాల కోసం తెచ్చిన తెలంగాణ యూనక్స్ (నపుంసక) చట్ట నిబంధనలు ఘోరంగా ఉన్నాయని, ఈ చట్ట సవరణపై ప్రభుత్వం ఆలోచన చేయాలని హైకోర్టు సూచించింది. తాము చట్టాన్ని కొట్టేయకముందే ప్రభుత్వం స్పందిస్తే బాగుంటుందని పేర్కొంది. హిజ్రాల వద్ద పదిహేను పదహారు ఏండ్ల బాలుడు ఉండకూడదనే ఆ చట్ట నిబంధన ఆమోదయోగ్యంగా లేదని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ అభిప్రాయపడింది. హిజ్రాలు సంగీతం నేర్చుకోరాదని, డ్యాన్స్ చేయరాదనే చట్ట నిబంధనలు దారుణమని బెంచ్ వ్యాఖ్యానించింది. హిజ్రాల కారణంగా అఘాయిత్యాలు జరుగుతున్నాయా.. ఇతరుల కారణంగా పిల్లలపై అఘాయిత్యాలు జరగడం లేదా అని బెంచ్ ప్రశ్నించింది. హైదరాబాద్‌కు చెందిన వసంత, మోనాలీసా ఇతరులు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని బెంచ్ విచారించింది. పిల్లల్ని యూనిక్స్‌గా మార్చేస్తారనే దారుణ చట్టాన్ని రద్దు చేయాలని, యూనిక్స్ అనే పదాన్ని కర్నాటక హైకోర్టు తప్పుపట్టిందని పిటిషనర్ లాయర్ వాదించారు.

మధ్యప్రదేశ్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్

- ఒడిషాలోనూ బీజేడీ విజయం • బీజేపీకి షాక్

భోపాల్: మధ్యప్రదేశ్‌లో బీజేపీకి షాక్ తగిలింది. ఇక్కడి రెండు అసెంబ్లీ నియోజవర్గాలైన ముంగాలి, కొలారస్ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరిగాయి. బుధవారం కౌంటింగ్ ప్రక్రియ జరగ్గా.. ముంగాలిలో కాంగ్రెస్ అభ్యర్థి బ్రజేంద్ర సింగ్ యాదవ్ తన ప్రత్యర్థిపై 2,214 ఓట్ల తేడాతో గెలుపొందాడు. బ్రజేంద్ర సింగ్‌కు 70,808ఓట్లు రాగా.. భాజపా అభ్యర్థి బైసాహబ్ యాదవ్‌కు 68,684 మాత్రమే వచ్చాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యే మహేంద్ర సింగ్ కలుఖేదా మ తి కారణంగా ఖాళీ అయిన ముంగాలి స్థానాన్ని మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థే కైవసం చేసుకున్నాడు. కొలారస్‌లోను కాంగ్రెస్ అభ్యర్థి గెలిచాడు.అలానే ఒడిషాలోని బీజేపూర్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో బీజేడీ అభ్యర్థి రీటా సాహు విజయం సాధించారు. భాజపా అభ్యర్థి అశోక్ పాణిగ్రాహిపై దాదాపు 42వేల ఓట్ల మెజార్టీతో రీటా విజయం సాధించినట్టు ఎన్నికల కమిషన్ వెల్లడించింది.

కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి కన్నుమూత

చెన్నై: తమిళనాడులోని ప్రసిద్ధ కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి(82) కన్నుమూశారు. గత కొంతకాలం నుంచి జయేంద్ర సరస్వతి శ్వాస సంబంధిత సమస్యలతో సతమవుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం మరోసారి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను చికిత్స కోసం కాంచీపురంలోని ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు ఆయనకు మెరుగైన చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో బుధవారం ఉదయం 9 గంటల సమయంలో కంచిలోని శంకర మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో ఆయన తుదిశ్వాస విడిచారు.

గత నెలలోనూ శ్వాసకోశ ఇబ్బందులతో అస్వస్థతకు గురైన జయేంద్ర సరస్వతిని చెన్నై పోరూరులోని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. కొన్ని రోజుల చికిత్స అనంతరం కంచి పీఠాధిపతి కోలుకున్న విషయం తెలిసిందే. జయేంద్ర సరస్వతి 1935, జులై 18న తమిళనాడులోని మన్నార్‌గుడి సమీపంలోని ఇరుల్‌నిక్కి గ్రామంలో జన్మించారు. అసలు పేరు సుబ్రహ్మణ్య మహాదేవ అయ్యర్. చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి అనంతరం 1954, మార్చి 24న కంచి పీఠానికి 69వ పీఠాధిపతిగా నియమితులయ్యారు. అనంతరం ఆయన పేరును జయేంద్ర సరస్వతిగా మార్చుకున్నారు.

నవచిత్రం

భరత్ విజన్ ఏంటి?



మహేష్‌బాబు

మహేష్‌బాబు హీరోగా నటిస్తున్న చిత్రం 'భరత్ అనే నేను'. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డి.పార్వతి సమర్పణలో డి.వి.వి. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై దానయ్య డి.వి.వి నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 20న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రానికి సంబందించిన 'ది విజన్ ఆఫ్ భరత్'ను మార్చి 6న విడుదల చేయబోతున్నారు. మరి 'ది విజన్ ఆఫ్ భరత్' ఏంటనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పొలిటికల్ డ్రామా నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో మహేష్ సరసన కైరా అద్వాని కథానాయికగా నటిస్తుంది. ప్రకాష్‌రాజ్, శరత్ కుమార్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు సంగీతం: దేవిశ్రీప్రసాద్, సినిమా టోగ్రఫీ: రవి.కె. చంద్రన్, ఎస్. తిరునవు క్కరసు, ఎడిటింగ్: శ్రీకర్‌ప్రసాద్.

కొత్త కథాంశంతో దండుపాళ్యం 4



కె.టి.నాయక్, శ్రీకాంత్, వెంకట్, బాబ్జీ

కె.టి.నాయక్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ వెంకట్ మూవీస్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ 'దండుపాళ్యం 4' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మకరంద్ దేశ్ పాండే, పూజా గాంధీ, రవికాలే, పెట్రోల్ ప్రసన్న, ముని, జయదేవా, కరిసుబ్బు, రవిశంకర్, స్నేహ, సంజయ్, అరుణ్ బచ్చన్, సోము ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్ర లోగో విడుదల కార్యక్రమం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. అతిథిగా విచ్చేసిన హీరో శ్రీకాంత్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'నా సినిమాల్లోని 'మహాత్మ 2', 'పెళ్లి సందడి2' సినిమాలు చేయాలని చాలా మంది అనుకున్నారు. కుదరలేదు. 'దండుపాళ్యం'కు ఉన్న క్రేజ్ ఎలాంటిదో తెలిసిందే. ముందు విడుదలైన సినిమాలు పెద్ద విజయం సాధించాయి. ఈ సబ్జెక్ట్ చాలా పెద్దది. ఎన్ని పార్ట్‌లైనా తీయొచ్చు. యదార్థ సంఘటనల ఆధారంగా వస్తోన్న ఈ తాజా చిత్రం కూడా పెద్ద హిట్ కావాలి' అని అన్నారు. 'నిజామాబాద్‌లోని ఆర్మూర్‌లో పుట్టిపెరిగి, తమిళనాడు, కర్నాటకలో స్థిరపడ్డాను. గత కొన్నేండ్లుగా పలు చిత్రాలకు రచయితగా పనిచేశా. ఈ చిత్రంతో దర్శకుడిగా మారుతున్నా. ఈ అవకాశం ఇచ్చిన నిర్మాత వెంకట్‌కు కృతజ్ఞతలు. తెలుగు, కన్నడలో బైలింగ్వల్‌గా సినిమాను తెరకెక్కిస్తున్నాం. నాకిష్టమైన జోనర్‌లో సినిమా చేసే అవకాశం రావడం హ్యాపీగా ఉంది. అందరి అంచనాలను అందుకునేలా ఈ చిత్రం ఉంటుంది' అని దర్శకుడు కె.టి.నాయక్ తెలిపారు. "బాహుబలి', 'దండుపాళ్యం' చిత్రాల రేంజ్ వేరైనా 'దండుపాళ్యం' భారీ క్రేజ్‌ను సంపాందించుకుంది. రెండవ పార్ట్ అనుకున్న విధంగా రాలేదు. అందులోని దర్శకుడు, ఆర్టిస్టులు ఎవరికీ పెద్దగా తెలియదు. దీనికితోడు వ్యక్తిగత ఆహం కారణంగా ఆ సినిమా బాగా ఆడలేదు. ఆ తర్వాత మూడవ పార్ట్ చేయలేదు. ఆ కసితో ఇప్పుడు నూతన దర్శకుడు నాయక్‌తో కలిసి నాల్గవ పార్ట్‌ను తెరకెక్కిస్తున్నాం. కె.టి.నాయక్ ఇంటిలిజెంట్. హార్డ్‌వర్కర్. అతనికి క్రైమ్ జోనర్ చిత్రాలు చేయడం ఇష్టం. ఈ చిత్రాన్ని ఎలా తీయొచ్చో చెప్పిన తీరు నాకు బాగా నచ్చింది. స్క్రిప్ట్ వర్క్ పక్కాగా రెడీ చేసుకున్నాక షూటింగ్ ప్రారంభించాలనుకున్నాం. ఈ నెల 8నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించనున్నాం. ఇందులో 'దండుపాళ్యం'లో ఉన్న ఆర్టిస్టులతోపాటు కొంత మంది కొత్త గ్యాంగ్ కూడా ఉంటుంది. గ్యాంగే కాదు, కథ కూడా కొత్తగా, ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటుంది. రియలిస్టిక్ సంఘటలనతోనే సినిమాను తెరకెక్కిస్తున్నాం. గత చిత్రాలను మించి ఉండేలా ఈ సినిమాను రూపొందిస్తున్నాం. కచ్చితంగా ఆడియెన్స్‌ను ఆకట్టుకుంటుందని ఆశిస్తున్నాం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో వోల్గా బాబ్జీ పాల్గొని చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు.

అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు



దాదాపు ఐదు దశాబ్దాలపాటు అందం, అభినయంతో యావత్ ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసిన అతిలోక సుందరి శ్రీదేవి అంత్యక్రియలు ముగిసాయి. అభిమానుల హృదయాలను భారంగా మార్చి ఎన్నో గొప్ప చిత్రాలతో, మరెన్నో మరుపురాని పాత్రలతో మైమరపించిన శ్రీదేవి హఠాన్మరణం సినీ లోకాన్ని శోకసంద్రంలో ముంచింది. మూడు రోజుల తర్వాత ఎట్టకేలకు శ్రీదేవి పార్థివదేహం మంగళవారం రాత్రి ముంబయికి చేరుకుంది. అభిమానులు, సినీ వర్గాలు ఆమెను కడసారి చూసేందుకు మంగళవారం నుంచే క్యూ కట్టారు. ముందుగా శ్రీదేవి పార్థివదేహంపై జాతీయ జెండాను కప్పి ప్రభుత్వ లాంఛనాలతో శ్రద్ధాంజలి ఘటించారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి అభిమానుల సందర్శనార్థం ముంబయిలోని సెలబ్రేషన్స్ స్పోర్ట్స్ క్లబ్ ఆమె పార్థివదేహాన్ని ఉంచారు. శ్రీదేవి భౌతికకాయానికి నివాళ్ళర్పించేందుకు పెద్ద సంఖ్యలో సినీ ప్రముఖులు, అభిమానులు అక్కడికి చేరుకున్నారు. ముఖ్యంగా దక్షిణాది చిత్ర రంగాలు టాలీవుడ్, కోలీవుడ్, శాండల్‌వుడ్, మాలీవుడ్, బాలీవుడ్‌కు చెందిన దిగ్గజాలు శ్రీదేవిని భౌతిక కాయాన్ని చూసేందుకు బారులు తీరారు. వారిలో చిరంజీవి, రజనీకాంత్, కమల్ హాసన్, అనిల్ కపూర్, అనుపమ్ ఖేర్, అమితాబ్ బచ్చన్, రేఖ, ఐశ్వర్యరాయ్, సంజీవ్ కపూర్, సోనమ్ కపూర్, షారూఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్, సంజయ్ లీలా భన్సాలీ, రేఖ, అజయ్ దేవగణ్, వెంకటేష్, కాజోల్, జయప్రద, అర్జున్ కపూర్, కరణ్ జోహార్, విశాల్ భరద్వాజ్, నగ్మా, సారా అలీఖాన్, టబు, మాధురీ దక్షిత్, రమేష్ షిప్పీ, సుభాష్ ఘాయ్, దీపికా పదుకొనె, రణ్‌వీర్ సింగ్, రణబీర్ కపూర్, జాన్ అబ్రహాం, జెనీలియా, రితేష్ దేశ్‌ముఖ్, సిద్ధార్థ్ మల్హోత్రా, షాహిద్ కపూర్, టైగర్ షరాఫ్, రాజ్ కుమార్ రావ్, వివేక్ ఒబెరాయ్, హేమా మాలిని, విద్యా బాలన్, సుస్మితాసేన్, జాక్వెలిన్, శ్రద్ధా కపూర్‌తోపాటు అనిల్ అంబానీ వంటి వ్యాపార, రాజకీయ వేత్తలు కూడా శ్రీదేవి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళ్ళు అర్పించారు. తుది వీడ్కోలు పలికారు. అంతిమయాత్రలోనూ తారాలోకం తరలివచ్చింది. కడసారి చూసేందుకు దేశంలోని నలుమూలల నుంచి అభిమానులు, సినీ ప్రముఖులు ఈ అంతిమయాత్రలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన అంతిమయాత్ర ఏడు కిలోమీటర్ల మేర సాగింది. విల్లేపార్లేలోని సేవా సమాజ్ శ్మశాన వాటికలో హిందూ సాంప్రదాయం ప్రకారం, మహారాష్ట్ర ప్రభుత్వం అదేశాల మేరకు పోలీసుల వందనంతో, అధికార లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు. శ్రీదేవికి తెల్ల పూలంటే ఇష్టమట. తన అంతిమయాత్ర అంతా తెలుపు రంగులో ఉండాలన్నది ఆమె ఆకాంక్ష అని ఒకానొక సందర్భంలో అన్నారట. దీంతో అంతిమయాత్రకు ఉపయోగించిన వాహనం మొత్తం తెల్లటి పూలతో అలంకరించారు. వాహనం లోపల శ్రీదేవి చిత్రపటాన్ని పెట్టి, దాని చుట్టూ తెల్లటి పూలతో డిజైన్ చేశారు. అలాగే తనకిష్టమైన ఎరుపు రంగు చీరతో ఆమె భౌతికకాయాన్ని అలంకరించారు.



శ్రీదేవి భౌతికకాయానికి నివాళ్ళర్పించడానికి వచ్చిన తారలు వరుసగా చిరంజీవి, వెంకటేష్, రజనీకాంత్, సల్మాన్‌ఖాన్, షారూఖ్ ఖాన్, సంజయ్ లీలా భన్సాలీ, హేమా మాలిని, ఐశ్వర్యరాయ్, జయప్రద, కరణ్ జోహార్, అనుపమ్ ఖేర్, జావేద్ అక్తర్, రేఖ, విద్యా బాలన్, టబు, కాజోల్, అజయ్ దేవగణ్, జాన్ అబ్రహాం, జాక్వెలిన్, సిద్ధార్థ్ మల్హోత్రా, సోనమ్ కపూర్ తదితరులు.

అమెరికాలో గూఢచారి



అడివి శేషు

అడివి శేషు హీరోగా నటిస్తున్న నూతన చిత్రం 'గూఢచారి'. శశికిరణ్ తిక్క దర్శకత్వం వహిస్తున్న ఈచిత్రాన్ని అభిషేక్ పిక్చర్స్, విస్టా డ్రీమ్ మర్చంట్స్ పతాకాలపై అభిషేక్ నామా, టిజి విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శోభిత ధూళిపాళ్ళ కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్ర షూటింగ్ ప్రస్తుతం అమెరికాలో జరుగుతుంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, 'ఇప్పటి వరకు తెలుగు తెరపై చూడని ఓ సరికొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఈ చిత్రం తాజా షెడ్యూల్ అమెరికాలోని కాస్కేడ్ మౌంటైన్స్‌లో జరుగుతుంది. అక్కడ అందమైన, అత్యద్భుతమైన లొకేషన్లలో అడివి శేషుపై పలు కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. ఆయన ఇందులో స్పైగా కనిపిస్తారు. హై టెక్నికల్ వ్యాల్యూస్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఓ సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది. వేసవి కానుకగా సినిమాను రిలీజ్ చేస్తాం' అని అన్నారు.

కాలేజ్ నేపథ్యంలో ఆనందం



'ఆనందం'లో ఓ దృశ్యం

నూతన నటీనటులతో గణేష్‌రాజ్ దర్శకత్వంలో రూపొంది ఘన విజయం సాధించిన మలయాళ చిత్రం 'ఆనందం'ను అదే పేరుతో సుఖీభవ మూవీస్ పతాకంపై ఎత్తరి గురురాజ్ తెలుగులో విడుదల చేస్తున్నారు. వీర వెంకటేశ్వర రావు(పెదబాబు), వీఆర్‌బీ రాజు, రవివర్మ చిలువూరి సహనిర్మాతలు. ఆర్.సీతారామరాజు సమర్పకులు. ఈ చిత్రం గురించి నిర్మాత ఎత్తరి గురురాజ్ మాట్లాడుతూ, 'ఒక ఇండస్ట్రియల్ టూర్, నాలుగు రోజులు, మూడు ప్రేమ కథలు క్లుప్తంగా ఈ చిత్ర కథ ఇది. అంటే 143 . ఆద్యంతం యూత్‌ఫుల్‌గా ఉంటుంది. కాలేజ్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం రూ.4కోట్లతో తెరకెక్కి రూ.20కోట్లు వసూలు చేసింది. ఆహ్లాదకరమైన కథతో, భారీ విజయంతో యువ హృదయాలను కొల్లగొట్టిన ఈ మలయాళ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఇందులో మాలీవుడ్ టాప్ హీరో నివిన్ పాల్ అతిథి పాత్రలో నటించడం విశేషం. ఈ చిత్ర రీమేక్ కోసం ఓ పెద్ద సంస్థ ఫ్యాన్సీ రేట్‌ను ఆఫర్ చేసింది. కానీ తెలుగు నేటివిటీకి సరిపోయే అంశాలు ఇందులో పుష్కలంగా ఉండటంతో అనువాదం చేసి విడుదల చేయాలనుకుంటున్నాం. సినిమా అంతా చాలా నేచురల్‌గా సాగుతుంది. ఎక్కడా ఓవర్ డ్రామా, మెలో డ్రామా, సినిమాటిక్ డ్రామా కనిపించదు. తప్పకుండా యువతను ఆకట్టుకుంటుంది. మలయాళ అగ్ర సంగీత దర్శకుడు సచిన్ వారియర్ వినసొంపైన సంగీతాన్ని అందించారు. మార్చి మొదటి వారంలో పాటలను, 16న సినిమాను విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. ఇది 'హ్యాపీడేస్'ను మరిపించే చిత్రమవుతుంది' అని అన్నారు. అరుణ్ కురియన్, థామస్ మాథ్యూ, రోషన్ మాథ్యూ, విశాక్ నాయర్, సిద్ధి మహాజన కట్టి, అన్ను ఆంటోని, అనార్కళి మరికర్, రెంజి ఫణిక్కర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆనంద్.ఇ. చంద్రన్.

థియేటర్ల బంద్‌కు పిలుపు..



ముత్యాల రాందాసు, దామోదర ప్రసాద్

సినిమాలను ప్రదర్శించే డిజిటల్ సంస్థలు క్యూబ్, యుఎఫ్‌ఓలకు వ్యతిరేకంగా మార్చి 2 నుంచి బంద్ పాటించనున్నారు. ప్రదర్శన రేట్లను తగ్గించాలని ఇటీవల దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమ జాయింట్ యాక్షన్ కమిటీకి, డిజిటల్ సంస్థల యాజమానులకు మధ్య చర్చలు జరిగిన విషయం విదితమే. ఫీజును తగ్గించేందుకు ఆయా సంస్థలు ససేమిరా అనడంతో జాక్ బంద్ నిర్ణయాన్ని తీసుకుంది. తెలుగు చలన చిత్ర పరిశ్రమకు అత్యంత భారంగా తయారైన డిజిటల్ ప్రొవైడర్ల ఛార్జీలకు వ్యతిరేకంగా నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు మార్చి 2వ తేదీ నుంచి సినిమాల ప్రదర్శనలు నిలిపివేయుటకు నిర్ణయం తీసుకోవడం జరిగింది. అందుకు ప్రేక్షకులు సహకరించగలరని దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమ జాయింట్ యాక్షన్ కమిటికి కోరుతోంది. ఈ సందర్భంగా తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి ముత్యాల రాందాసు చెబుతూ, 'బంద్ విషయాన్ని మంత్రి తలసాని వద్దకు తీసుకెళ్ళాం. ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అందరం కలిసి ఒక్కతాటిపైకి వచ్చి పోరాటం చేయడానికి సిద్ధమయ్యాం' అని తెలిపారు. 'ఇప్పటి వరకు జరిగిన సమావేశాల్లో వి.పి.ఎఫ్ ఛార్జీలు కట్టేది లేదని, బ్రేక్‌లో రెండు సినిమా యాడ్లు మాకివ్వాలని, కమర్షియల్ యాడ్లు 8నిమిషాల నిడి కంటే ఎక్కువగా ఉండకూడదనే నిబంధనలను డిజిటల్ ప్రొడవైడర్ల ముందుంచాం. వాళ్ళు ఒప్పుకోకపోవడంతో చర్చలన్నీ విఫలమయ్యాయి. క్యూబ్‌కు సంబంధించిన ఓ వ్యక్తి అయితే 'ఆల్ ది బెస్ట్ టు ఇండస్ట్రీ' అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. కానీ దక్షిణాది అన్ని పరిశ్రమల నుంచి మద్దతు లభించింది. మార్చి 2 నుంచి థియేటర్ల బంద్‌ను నిర్వహిస్తున్నాం' అని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ డిజిటల్ కమిటి చైర్మెన్ దామోదరప్రసాద్ తెలిపారు.

వైవిధ్యానికే పెద్ద పీట



అదితి రావు హైదరీ

'వైవిధ్యతే నాకు అన్నింటి కంటే ముఖ్యం. విలక్షణమైన పాత్రలు చేసేందుకే ఇష్టపడతా' అని అంటోంది అదితి రావు హైదరీ. 'చెలియా', 'లండన్ పారిస్ న్యూయార్క్', 'భూమి', 'పద్మావత్' చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి ఆకట్టుకుంది. ప్రస్తుతం ఆమె మణిరత్నం మల్టీస్టారర్ 'నవాబ్'లో నటిస్తోంది. ఇందులో యాక్ట్ చేయడానికి గల కారణం ఏంటని మీడియా అడిగిన ప్రశ్నకు అదితి స్పందిస్తూ, 'నేను మొదట్నుంచి అన్ని రకాల, విభిన్న పాత్రలు పోషిస్తూ వస్తున్నాను. ఒక వ్యక్తినో, ఇద్దరు వ్యక్తుల కోసమో సినిమా చేయను. సినిమాకు దర్శకుడు, చిత్ర బృందం ముఖ్యం. కథ, నా పాత్ర ఎలా ఉన్నాయనేది చూస్తాను. నా పాత్రలు, సినిమాలు సాధ్యమైనంత వరకు వైవిధ్యంగా, విలక్షణంగా ఉండాలనుకుంటాను. హాలీవుడ్‌లో జెన్నిఫర్ లారెన్స్, నటాలియా పోర్ట్‌మన్, బ్రాడ్ పిట్ వంటి నటులు అమేజింగ్ రోల్స్ చేస్తారు. వాళ్ళను స్ఫూర్తిగా తీసుకుని నేను ముందుకు సాగుతున్నా. అందుకే భిన్నమైన పాత్రలు పోషించేందుకు పెద్ద పీట వేస్తున్నా. వైవిధ్యమే నాకు ముఖ్యం' అని తెలిపింది. ప్రస్తుతం ఆమె 'నవాబ్'తోపాటు 'సమ్మోహనం', 'దాస్ దేవ్' చిత్రాల్లో నటిస్తోంది.

నింగిపై నీడలా..



రాజ్ మాదిరాజు, అరుణ్ చిలువేరు, కీరవాణి, కళ్యాణ్ మాలిక్

ఇంద్రనీల్ సేన్ గుప్తా, జారాషా, అభిషేక్, కర్తవ్య శర్మ, నీరజ్, మృణాల్, మృదాంజలి ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'ఐతే2.0'. రాజ్ మాదిరాజు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఫర్మ్9 పతాకంపై కె.విజయరామరాజు, హేమంత్ వల్లపురెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని 'నింగిపై..' అనే పాటను ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి విడుదల చేశారు. ఈ పాటకు కిట్టు సాహిత్యం అందించగా, నరేష్ అయ్యర్ ఆలపించారు. ఈ సందర్భంగా కీరవాణి మాట్లాడుతూ, 'పాట విన్నాక చాలా కొత్తగా అనిపించింది. సినిమాకు సంగీతం అందించిన అరుణ్ చిలువేరు అద్భుతమైన మెలోడి మ్యూజిక్‌ను అందించగలరు. ఈ ట్యూన్ చాలా బాగుంది. 'ఆశగా ఆశకే ఆయువు పెంచగా.. ' వంటి సాహిత్యం ఇన్‌స్పైరింగ్‌గా ఉంది. నరేష్ అయ్యర్ పాటను చాలా చక్కగా పాడాడు. సినిమాలోని మిగిలిన రెండు పాటలు కూడా శ్రోతలను ఆకట్టుకుంటాయనే నమ్మకం ఉంది. సినిమా పెద్ద విజయం సాధించాలి' అని అన్నారు. దర్శకుడు రాజ్ మాదిరాజు చెబుతూ, 'ఈ చిత్రంలో మూడు పాటలున్నాయి. ముగ్గురు హీరోలకు సంబంధించిన వివిధ నేపథ్యాల్లో ఈ మూడు పాటలు వస్తాయి. ఆకలి, ఆశ, కోపం అనే మూడు అంశాలపై ఈ పాటలు సాగుతాయి. నాకు గిటార్ అంటే చాలా ఇష్టం. అందులో అరుణ్ మాస్టర్. 'నింగిపై..' అనే సాఫ్ట్ రాక్ నెంబర్‌కు కిట్టు విస్సా ప్రగడ చక్కని సాహిత్యాన్ని అందించారు. తను మిగిలిన రెండు పాటలను రాయడమే కాకుండా, సంభాషణల్లో సైతం సపోర్ట్ చేశారు. సోషల్ మీడియా, టెక్నాలజీ వల్ల జరిగే నష్టాలను తెలియజేసే సందేశాత్మక చిత్రమిది' అని అన్నారు. 'మార్చి 16న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని నిర్మాత చెప్పారు.

నాలుగురోజుల కింద అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సాయిదీక్షిత మఋపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఆత్మహత్యా? కుల దురంహకార హత్యా? అనేది అంతుబట్టట్లేదు. తమ కూతురితో సన్నిహితంగా ఉన్న సచిన్ అసలు ముద్దాయి అని అమ్మాయి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మరోవైపు కుటుంబ సభ్యులే ఈ ఘాతుకానికి పాల్పడ్డారా? అన్న సందేహమూ వ్యక్తమవుతున్నది. బుధవారం ఆర్మూర్ ఏసీపీ శివకుమార్ స్వయంగా చెంగల్‌కు వెళ్లి మృతురాలి కుటుంబాన్ని కలిసి వివరాలు సేకరించారు. పరారీలో ఉన్న సచిన్, గ్రామ సర్పంచ్ దొరికితే కేసు ఓ కొలిక్కి వచ్చే ఆస్కారముందని పోలీసులు చెబుతున్నారు.

సాయిదీక్షితది కులదురంహకార హత్యా?



- దళితుడైన సచిన్‌తో సాన్నిహిత్యమే కారణమా! • ఘటనపై తలెత్తుతున్న అనుమానాలు • విచారణ ముమ్మరం చేసిన పోలీసులు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రతినిధి

డిగ్రీ ఫస్టియర్ చదువుతున్న నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం చేంగల్‌కు చెందిన సాయిదీక్షిత(18) ఆదివారం అనుమానాస్పద స్థితిలో చనిపోయింది. అదే గ్రామానికి చెందిన సచిన్, గ్రామ సర్పంచ్ మహేష్ అండదండలతో విద్యార్థిని హతమార్చినట్టు తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడం, మంగళవారం సాయిదీక్షిత మృతదేహంతో విద్యార్థి సంఘాలు రాస్తారోకో దిగడంతో పోలీసుల దర్యాప్తు ముమ్మరమైంది. ఈ నేపథ్యంలో బుధవారం ఆ గ్రామాన్ని సందర్శించిన 'నవతెలంగాణ' కొన్ని వివరాలు సేకరించింది. 'నా కుమార్తెతో సచిన్ సన్నిహితంగా ఉండటం చూసి ఇద్దరినీ కొట్టిన. ఇంకోసారి ఇంటివైపు రావొద్దని సచిన్‌ను బెదిరించి తరిమేసిన' అంటూ శనివారం రాత్రి 12.30 గంటల సమయంలో జరిగిన ఘటనపై అమ్మాయి తండ్రి పిట్ల లింగం వివరించారు. మరుసటి రోజు ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆర్మూర్‌లోని గగ్గుపల్లిలో తన తోడల్లుడి (రాస రాంచందర్) ఇంటికి వెళ్లినట్టు, 3.30 నిమిషాలకు సాయిదీక్షిత చనిపోయినట్టు సమాచారం అందిందని తెలిపారు. వెంటనే పక్కనే ఉన్న ఆయన తోడల్లుడు రాంచందర్ కలగజేసుకొని.. 'లింగం భార్య లక్ష్మి తన పెద్ద కూతురిని టీఆర్‌టీ పరీక్ష కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లింది. ఇంట్లో ఎవ్వరూ లేరని మా ఊరి (గగ్గుపల్లి)కి రమ్మని లింగంకు చెప్పిన. సాయిదీక్షితకు ఇట్ల జరిగిందని కబురు రాగానే నేనే వెంట ఉండి లింగంని చెంగల్‌కు తీసుకొచ్చిన' అని వివరించారు. ఈ ఇద్దరు చెప్పిన వివరాల ఆధారంగా కేవలం రెండున్నర గంటల వ్యవధిలోనే మధ్యాహ్నం వేళ ఇతరులు ఇంట్లోకి చొరబడి సాయిదీక్షితను హతమార్చి ఉండాలి. అయితే ఎదురుగా ఉన్న ఇంట్లో పెండ్లి జరుగుతుండటంతో అక్కడంతా



రద్దీగానే ఉందని స్థానికులు చెబుతున్నారు. ఆ పరిస్థితుల్లో వేరొకరు ఇంట్లోకి చొరబడి హత్యచేసే అవకాశం ఏ మేరకు ఉందనే అనుమానాలు కలుగుతున్నాయి.

ఉరేసుకుంటే..దింపిందెవ్వరు..?

సాయిదీక్షిత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్టు చిత్రీకరించే ప్రయత్నం జరిగింది. అయితే ఉరేసుకొని చనిపోతే ఆమెను ఘటనా స్థలం నుంచి కిందకు దింపింది ఎవ్వరు? అనేది ఇప్పటికీ అంతుచిక్కడం లేదు. అన్నికోణాల్లో సమగ్ర దర్యాప్తు జరిపి కారకులను కఠినంగా శిక్షించాలని మృతురాలి మేనమామ రాజు కోరారు.

సచిన్ ఎందుకు చంపాల్సి వచ్చింది?

సాయిదీక్షిత తండ్రి లింగం ఊర్లో మైక్‌సెట్టు బిగిస్తాడు. అందుకు సహాయంగా అదే గ్రామానికి చెందిన దళితుడైన మగ్గిడి సచిన్ వెళ్లేవాడు. ఇదే పరిచయంతో లింగం ఇంటికి వస్తుండేవాడు. ఈ క్రమంలో లింగం కుమార్తె సాయిదీక్షితకు, సచిన్‌లకు మధ్య సాన్నిహిత్యం పెరిగినట్టు తెలుస్తోంది.

ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 24 శనివారం అర్ధరాత్రి సమయంలో సచిన్ తమ ఇంట్లో కనిపించడంతోనే అసలు సంగతి తెలిసినట్టుగా మృతురాలి కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. అయితే అమ్మాయి తండ్రికి తాము కనిపించామనో.. లేక మందలించారనే ఉద్దేశంతో సచిన్‌కు తన ప్రియురాలిని హత్య చేయాల్సి అవసరం ఎంతమేరకు ఉందన్న ప్రశ్న ఉత్పన్నమౌతున్నది. ఈ హత్యకేసులో ప్రధాన నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మగ్గిడి సచిన్‌పై, సహకరించినట్టుగా సర్పంచ్ మహేష్‌లపై కేసులు నమోదయ్యాయి. వారిద్దరూ పరారీలో ఉన్నారు. వారిద్దరూ దొరికితే కేసు దర్యాప్తు కొలిక్కి వస్తుందని ఓ పోలీస్ అధికారి పేర్కొన్నారు.

విచారణ కొనసాగుతోంది : శివకుమార్, ఆర్మూర్ ఏసీపీ

సాయిదీక్షిత మృతిపై విచారణ కొనసాగుతోంది. ఇప్పటి వరకు ఎవ్వరినీ అదుపులోకి తీసుకోలేదు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం.

టీఆర్ఎస్ నాయకుడు.. మా భూమి కబ్జా చేసిండు

- ప్రశ్నిస్తే బెదిరిస్తుండు..మాకు న్యాయం చేయాలే
- నర్సాపూర్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట దళితుల ఆందోళన

నవతెలంగాణ-నర్సాపూర్

ఇరవై ఏండ్ల కిందట ఇచ్చిన భూమిని టీఆర్ఎస్ నాయకుడు కబ్జా చేశాడని మెదక్ జిల్లా శివంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన దళితులు బుధవారం నర్సాపూర్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ అప్పటి ఎమ్మెల్యే చిలుముల విఠల్‌రెడ్డి తమ గ్రామంలో భూమిలేని 28మంది దళితులకు ఒక్కొక్కరికి ఎకరా చొప్పున 28 ఎకరాల భూమిని పంపిణీ చేసి పట్టాలు అందజేశారన్నారు. అప్పటి నుంచి ఆ భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. ఇటీవల అధికార పార్టీకి చెందిన నాయకుడు తమ భూమిపై తప్పుడు పత్రాలు సృష్టించి, ఆ భూమి తనదంటున్నాడని ఆరోపించారు. ఆ భూమిలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నాడని వాపోయారు. భూమిలోకి వస్తే కేసులు పెట్టిస్తానని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తమ భూమిని కబ్జా నుంచి విడిపించాలని కోరారు. లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ధర్నాలో దళితులు మల్లేశం, నారాయణ, ఈశ్వరప్ప, మైసయ్య, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ పాపం కాంగ్రెస్‌దే..!

- బస్సు యాత్రంటూ దొంగలు బయలుదేరారు
- అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు : మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-సూర్యాపేట/మద్దిరాల



నల్లగొండ జిల్లాను పట్టిపీడిస్తున్న ఫ్లోరైడ్ పాపం కాంగ్రెస్ పార్టీదేనని, గతంలో రాష్ట్రాన్ని పాలించిన ఆ పార్టీ సమస్యను పట్టించుకోలేదని మంత్రి కేటీఆర్ అన్నారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం శిల్పకుంట్లలో రూ.143కోట్లతో నిర్మించిన శుద్ధ జలాశయాన్ని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం మద్దిరాల మండల కేంద్రంలో ఎంఎల్‌ఏ గాదరి కిషోర్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. దశాబ్దాల పాటు నల్లగొండ జిల్లాను పట్టిపీడించిన ఫ్లోరైడ్‌ను మిషన్ భగీరథ ప్రారంభంతో తరిమికొట్టాలన్నారు. కాంగ్రెస్ నేతలు చేసే బస్సుయాత్ర అలీబాబా దొంగల ముఠాలా ఉందని ఎద్దేవా చేశారు. దొంగలంతా కలిసి నిర్వహిస్తున్న బస్సుయాత్రను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికిన చిల్లర దొంగ రేవంత్‌రెడ్డి... గత ఎన్నికల్లో డబ్బులతో దొరికిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి యాత్రలు చేస్తూ నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

సినీ నటుల అసభ్య చిత్రాల వెబ్ సైట్ నిర్వాహకుడి అరెస్ట్

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

తెలుగు సినిమా రంగానికి చెందిన మహిళా నటుల అసభ్య చిత్రాలతో అశ్లీల వెబ్‌సైట్‌ను నిర్వహిస్తున్న ఇంజనీర్‌ను రాష్ట్ర సీఐడీ సైబర్‌క్రైమ్ విభాగం అధికారులు అరెస్ట్ చేశారు. సీఐడీ అదనపు డీజీ గోవింద్‌సింగ్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం తమ అసభ్య చిత్రాలను కొన్ని వెబ్‌సైట్‌లలో పెడుతున్నారని, అలాంటి సైట్‌ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని గతంలో తెలుగు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ సీఐడీకి పిర్యాదు చేసింది. దీనిపై దర్యాప్తు అధికారులు మేడ్చల్‌లో రుద్రవరపు రఘువరన్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. ఇంజనీర్ అయిన రఘువరన్ ప్రయివేటు ఉద్యోగం చేసుకుంటూ కామపిశాచి.బ్లాక్‌స్పాట్.ఇన్ అనే అశ్లీల వెబ్‌సైట్‌ను నిర్వహిస్తు సొమ్ము చేసుకుంటున్నాడు. ఇందులో టాలీవుడ్‌కు చెందిన పలువురు నటీమణుల అసభ్య ఫొటోలు, చిత్రాలను చేర్చి సైట్‌ను నిర్వహిస్తున్నాడని సీఐడీ దర్యాప్తులో తేలింది. అరెస్టు చేసి నిందితుడు రఘువరన్‌ను కోర్టులో హాజరుపరిచి చంచల్‌గూడ జైలుకు తరలించారు.

గూడూరు ప్రజలు చైతన్యవంతులు

- గ్రంథాలయం ప్రారంభోత్సవంలో చుక్కా రామయ్య

నవతెలంగాణ-పాలకుర్తి

గూడూరు ప్రజలు అన్ని రంగాల్లోనూ చైతన్యవంతులని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ చుక్కా రామయ్య అన్నారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూ రులో చౌడవరపు విశ్వనాథం జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. రాజకీయ చైతన్యంలో గూడూరుకు ప్రత్యేక పాత్ర ఉందన్నారు. ఈ ప్రాంతంలోని గ్రామాలకు ఒక్కో చరిత్ర ఉందని చెప్పారు. గ్రామా నికి చెందిన 15మంది విద్యార్థులు ఇంజినీర్లుగా ఉన్నతస్థాయిలో ఉన్నారని తెలిపా రు. ఎంఎల్ఏ ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీ పోతన వేదిక అధ్యక్షులు అనుముల ఎల్లయ్య, పుస్తక మహోత్సవ అధ్యక్షులు, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు జూలూరి గౌరీశంకర్, నవతెలంగాణ బుక్‌హౌస్ మేనేజర్ చంద్రమోహన్, వేదిక బాధ్యులు చౌడవరపు రాము, పాలడుగు చంద్రప్రకాశ్‌రావు, తాతాచార్యులు, రత్నాకర్‌రావు, మహేందర్ రాజు, పరాంకుశం, నర్సింహమూర్తి, వీపీఎస్ రాజు, శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ నాగయ్య, సోమేశ్వర్ పాల్గొన్నారు.

కార్తీ చిదంబరం అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

పక్కాగా ఉన్నాయని.. అందుకే ఆయనను అరెస్టు చేసినట్టు సీబీఐ అధికారులు తెలిపారు. కార్తీ తండ్రి కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ఆ ప్రాబ ల్యాన్ని ఉపయోగించుకుని ఐఎన్‌ఎక్స్ మీడియా సంస్థకు మారిషస్‌కు చెందిన పెట్టుబడిదారుల నుంచి రూ. 10 లక్షలు లంచం తీసుకుని విదేశీ పెట్టుబ డులను అనుమతించాడనే ఆరోపణ. ఆ తర్వాత మూడున్నర కోట్ల మేర కార్తీ కంపెనీలోకి లావాదేవీలు జరిగాయని సీబీఐ అంటున్నది. గతేడాది ఆగస్టులో ఈడీ, సీబీఐలు కార్తీ మీద సంయుక్తంగా కేసులు నమోదు చేశాయి. ఆయన అకౌంటెంట్ భాస్కరరామన్‌ను సైతం ఢిల్లీలో పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

కక్ష సాధింపు చర్య- కాంగ్రెస్

కార్తీ అరెస్టు పట్ల కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ఇది కక్షసాధింపు చర్యేనని, కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడింది. ప్రధాని మోడీ తమ ప్రభుత్వంలో బయటపడుతున్న అవినీతి కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే కాంగ్రెస్ పార్టీ నాయకులపై కేసులు వేస్తున్నారని ఆరోపించింది.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభం కేసులు నమోదయ్యాయని తెలిపారు. అందులో వికారా బాద్, కరీంనగర్, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున ఉన్నారని పేర్కొన్నారు. ఇతర ఘటనలేవీ నమోదు కాలేదని తెలిపారు. పరీక్షలను పకడ్బం దీగా నిర్వహించడం కోసం చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఇంటర్ బోర్డు నుంచి హైదరాబాద్, సూర్యాపేట, మెదక్, వనపర్తి జిల్లాల్లో పరిశీలకులు పరీక్షను పర్యవేక్షించారని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోకపోవడంతో పలువురు విద్యార్థులు పరీక్ష రాయకుండానే వెనుది రగాల్సి వచ్చింది. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అధికారులు అనుమతించలేదు. దీంతో ఆ విద్యార్థులు కంటతడి పెట్టారు.

2న పరీక్ష యథాతథం

ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఈనెల 2న తేదీన ప్రారంభ మవుతాయని అశోక్ పేర్కొన్నారు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే 2న ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష యథాతథంగా జరుగుతుందనది తెలిపారు. ఈనెల 2న హోలి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఐచ్ఛిక సెలవు గా ప్రకటిం చిన నేపథ్యంలో ఇంటర్ బోర్డు ఈ పరీక్ష నిర్వహణపై స్పష్టత ఇచ్చింది.

బొల్లారం ప్రభుత్వ కాలేజీలో ఫీజు కట్టని ప్రిన్సిపాల్

హైదరాబాద్‌లోని బొల్లారంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థుల ఫీజు కట్టని ఘటన చోటుచేసుకుంది. విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేసి ఇంటర్ బోర్డుకు మాత్రం ఆ ఫీజు చెల్లించకుండా ఆ కాలేజీ ప్రిన్సిపాల్, అకౌంటెంట్ నిర్లక్ష్యం వహించారు. బుధవారం విద్యార్థులు ఆ కాలేజీ వద్ద ఆందోళన చేపట్టారు. దీనిపై ఇంటర్ బోర్డు అధికారులను నవతెలంగాణ వివరణ కోరగా... బొల్లారం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రయివేటు విద్యార్థులు నలుగురి ఫీజు ప్రిన్సిపాల్ ముందే కట్టలేదని వివరణ ఇచ్చారు. వారి ఫీజును ఆ కాలేజీ ప్రిన్సిపాల్ బుధవారం ఇంటర్ బోర్డుకు చెల్లించారని చెప్పారు. ఆ ప్రయివేటు విద్యార్థుల పరీక్ష ఈనెల 8వ తేదీన ఉందని, వారికి ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. హాల్‌టికెట్లు జారీ అవుతాయని అన్నారు.

ఆలస్యంతో పరీక్ష రాయలేకపోయిన విద్యార్థులు

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షకు 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన కారణంగా సూగురు గ్రామానికి చెందిన ఈశ్వరమ్మను అధికారులు అనుమతిం చలేదు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న ఒక విద్యార్థిని డిబార్ చేశారు. ఒక్క నిమిషం ఆలస్యం కారణంగా సూర్యాపేటలో ఒకరు, కోదాడలో మరొకరిని పరీక్షకు అనుమతించలేదు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆల్ఫా జూనియర్ కళాశాలకు చెందిన వాకిటి అంజయ్య బైక్ ఫంచర్ కావడంతో పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా వెళ్లాడు. దీంతో పరీక్షకు అనుమతిం చలేదు. వికారాబాద్‌లో నిమిషం ఆలస్యం నిబంధనతో ఇద్దరు విద్యార్థులు పరీక్ష రాలేదు. మరో విద్యార్థి మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా డిబార్ చేశారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో విద్యార్థి ఐదు నిమిషాలు ఆలస్యంగా రావడంతో పరీక్షకు అనుమతించలేదు. సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రానికి బత్తిని కపిల్‌దేవ్ ఐదు నిమిషాలు ఆలస్యంగా రావడంతో పరీక్షకు అనుమతించలేదు.

మళ్లీ 'కృష్ణా' జగడం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

తెలుగు రాష్ట్రాల మధ్య మరొక సారి జలవివాదం తలెత్తింది. కేటాయించిన నీటి కన్నా 2.32 టీఎంసీల నీటిని అధికంగా నాగార్జునసాగర్ కుడి కాల్వ ద్వారా ఏపీ వినియోగించుకున్నదని తెలంగాణ ఆరోపించటంతో కృష్ణా బోర్డు ఆదేశాల మేరకు బుధవారం నుంచి నీటి విడుదల అపేశారు. ఈ నిర్ణయంతో ఏపీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. జనవరి 8 న జరిగిన కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో రెండు రాష్ట్రాలకు కృష్ణా నీటి కేటాయింపులు జరిగాయి. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో కనీస నీటి మట్టానికి పైన 133.75 టీఎంసీల నీరు అందుబాటులో ఉండగా వీటిలో ఏపీకి 60, తెలంగాణకు 50 టీఎంసీలు బోర్డు కేటాయించింది. ఫిబ్రవరి నెలాఖరు వరకూ ఈ నీటిని వినియోగించుకోవాల్సి ఉన్నది. వివిధ ప్రాజెక్టుల కింద ఏపీ 62.32 టీఎంసీల నీటిని వినియోగించుకున్నది. కేటాయించిన నీటి కన్నా ఇది 2.32 టీఎంసీలు అదనం కావటంతో బుధవారం నుంచి ఏపీకి నీటి విడుదల అపివేయాలని బోర్డు నిర్ణయించింది. తెలంగాణకు కేటాయించిన 50 టీఎంసీల్లో వివిధ ప్రాజెక్టుల కింద ఇప్పటి వరకూ 33.50 టీఎంసీల నీటిని మాత్రమే వినియోగించుకోగా మరో 16.43 టీఎంసీల నీరు వినియోగించుకోవాల్సి ఉన్నది.

ఏడు నెలలు..36 టీఎంసీలు...

శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో కనీస నీటి మట్టం స్థాయికి ఇంకా 36.18 టీఎంసీల నీరు మాత్రమే లభ్యత ఉన్నదని కృష్ణా బోర్డు రెండు రాష్ట్రాలకు తెలిపింది. వచ్చే ఆగస్టు వరకూ ఈ నీటిని తాగునీటి కోసం వినియోగించుకోవాలని సూచించింది. తాజా అవసరాలతో ఇండెంట్‌ను రెండు రాష్ట్రాలు పంపాలని బోర్డు కార్యదర్శి పరమేశం కోరారు. నాగర్జునసాగర్‌లో ప్రస్తుత నీటి మట్టం 522.10 అడుగులు కాగా నీటి నిల్వ 153.13 టీఎంసీలు ఉన్నది. ఈ ప్రాజెక్టులో డెడ్‌స్టోరేజీ స్థాయి (ఎండీఎల్) 510 అడుగులు కాగా ఈ స్థాయికి చేరే సరికి కేవలం 21.46 టీఎంసీల నీరు మాత్రమే వినియోగానికి అందుబాటులో ఉంటుంది. శ్రీశైలం ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం 844.20 అడుగులు కాగా, నీటి నిల్వ 68.37 టీఎంసీలుగా ఉన్నది. ఈ ప్రాజెక్టులో డెడ్‌స్టోరేజీ (ఎండీఎల్) స్థాయి 831 అడుగులు కాగా ఈ స్థాయి వరకూ 14.71 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంటుంది. సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో ప్రతియేటా డెడ్‌స్టోరేజీ స్థాయి కన్నా దిగువకు వెళ్ళి రెండు రాష్ట్రాలూ నీరు తీసుకుంటున్నాయి. ఎండా కాలంలో జంటనగరాలకు తాగు నీరందించటానికి నాగార్జునసాగర్‌లో మోటార్లు అమర్చి నీరు తరలిస్తున్నారు.

నాగార్జునసాగర్ డ్యామ్ వద్ద ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

రావాల్సి ఉందని అప్పుడే ఎందుకు నిలిపేశారని తెలంగాణ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఆ సమయంలో మీడియా పెద్దఎత్తున అక్కడికి రావడంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఈఈ బి.వెంకటస్వామి మీడియా వారు బయటికి వెళ్లాలని హెచ్చరించారు. దీంతో ఆంధ్రా అధికారులకు, మీడియా మిత్రుల మధ్య వాగ్వివాదం జరిగింది. డ్యామ్ భద్రత తెలంగాణ ఎస్పీఎఫ్ ఆధ్వర్యంలో ఉండటంతో ఆంధ్రా అధికారులను అడ్డుకుంటున్నారని వెంకటస్వామి ఆరోపించారు. నాగార్జునసాగర్ డ్యామ్ భద్రత విభాగానికి చెందిన ఆర్ఐ అప్పాజీ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేశారు. మిర్యాలగూడ డీఎస్పీ శ్రీనివాస్ అక్కడికి చేరుకుని డ్యామ్‌పై భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నారు. నీటి విడుదలకు సంబంధించి ఇరు రాష్ట్రాల అధికారుల చర్చలు జరిగాయి.

పాతమేట్లను కొనసాగించాలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో పదేండ్లుగా పనిచేస్తున్న గ్రామీణ ఉపాధి హామీ మేట్లను తొలగిస్తూ జారీ చేసిన సర్క్యులర్ 1786 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది ఉపాధి మేట్లు, కూలీలు గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. పాతమేట్లను యధావిధిగా కొనసాగించాలని, బాత్రూం, ఇంకుడు గుంతల నిర్మాణం, హరితహారం, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, పనిచూపకపోతే నిరుద్యోగ భృతి చెల్లించాలని, ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతుల భూములను ఉపాధి హామీ పనుల ద్వారా బాగుచేయాలని, నగర, మున్సిపల్ పంచాయతీల్లో పనులు చేపట్టాలని, రోజు కూలీ రూ. 300కు పెంచాలని, ప్రతియేటా 200 రోజుల మేరకు పనులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి వందలాది మేట్లు, కూలీలు కమిషనరేట్‌కు చేరుకున్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, గ్రామీణ ఉపాధి మేట్ల సంఘం సంయుక్తంగా నిర్వహించిన మహాధర్నాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫ్లెక్సీలు, జెండాలు, ప్లకార్డులు ప్రదర్శించారు. సీఎం కేసీఆర్ డౌన్ డౌన్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నాకు మహిళలు, యువత భారీసంఖ్యలో హాజరయ్యారు. దాదాపు మూడు గంటలపాటు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మెయిన్‌గేటు దగ్గర పోలీసులు, ఉపాధి మేట్లు, కూలీలకు మధ్య కొద్దిసేపు తోపులాట చోటుచేసుకుంది. కమిషనర్ కార్యాలయం బయటకు వచ్చి తమ సమస్యలు విని సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కమిషనర్ బయటకు రాకపోవడంతో కొద్దిసేపు కమిషనరేట్ లోపలికి వెళ్లేందుకు నాయకులు, మేట్లు, కూలీలు ప్రయత్నించారు. ఈ సందర్భంగా పోలీసులతో వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు అడ్డుకున్నారు. కమిషనర్ బయటకు తీసుకొచ్చేందుకు ఎమ్మెల్యే సున్నం రాజయ్య, మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ్మా, ఇతర నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో కొంతసేపు కమిషనర్ చాంబర్‌లో వాదనలు చోటుచేసుకున్నాయి. చివరకు కమిషనర్ ధర్నాకు వద్దకు వెళ్లాలని సంయుక్త కమిషనర్ సైదులు, మురళిని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న రూ.164 కోట్ల బకాయిలను వెంటనే కూలీలకు అందజేస్తామని వారు ప్రకటించారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ధర్నాకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. ప్రసాద్ అధ్యక్షత వహించారు.

అసెంబ్లీలో తొలి తీర్మానం:సున్నం రాజయ్య

ఉపాధి మేట్లు, కూలీల సమస్యలను వచ్చే బడ్జెట్ సమావేశాల్లో తొలి తీర్మానంగా ప్రవేశపెడతానని సీపీఐ(ఎం) ఎమ్మెల్యే సున్నం రాజయ్య ప్రకటించారు. ధర్నాలో మాట్లాడుతూ చట్ట ప్రకారం 90 శాతం పనులను నైపుణ్యం లేని కూలీలతోనే చేయించాలని చెప్పారు. యంత్రాలతో పనచేయించకూడదనే నిబంధనలను కేంద్రంలోని బీజేపీ అధికారంలోకి రాగానే తుంగలో తొక్కిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నేరుగా ఇచ్చే నిధులను కాస్త తన ఖజానాకు మళ్లించుకుందని విమర్శించారు. మెటీరియల్ ఖర్చు పెట్టరాదని పార్లమెంటు చట్టం చేస్తే, దాన్ని 49 శాతానికి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే పెంచిందని అగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీల ద్వారా జరిగే పనుల ఎంపికను 60 శాతం జిల్లా పరిషత్తులకు అప్పగించారని వివరించారు. యంత్రాలతో చేయించాలనే బీజేపీ నిర్ణయాలని, రాష్ట్రంలోని టీఆర్ఎస్ సర్కారు అమలుచేస్తున్నని అన్నారు. పాతమేట్లను తొలగిస్తూ తెచ్చిన సర్క్యులర్ 1786ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ఉపాధ్యక్షులు బి.వెంకట్ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ సర్కారుపై పోరాటం చేస్తామని ప్రకటించారు. వ్యవసాయానికి ఉపాధి హామీ చట్టాన్ని అనుసంధానం చేయరాదని అన్నారు. వ్యవసాయ కార్మికులను ఆదుకోవడానికే ఉపాధి హామీ చట్టం వచ్చిందన్నారు. వామపక్షాలు పోరాడితేనే యూపీఏ-1 ప్రభుత్వం చట్టం తెచ్చిందని చెప్పారు. మేట్లు, కూలీలకు వ్యతిరేకంగా పనిచేస్తే నీ ఉపాధి, నీ కుర్చీ పోతుందని సీఎం కేసీఆర్‌ను హెచ్చరించారు. అమెరికా, జర్మనీలకు ఊడిగం చేస్తున్నారని ఆరోపించారు. రైతు ఆత్మహత్యలకు ఉపాధి హామీ కారణమని అనడం సరికాదని చెప్పారు. కేసీఆర్, నరేంద్రమోడీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ్మా, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం కాపాడుకోవడానికి బలమైన చట్టం అవసరమని వ్యాఖ్యానించారు. బీజేపీ, టీఆర్ఎస్ కలిసే చట్టాన్ని నాశనం దిశగా చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. చంద్రబాబు, వైఎస్సార్‌కు పట్టినగతే కేసీఆర్‌కు పడుతుందని హెచ్చరించారు. చట్టాన్ని నిర్వీర్యం చేయడంతో కూలీల కడుపు కాలుతున్నదని ఆరోపించారు. ఏండ్లతరబడి పోరాటం చేస్తే ఆ చట్టం వచ్చిందని గుర్తు చేశారు. నగర పంచాయతీలు, మున్సిపాల్టీల్లో ఉపాధి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, కొండమడుగు నర్సింహ్మా, నారి ఐలయ్య, కె.జగన్, అల్వాల వీరయ్య, ఆర్‌శశిధర్, బి.రాంచందర్, ఎం.వెంకటయ్య, యు.గోపాల్, ఆర్.దాసు, రమేశ్, మహేందర్ పాల్గొన్నారు.

పింఛన్ పాట్లు.. రోడ్డెక్కిన లబ్ధిదారులు

(మొదటిపేజీ తరువాయి)

ఎందుకు వస్తుందో విచారణ చేపట్టాలని లీడ్ బ్యాంకు మేనేజర్‌కు సూచించారు. లబ్దిదారుల ఖాతాలో డబ్బులు ఉన్నా బ్యాంకు మేనేజర్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. దీనిపై విచారణ జరిపించాలని ఆదేశించారు. పింఛన్‌దారులకు వెంటనే డబ్బులు పంపిణీ చేయాలని ఆదేశించారు. పింఛన్ డబ్బులు ఇస్తారని, బ్యాంకు అధికారులు పోస్టాఫీస్‌లో జమ చేస్తారని హామీ ఇవ్వడంతో లబ్దిదారులు ధర్నా విరమించారు.

ఎంపీడీవో, ఏపీడీల విచారణ

గాంధీనగర్, మైలారం గ్రామాలకు పబ్బ మొగిలయ్య ఒక్కడే బీపీఎం. పింఛన్‌లు, ఉపాధిహామీ డబ్బులు పంపిణీ చేస్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం గాంధీనగర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు బాలాజీ బతుకమ్మ పింఛన్ కోసం మైలారం వెళ్లింది. అప్పటికే డబ్బులు లేవని మొగిలయ్య లబ్దిదారులపై చిరాకు పడుతున్నాడు. ఎందుకివ్వవని వృద్ధులు నిలదీయడంతో కోపోద్రిక్తుడైన మొగిలయ్య అసభ్యకరంగా మాట్లాడాడు. అంతేకాకుండా వృద్ధురాలిపై అతని భార్య బతుకమ్మ చేయిచేసుకుంది. దీంతో ఆ వృద్ధురాలు గాంధీనగర్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకొని ఎంపీడీవో శ్రీధరస్వామి, సర్పంచ్ మారగాని శ్రీనివాస్, ఏపీడీలు వెంకట్ నారాయణ, చంద్రశేఖర్, ఉపాధి హామీ పనులు తనిఖీ చేసేందుకు వచ్చిన కేంద్ర బృందం సభ్యులకు వివరించింది. వారు బీపీఎంను పిలిపించి మందలించారు. ఆ సమయంలో బీపీఎం కుమార్తె కూడా అక్కడకు చేరుకొని దురుసుగా ప్రవర్తించడంతో పైఅధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'డబుల్' దందా

నవతెలంగాణ-తంగళ్లపల్లి

2016లో గోదావరి, మానేరు పరివాహక ప్రాంతాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 58 ఇసుక క్వారీలను గుర్తించగా.. రాజన్న సిరిసిల్ల జిల్లా మానేరువాగు ఇసుకను గతంలో మైనింగ్‌శాఖ ఆధ్వర్యంలో తోడేవారు. ఆ సమయంలో రెండు కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుకను అధికారులు గుర్తించి ఇప్పటివరకు 10 లక్షల క్యూబిక్‌మీటర్ల ఇసుకను తరలించారు. ఈ నేపథ్యంలో సహజవనరుల దోపిడీ పెచ్చుమీరిందని, ఇసుక మాఫియా చెలరేగిపోతోందోన్న ఆందోళనల మధ్య గతేడాది నుంచి కొంత తగ్గుముఖం పట్టింది. స్థానిక అవసరాలకు కూడా ఇసుకను తోడనివ్వకుండా కఠిన చర్యలు తీసుకున్న అధికారులు దాన్ని 'మూన్నాళ్ల ముచ్చటే' చేశారు. షరా'మామూలే' అన్నట్టు పెద్దఎత్తున ఇసుక ఊరుదాటించడం మొదలుపెట్టారు. ఇప్పుడు ఆ ప్రాంతం తెలంగాణ రాష్ట్ర మినరల్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్‌ఎంసీఎల్) పరిధిలోకి రాగా.. 40 రోజుల్లోనే 9లక్షలా 99వేల క్యూబిక్‌మీటర్ల ఇసుక తోడేశారు. 'డబుల్‌బెడ్‌రూం' ఇండ్ల నిర్మాణం పేరుతో లారీలకు బ్యానర్లు తగిలించి అధికారికంగానే రోజుకు 500 లారీల ఇసుక తరలిస్తుంటే అనధికారికంగా మరో 200లారీలు అదనంగా తోడేస్తున్నారు. సిరిసిల్ల మండలం మండేపల్లిలో నిర్మిస్తున్న 1260 డబుల్‌బెడ్‌రూం ఇండ్ల సమీపంలో డంప్‌లు వేస్తూ అక్కడి నుంచి కూడా అర్ధరాత్రి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒకే వే బిల్లుపై రెండు మూడు లారీల ఇసుక ట్రిప్పులను జగిత్యాల, జనగామ, సిద్దిపేట, మేడ్చల్, సహా హైదరాబాద్‌లాంటి ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా ఊరుదాటిస్తున్నారు. మరోవైపు సర్కారు పథకాల కోసం ఇప్పటివరకు లక్షా 69వేల క్యూబిక్ మీటర్ల ఇసుక తరలించినట్టు అధికారుల లెక్కలు చెబుతుండటం గమనార్హం.

నిబంధనలు గాలికి...

ఇసుక అవసరం ఉన్నవాళ్లు మీసేవా, ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా టీఎస్‌ఎంసీఎల్ పేరిట డబ్బులు చెల్లించి రశీదులు పొందితే.. వారి అవసరాన్ని బట్టి లారీల్లో ఇసుక నింపాల్సి ఉంది. 10 టన్నుల సామర్థ్యంగల లారీలో 6 క్యూబిక్ మీటర్ల ఇసుకను, 17 టన్నుల లారీలో పది క్యూబిక్ మీటర్ల ఇసుక మాత్రమే లోడింగ్ చేయాల్సి ఉంటుంది. పది టైర్ల లారీల్లో 20 టన్నులు (10.5 క్యూబిక్ మీటర్లు), 12 టైర్ల లారీలో 22.5 టన్నులు (13 క్యూబిక్ మీటర్లు), ఒక్కో వేబిల్లుపై లారీలో 21 టన్నులకు మించి (12 క్యూబిక్ మీటర్లు) ఇసుకను నింపకూడదు. ఇసుక మాఫియా 14 టైర్ల లారీల ద్వారా ఏకంగా 60 టన్నుల(37.50 క్యూబిక్ మీటర్లు) వరకు ఇసుకను నింపి నిబంధనలను ఉల్లంఘిస్తోంది. దీనికి చెక్‌పెట్టేందుకు రాష్ట్ర సర్కారు ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టినా అక్రమ దందా అరికట్టలేకపోయింది. దీంతో మానేరు పక్కనే ఉన్నా సామాన్యులకు ఇసుక దక్కడం లేదు.

10 మీటర్ల లోతుకు భూగర్భజలాలు

రాజన్నసిరిసిల్లలో రాష్ట్రంలోనే అత్యధిక భూగర్భజలాలు అడుగుంటాయని ఇటీవల భూగర్భజలవనరులశాఖ చెప్పిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితి రోజురోజుకూ మరింత దిగజారుతోంది. 2016లో సిరిసిల్ల జిల్లాలో సాధారణ భూగర్భనీటి మట్టం 8.32 మీటర్లు ఉండగా 2017 డిసెంబర్‌లో నాటికి 13.36 మీటర్ల లోతుకు పడిపోయింది. ఇక మానేరు పరిహాక మండలాల్లో పరిశీలిస్తే ముస్తాబాద్ 2016లో 9.45మీటర్లలోతులో ఉండగా 2017 చివరినాటికి 11.43 మీటర్లలోతుకు పడిపోయాయి. గంభీరావుపేటలో 7.26 మీటర్ల నుంచి 10.87 మీటర్లకు, తంగళ్లపల్లి మండలంలో 3.22 నుంచి ఏకంగా 9.03మీటర్లలోతుకు పడిపోయాయి. ఇక రాబోయే వేసవి నాటికి ఏ స్థాయిలో భూగర్భజలాలు అడుగంటుతాయో ఆందోళన కలిగిస్తోంది.

ప్రాణాలు తీస్తున్న ఇసుకలారీలు

2015 నుంచి ఇప్పటిదాకా ఇసుక లారీలు ఢీకొట్టడంతో ఎనిమిది మంది చనిపోయారు. కాళ్లు చేతులు కోల్పోయిన వారు, తీవ్రంగా గాయపడ్డవారు పదుల సంఖ్యలో ఉన్నారు. 2 జూలై 2017న నేరేళ్లకు చెందిన బదనపురం భూమయ్య జిల్లెల శివారులో ఇసుక లారీ ఢీకొని మృతి చెందాడు. ఆగ్రహించిన గ్రామస్తులు ఆరు లారీలను తగలబెట్టారు. ఆ కేసులో 8 మంది అరెస్టు కావడం, పోలీసులు చిత్రహింసలకు గురి చేయడం వంటి పరిణామాలు తెలిసినవే. ఇసుక లారీలను తమ ఊర్ల మీదుగా నడుపొద్దని జిల్లాలోని పలు గ్రామాల్లో ఆందోళనలు కూడా జరిగిన విషయం తెలిసిందే.

వేబిల్లుతో కచ్చితంగా లెక్క : తారక్‌నాథ్‌రెడ్డి, టీఎస్ఎంసీఎల్ ప్రాజెక్టు ఆఫీసర్

గతంలో వే బిల్లు పేరుతో ఇసుక అక్రమ దందా సాగింది. ఇప్పుడు అందుకు అవకాశం లేదు. ఇక్కడ తీసుకున్న వే బిల్లు డంప్ చేసే చోట కచ్చితంగా కౌంటర్ ఫైల్ చేస్తారు. దాని వల్ల ఇసుక పక్కదారి పట్టే అవకాశం లేదు.


అప్పుడు డార్విన్.. ఇప్పుడు న్యూటన్

(మొదటిపేజీ తరువాయి)

పాఠ్య ప్రణాళికల్లో తప్పనిసరిగా చేర్చాలని చెప్పారు.ఇటీవల జరిగిన సెంట్రల్ అడ్వయిజరీ బోర్డు ఆఫ్ ఎడ్యుకేషన్ సమావేశంలో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ సమావేశానికి పలువురు కేంద్ర మంత్రులు, దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులు హాజరుకాగా, వారి సమక్షంలోనే సత్యపాల్ పై వ్యాఖ్యలు చేశారు. డార్విన్ ప్రతిపాదించిన 'జీవ పరిణామ క్రమ సిద్ధాంతం' తప్పని, పాఠశాల్లో, కాలేజీల్లో ఉన్న ఆ పాఠ్యాంశాలను తొలగించాలని ఆయన గతంలో వ్యాఖ్యానించారు. మానవుడు కోతి నుంచి పరిణామం చెందాడనేది తప్పని ఆయన అన్నారు. కోతి నుంచి మనిషి రూపాంతం చెందాడని మన పూర్వీకులెవ్వరూ చెప్పలేదని వ్యాఖ్యానించారు. ప్రకృతిసిద్ధమైన తత్వశాస్త్రం సైన్సుగా ఎలా పరిణామం చెందిందన్న అంశంపై న్యూటన్ ఎనలేని కృషి చేశారు. అందువల్లే ఆయనను ఆధునిక ప్రపంచం సైన్సు పితామహుడిగా గౌరవిస్తుంది. 1687లో ప్రచురితమైన ఆయన శాస్త్ర గ్రంథం సైన్సు చరిత్రలో అత్యంత ముఖ్యమైన రచన. ఈ గ్రంథంలో గురుత్వాకర్షణ శక్తి గురించి, న్యూటన్ ప్రతిపాదించిన మూడు గమన నియమాల గురించి ప్రస్తావించారు. సైన్సు దక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి కూడా ఈ గ్రంథమే పునాది. అంతటి ప్రపంచఖ్యాతి పొందిన న్యూటన్ సిద్ధాంతంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సత్యపాల్ సింగ్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కీలకమైన కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రి పదవిలో ఉండే అర్హత ఆయనకు లేదని పలువురు శాస్త్రవేత్తలు మండిపడుతున్నారు.సైన్సును దెబ్బతీసేక్రమంలోనే మోడీ సర్కారు ఇలాంటి వ్యాఖ్యలు చేయుస్తున్నదని శాస్త్రవేత్తలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సెన్సెక్స్ ▼ 162 34,184	నిఫ్టీ ▼ 61 10,492	డాలరుకు రూపాయి విలువ 65.17	బంగారం(10.గ్రా) రూ. 30,384	వెండి (కేజీ) రూ. 41,600	కోడిగుడ్లు హైదరాబాద్ 358, ఒక్కగుడ్డుకు 4.15, వరంగల్ 357, విజయవాడ 348, చెన్నై 397, ముంబయి 406

మురిపించిన మూడో త్రైమాసిక వృద్ధి



న్యూఢిల్లీ: వ్యవసాయం, తయారీ, నిర్మాణ రంగాల దన్నుతో డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో దేశ వృద్ధి రేటు 7.2 శాతానికి చేరింది. ఇది గత అయిదు త్రైమాసికాల (15 నెలల) గరిష్టం కావడం గమనార్హం. 2016 జులై-సెప్టెంబరు త్రైమాసికం జీడీపీ 7.5 శాతంగా నమోదు కాగా.. ఆ తరువాత ఏడు శాతానికి మించిన వృద్ధి నమోదు కావడం ఇప్పుడే తొలిసారని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.6 శాతం వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉన్నట్టుగా 'కేంద్ర గణాంకాల కార్యాలయం' (సీఎస్‌వో) తెలిపింది. అంతకు ముందు ఏడాది (2016-17లో) దేశ వృద్ధి రేటు 7.1 శాతంగా ఉన్న సంగతి తెలిసింది. జులై-సెప్టెంబరు త్రైమాసిక వృద్ధి రేటును కూడా ప్రస్తుతం ఉన్న 6.3 శాతం నుంచి 6.5 శాతానికి సీఎస్‌వో సవరించింది. గత డిసెంబరు త్రైమాసికంలో నిర్మాణ రంగంలో రికార్డు స్థాయిలో 6.8% వృద్ధి నమోదైనట్టు సీఎస్‌వో వివరించింది. అంతకు ముందు త్రైమాసికంతో పోలిస్తే ఇది 2.8 శాతం మేర అధికం.

కీలక రంగాల వృద్ధిలో దూకుడు..

చమురు శుద్ధి, సిమెంట్ రంగాల దూకుడుకు తోడు ఉక్కు, విద్యుత్తు, బొగ్గు ఉత్పత్తి రంగాల్లో గణనీయమైన వృద్ధి నేపథ్యంలో జనవరి మాసంలో ఎనిమిది కీలక రంగాల వృద్ధి 6.7 శాతానికి చేరింది. గత ఏడాది ఇదే కాలంలో కీలక రంగాల వృద్ధి 3.4 శాతంగా ఉంది. అంతకు ముందు డిసెంబరు మాసంలో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, చమురు శుద్ధి, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్తు రంగాలు మూకుమ్మడిగా 4.2శాతం వృద్ధిని మాత్రమే నమోదు చేయగా.. అది జనవరి నాటికి 6.7శాతానికి చేరడం విశేషం.

రిలయన్స్ 'ట్రెండ్స్' ప్రచారకర్తగా రానా



హైదరాబాద్: రిలయన్స్ రిటైల్‌లో దుస్తులు, ఉపకరణాల ప్రత్యేక విభాగమైన రిలయన్స్ ట్రెండ్స్ ప్రచారకర్తగా ప్రముఖ నటుడు రానా దగ్గుబాటిని నియమించుకున్నట్లు ఆ సంస్థ బుధవారం వెల్లడించింది. మార్చి 1, 2018 నుంచి రానా ట్రెండ్స్ కొత్త టీవీ బ్రాండ్ అంబాసిడర్‌గా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా రానా దగ్గుబాటి మట్లాడుతూ.. ట్రెండ్స్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేయటం సంతోషంగా ఉందన్నారు. సామాన్య ధరలకే అత్యుత్తమ ఫ్యాషన్ ట్రెండ్స్ అందిస్తోందని ఆయన అన్నారు. సంస్థలో ఫ్యాషన్ ఉత్పత్తులన్నీ ప్రత్యేకంగా అంతర్జాతీయ ట్రెండ్స్‌కు అనుగుణంగా ఉన్నాయని తెలిపారు. ట్రెండ్స్ మార్కెటింగ్ హెడ్, కపిల్ ఖట్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ట్రెండ్స్ ఫ్యాషన్ కేంద్రంగా మారిందన్నారు. ట్రెండ్స్‌కు ఏపీ తెలంగాణాల్లో 60కి పైగా స్టోర్స్ ఉన్నాయని తెలిపారు. యువత అనుగుణంగా ట్రెండ్స్‌లో ఫ్యాషన్ ఉత్పత్తులను పొందుపరుస్తామని పేర్కొన్నారు.

బ్యాంకులకు 780 కోట్ల కన్నం!

- కోల్‌కతాలోని ఆర్‌పీ సిస్టమ్స్ భారీ మోసం
- నకిలీ స్టాక్స్, ధ్రువపత్రాలతో లోన్‌లు
- 'మమత' అండతోనే భారీగా రుణాలు
- తాజాగా సీబీఐని ఆశ్రయించిన బ్యాంకులు



కోల్‌కతా: ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో (పీఎస్‌బీ) మరో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. కోల్‌కతా కేంద్రంగా పని చేస్తున్న ఆర్.పి.ఇన్ఫోసిస్టమ్స్ సంస్థ కల్పిత స్టాక్‌లు, నకిలీ ధ్రువ పత్రాలను పూచికత్తుగా పెట్టి పీఎస్‌బీల్లో దాదాపు రూ.780 కోట్ల మేర మోసాలకు పాల్పడినట్టుగా కెనరా బ్యాంక్ తెలిపింది. దీనికి సంబంధించిన సమస్త సమాచారంతో కెనరా బ్యాంక్ సీబీఐకి బుధవారం ఫిర్యాదు చేసింది. ఆర్.పి.ఇన్ఫోసిస్టమ్స్, ఆ సంస్థ డైరెక్టర్లు శివాజీ పంజా, కౌస్తవ్ రే, వినయ్ బఫ్నాతో పాలు పలువురు అధికారులు ఈ మోసంలో కీలక భూమిక పోషించినట్టుగా బ్యాంక్ తన ఫిర్యాదులో తెలిపింది. దీంతో వీరిపై సీబీఐ కేసు నమోదు చేసింది. సెక్షన్ 120బీ రెడ్ విత్ 420 కింద నేరపూరిత కుట్ర, 468, 471 కింద ఫోర్జరీ, ప్రభుత్వ సేవకుడి నేరపూరిత ప్రవర్తల కింద కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలోని 10 బ్యాంకుల కన్సార్టియం సీబీఐని ఆశ్రయించింది. ఆర్.పి. ఇన్ఫోసిస్టమ్స్ ఆ సంస్థ డైరెక్టర్లు మోసం చేసిన బ్యాంకుల కూటమిలో అలహాబాద్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, ఐడీబీఐ, యూనియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో పాటు ప్రయివేటు రంగంలోని ఫెడరల్ బ్యాంక్‌లు ఉన్నాయి. ఈ మొత్తం మోసంలో తమ బ్యాంకుకు నష్టం దాదాపు రూ.40 కోట్ల వరకు ఉంటుందని కెనరా బ్యాంక్ వెల్లడించింది. కాగా ఆర్.పి.సిస్టమ్స్ సంస్థ ఎస్‌బీఐ నుంచి రూ.170 కోట్లు, పీఎన్‌బీ నుంచి 70 కోట్లు, అలహాబాద్ బ్యాంక్ నుంచి రూ.40 కోట్లు రుణాలుగా తీసుకున్నట్టు సమాచారం. ఈ సంస్థ నకిలీ ధ్రువపత్రాలతో దాదాపు రూ.180 కోట్ల మేర రుణాలు పొందిన విషయాన్ని ముందుగా 2015లో గుర్తించిన ఐడీబీఐ బ్యాంక్.. అప్పట్లోనే ఈ సంస్థలపై సీబీఐకి ఫిర్యాదు చేసింది. ఐడీబీఐ అప్పుపోను మిగతా బ్యాంకులకు దాదాపు రూ.600 కోట్ల వరకు ఈ సంస్థ ఎగనామం పెట్టినట్టుగా సమాచారం. ఆర్.పి.సిస్టమ్స్‌పై ఇప్పటికే సీబీఐ వద్ద కేసు నమోదైనప్పటికీ తాజాగా విడుదలైన విజిలెన్స్ నిబంధనల మేరకు ఈ కేసును సాంకేతికంగా విశ్లేషించేందుకు గాను సీబీఐ వద్ద మరోమారు కేసు నమోదు చేసినట్టుగా కెనరా బ్యాంక్ వెల్లడించింది. ఈ సంస్థల చైర్మెన్ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడైనందునే ఆయన తన పరపతిని ఉపయోగించి బ్యాంకులను సులభంగా బురిడీ కొట్టించినట్టుగా విచారణలో ప్రాథమికంగా తెలినట్టుగా సమాచారం.

నేను విచారణకు రాను..

సీబీఐకి వజ్రాల వ్యాపారీ మోడీ ఝలక్ ..



న్యూఢిల్లీ: దేశంలోని బ్యాంకుల చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణానికి పాల్పడిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ దర్యాప్తు సంస్థ సీబీఐకి తనదైన రీతిలో ఝలక్ ఇచ్చాడు. పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ. 12,717 కోట్ల మేర మోసానికి పాల్పడిన కేసులో విచారణకు హాజరు కావాలంటూ నీరవ్ మోడీ అధికారిక ఈ-మెయిల్ అడ్రస్‌కు దర్యాప్తు సంస్థ సీబీఐ పంపిన కబురకు ఆయన తలపొగరుగా సమాధానం ఇచ్చినట్టుగా సమాచారం. తాను విచారణకు హజరు కానని తేల్చేశాడు. విదేశాల్లో తనకు వ్యాపారాలు ఉన్నాయని, వాటి పనుల్లో చాలా బిజీగా ఉన్నానని తలపొగరు సమాధానమిచ్చాడు. మరోవైపు తాను ప్రస్తుతం ఎక్కడున్నానన్న విషయాన్ని కూడా ఆయన బహిర్గతం చేయలేదు. నీరవ్ మోదీ ఇచ్చిన నెగిటివ్ సమాధానానికి సీబీఐ అధికారులు మరో మెయిల్ సందేశం పంపారు. కచ్చితంగా వచ్చే వారం విచారణకు హాజరుకావల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ప్రస్తుతమున్న దేశ హై కమిషన్‌ను సంప్రదించాలని కూడా ఆదేశాలు జారీచేసింది. భారత్‌కు రావడానికి అన్ని రకాల ఏర్పాట్లు తాము చేయనున్నట్టు సీబీఐ పేర్కొంది. పంజాబ్ నేషనల్ బ్యాంకులో భారీ కుంభకోణానికి పాల్పడిన నీరవ్ మోదీ విదేశాలకు పారిపోయిన సంగతి తెలిసిందే.

జియో దెబ్బకు ఎయిర్‌సెల్ 'దివాలా'!



న్యూఢిల్లీ: దేశీయం టెలికాం రంగంలో పోటీ తీవ్రతరం అవుతన్న నేపథ్యంలో నిర్వహణ నష్టాలను తట్టుకోలేక చిన్న టెలికాం ఆపరేటర్లు ఒక్కొక్కటి చేతులెత్తేస్తున్నాయి. తాజాగా ఈ జాబితాలోకి ఎయిర్‌సెల్ కూడా చేరుకుంది. దేశీయ టెలికాం రంగంలోకి కొత్త ఆపరేటర్ రంగప్రవేశం చేయడంతో పాటు టారీఫ్ యుద్ధ తీవ్రతరమై.. రెవెన్యూలు దిగజారుతున్న వేళ తాము ఆర్థిక కష్టాల్లోకి జారుకున్నట్టుగా ఎయిర్‌సెల్ వెల్లడించింది. ఆర్థిక సమస్యల ఒత్తిడి ఎక్కువ కావడంతో ఆ కంపెనీ బుధవారం దివాలా పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ విషయాన్ని కంపెనీ అధికారులు అధికారికంగా ప్రకటించారు. నిలకడలేని వ్యాపారం, పెరిగిన నష్టాలు కంపెనీపై ప్రతికూల ప్రభావం చూపాయని ఎయిర్‌సెల్ వివరించింది. అందుకే 'జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్' వద్ద దివాలా పిటిషన్ దాఖల చేసినట్టుగా కంపెనీ వెల్లడించింది. ఆర్థిక సమస్యలు తీవ్రమవుతున్నందున, కష్టాలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని వివరిస్తూ సంస్థలోని దాదాపు 5000 మందికి పైగా ఉద్యోగులకు సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి లేఖ రాశారు. కష్ట కాలంలో బ్యాంకులతో సహా ఎవరి నుంచి ఆర్థిక సాయం గానీ రుణాలు అందడం లేదని, కార్యకలాపాలపై వచ్చే ఆదాయమే శరణ్యంగా మారిందని పేర్కొంది. ఆదాయంతో పాటు లాభ దాయకత అంతకంతకూ తగ్గిపోతున్నందున, సంస్థకు సమస్యలు పెరుగుతున్నాయని వివరించింది. 8.5కోట్ల మంది వినియోగదారు లున్న ఈ సంస్థ 2017 జులైలో రూ.5 కోట్ల లాభాల్లో ఉండగా.. 2107 డిసెంబరు నాటికి రూ.120 కోట్ల నిర్వహణ నష్టాల్లోకి చేరింది. దీంతో పాటు ఇటీవల కంపెనీ ఆరు సర్కిళ్ల పరిధిలో సేవలను నిలిపివేసింది. సంస్థను మూసివేస్తున్నారనే ఊహాగానాలతో ఈ సంస్థకు వినియోగదారులు దూరమవుతున్నారు.

డిపాజిట్లపై వడ్డీరేట్ల పెంపు: ఎస్‌బీఐ

ముంబయి: భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) డిపాజిట్లపై వడ్డీరేట్లను పెంచింది. రూ.కోటి కంటే తక్కువ డిపాజిట్లపై వడ్డీని 10-50 బేస్ పాయింట్ల వరకు పెంచింది. అంటే సుమారు 0.5 శాతం వరకు వడ్డీ రేటు పెరుగుదల ఉండనుంది. తాజా పెంపుతో 7 నుంచి 45 రోజుల డిపాజిట్లపై వడ్డీరేటును 5.25 శాతం నుంచి 5.75 శాతానికి పెంచింది. వార్షిక వడ్డీ రేటును 6.40 శాతంగా పేర్కొంది. ఇప్పటివరకు ఇది 6.25 శాతంగా ఉంది. 2 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాల మధ్య కాలపరిమితి తీరే డిపాజిట్లపై 6.50 శాతం వడ్డీని అందించనుంది. ఇప్పటి వరకూ ఇది 6 శాతంగా ఉంది. సీనియర్ సిటిజన్ల డిపాజిట్లపై వడ్డీని 6.50 శాతం నుంచి 7 శాతానికి సవరించింది. ఈ పెంపు బుధవారం (ఫిబ్రవరి 28) నుంచి వర్తిస్తుందని ఎస్‌బీఐ తెలిపింది.



ప్రారంభోత్సవ శిలాఫలకం ధ్వంసం

- టీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట
- నందిగామలో పరిస్థితి ఉద్రిక్తం
- మంత్రులు సమయం పాటించలేదని ఆందోళన
- రేవంత్‌రెడ్డి అరెస్టుకు యత్నం, వాహనం ఠాణాకు తరలింపు
- కాంగ్రెస్ కార్యకర్తల అరెస్ట్

నవతెలంగాణ - మద్దూర్

ప్రారంభోత్సవానికి మంత్రులు సమయం పాటించలేదని ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన చేసిన క్రమంలో శిలాఫలకం ధ్వంసమైంది. దీంతో టీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల్లో తోపులాట జరిగింది. కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో బుధవారం జరిగింది. మద్దూర్ మండలం నందిగామలోని బీటీ రోడ్డు శంకుస్థాపనకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి హాజరవ్వాల్సి ఉంది. మంత్రులు, ఎమ్మెల్యేలు ఉదయం 9:30 గంటలకు హాజరుకావాల్సి ఉండగా రాకపోవడంతో ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి తన అనుచరులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఉదయం 11:30 గంటలైనా మంత్రులెవరూ రాకపోవడంతో 'మంత్రులు వస్తారా లేదా?. కార్యక్రమాన్ని నేనే ప్రారంభించాలా' అని రేవంత్‌రెడ్డి పోలీసులను అడగ్గా మరో పది నిమిషాల్లో వస్తారని చెప్పారు. అయినా రాకపోవడంతో ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి సర్పంచ్, ఎంపీటీసీలతో కలిసి బీటీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మంత్రులు వచ్చే వరకు ఆగాలని సీఐ కోరగా, తానూ ప్రజాప్రతినిధినేనని రేవంత్‌రెడ్డి సమాధానమిచ్చారు.

ఈ తరుణంలో పోలీసులకు, కాంగ్రెస్ నాయకులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ తోపులాటలో సీఐని శిలాఫలకం పైకి నెట్టేయడంతో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. ఇదే క్రమంలో శిలాఫలకం కూలిపోయింది. దాంతో కాంగ్రెస్, టీఆర్ఎస్ కార్యకర్తలు ఒకరినొకరిని తోసుకుంటూ గొడవ పడ్డారు. పోటాపోటీగా నినాదాలు చేస్తూ ధర్నాకు దిగారు. సీఐలు, ఎస్ఐలు పరిస్థితిని అదుపు చేయడానికి విశ్వప్రయత్నం చేసినా ఫలించకపోవడంతో నారాయణపేట్ నుంచి అదనపు బలగాలను రప్పించారు. పోలీసులు లాఠీచార్జి చేసి కొందరు కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్టు చేశారు. ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డిని కూడా అరెస్టు చేసేందుకు యత్నించగా కార్యకర్తలు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే వేరే వాహనంలో ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత అక్కడే ఉన్న రేవంత్ వాహనాన్ని కోయిలకొండ పోలీస్టేషన్‌కు తరలించారు.

అనంతరం మంత్రులు నందిగామ గ్రామాన్ని పరిశీలించి, శిలాఫలకం ధ్వంసమైన ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కారకులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. శిలాఫలం కూలగొట్టిన వారిని అరెస్టు చేయాలని టీఆర్ఎస్ నాయకులు ధర్నా చేశారు. ఆ తర్వాత మిగతా కార్యక్రమాలన్నింటినీ మంత్రులే ప్రారంభించడంతో కాంగ్రెస్ కార్యకర్తలు అభ్యంతరం చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే లేకుండా ఎలా ప్రారంభిస్తారని వారూ ఆందోళన చేశారు. పోలీసులు సమస్యను సద్దుమణిగించే ప్రయత్నం చేశారు.

బాలకార్మికుల్లేని.. సమాజాన్ని నిర్మించాలి

నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి

- శ్రీఇందు కళాశాలలో విద్యార్థులతో ముఖాముఖీ
- బాలబాలికల హక్కులు, చట్టాలపై చర్చ



నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

బాలకార్మికుల్లేని భారత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వాలు పని చేయాలని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి అన్నారు. కానీ ప్రపంచంలో 53శాతం బాలబాలికల విషయంలో అన్ని రకాలుగా అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని శ్రీఇందు ఇంజినీరింగ్ కళాశాలలో 'చైల్డ్ ఫ్రెండ్లీ తెలంగాణ' అంశంపై విద్యార్థులతో బుధవారం ముఖాముఖీ నిర్వహించారు. బాలబాలిక చట్టాలు, హక్కులు, ప్రభుత్వాలు, పౌరుల బాధ్యతలు అనే అంశాలపై సత్యార్థి విద్యార్థులతో చర్చించారు. ప్రభుత్వాలు కల్పించాల్సిన రక్షణ, ఇంట్లో తల్లిదండ్రులు సైతం వారి పిల్లలతో మెలగాల్సిన తీరుపై వివరించారు. అనంతరం కైలాష్ సత్యార్థి మాట్లాడుతూ.. దేశంలో పిల్లలకు రక్షణ కరువైందన్నారు. ప్రపంచంలో 53శాతం బాలబాలికల విషయంలో అన్ని విధాలుగా అన్యాయమే జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల సంతోషాలు, కళలను పట్టించుకోకపోవడంతో బాల్యం బుగ్గిపాలవుతోందన్నారు. చాలా మంది బాలకార్మికులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బాలకార్మికులకు విముక్తి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. దేశం అనేక రంగాల్లో అభివృద్ధి చెందుతున్నా ఇంకా బాల, బాలికలపై వేధింపులు మాత్రం తగ్గడం లేదన్నారు.

నిరక్షరాస్యతను కూకటివేళ్లలో పెకిలించాల్సిన అవసరముందన్నారు. అప్పుడే బాలికలకు రక్షణ ఉంటుందని చెప్పారు. భారతీయులు ఇంతకు ముందు ఇతర దేశాల్లో చదువుకునే వారు కాదని, ప్రస్తుతం విదేశాల్లో చదువుకునేందుకు ఉత్సాహం చూపుతున్నారని చెప్పారు. టెక్నాలజీ, శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు రోబోటిక్స్ ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్ లాంటి సాంకేతిక పరిజ్ఞానం దేశంలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. జపాన్, ఇటలీ, ఫ్రాన్స్ దేశాలకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. పేదరిక నిర్మూలన, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన యువతతోనే సాధ్యమన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఫ్రెండ్లీ చైల్డ్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, దాని కొనసాగింపు ఎంతో సంతోషకరమని అన్నారు. నిరుపేద బాలికల విద్యావసతి కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కలలు కనండి, అన్వేశించి, ఆచరణలో పెట్టాలని విద్యార్థులకు సూచించారు.

కైలాష్ సత్యార్థి ఆడిటోరియం

శ్రీఇందు కళాశాలలోని ఆడిటోరియానికి తమరి పేరు పెట్టుకుంటామని కళాశాల చైర్మన్ వెంకట్రావ్ కైలాష్ సత్యార్థిని కోరడటంతో ఆయన అంగీకరించారు. దాంతో కళాశాల ఆడిటోరియానికి కైలాష్ సత్యార్థి ఆడిటోరియంగా నామకరణం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు బీవీ పాపారావు, రాష్ట్ర ఫిల్మ్ సొసైటీ చైర్మెన్ వేదకుమార్, డైరెక్టర్ సెంటర్ ఫర్ ఈ గవర్నెన్స్ డాక్టర్ జె.వేదప్రసాద్, కళాశాల వైస్ చైర్మెన్ అనూప్‌చక్రవర్తి పాల్గొన్నారు. కరీంనగర్‌లోనూ కైలాష్ సత్యార్థి విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌దే అధికారం... లేకుంటే సన్యాసం

కేంద్రానికి కేసీఆర్ చెంచాగిరి : ఉత్తమ్

- టీఆర్ఎస్‌ది నయవంచక పాలన : కుంతియా
- సంగారెడ్డి జిల్లా జహిరాబాద్‌లో ప్రజాచైతన్య బస్సు యాత్ర



బహిరంగసభలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-జహిరాబాద్

'తెలంగాణలో కాంగ్రెస్సే అధికారంలోకి వస్తుంది. అలా కాని పక్షంలో నా కుటుంబం రాజకీయ సన్యాసం తీసుకుంటుంది' అని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. టీఆర్ఎస్ పాలనలో ప్రజలు విసుగెత్తారని, ఎప్పుడు ఎన్నికలొచ్చినా టీఆర్ఎస్‌ను ఓడించాలనే కసితో ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ చేపట్టిన ప్రజా చైతన్య బస్సు యాత్ర సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు బుధవారం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే డా.జె.గీతారెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో ఉత్తమ్ మాట్లాడుతూ.. మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత మైనార్టీలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తినే తిండిపైనా నిబంధనలు విధిస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో మోడీని గద్దె దించాలంటే ఇక్కడ టీఆర్ఎస్‌నూ ఓడించాలన్నారు. కేసీఆర్ కేంద్రం వద్ద చెంచాగిరి చేయడంలో ఏదో మతలబుందని ఉత్తమ్ అన్నారు. కేసీఆర్ నల్లధనం కూడబెట్టడం వల్లే మోడీని చూసి భయపడుతున్నారని ఆరోపించారు. ముస్లింలకు 12శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా సీఎం కేసీఆర్ మోసగించారని చెప్పారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రాంచందర్ కుంతియా మాట్లాడుతూ..రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం రైతులను, నిరుద్యోగ యువతను, విద్యార్థులను, బీదలు, అన్ని వర్గాలనూ వంచిస్తూ నయ వంచక, దుర్మార్గ పాలన సాగిస్తోందన్నారు. ఎన్నో అకాంక్షలతో ఏర్పడ్డ కొత్త రాష్ట్రంలో ప్రజలు సంతోషంగా లేరన్నారు. ఉద్యోగాలు భర్తీ కావడంలేదని, కొత్త కంపెనీలు రావడంలేదని చెప్పారు. దేని కోసమైతే ప్రజలు రాష్ట్రం కోసం పోరాడారో ఆ లక్ష్యాన్ని కేసీఆర్ నీరుగారుస్తున్నారని ఆరోపించారు. సదాశివపేట మండలం బాబుల్‌గావ్‌లో పత్తి రైతు మంగళవారం ఆత్మహత్య చేసుకోగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతు కుటుంబానికి లక్ష రూపాయలు సాయమందించారు.

బహిరంగసభలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి, వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య, సబితారెడ్డి, దానం నాగేందర్, పొన్నం ప్రభాకర్, సురేశ్ షెట్కర్, సుదర్శన్‌రెడ్డి, రవీంద్రనాయక్, సర్వే సత్యనారాయణ, అజారుద్దీన్, ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు బట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మల్లు రవి, వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

పొరపాట్లు లేకుండా పరీక్షలు నిర్వహించాలి

- పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లు వద్దు : వీడియోకాన్ఫరెన్స్‌లో డిప్యూటీసీఎం కడియం శ్రీహరి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పదోతరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పక్కాగా, ఎలాంటి పొరపాట్లు జరగకుండా నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. టెన్త్, ఇంటర్‌పరీక్షల నిర్వహణపై సచివాలయం నుంచి బుధవారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, డీఈఓలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ...తెలంగాణలో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారనే పేరొచ్చేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లో సెల్‌ఫోన్లు అనుమ తించవద్దని అధికారులను ఆదేశించారు. పరీక్షా సమయాల్లో సెంటర్లకు దగ్గరగా ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలన్నారు.

పరీక్షలు జరుగుతున్న సమయాల్లో కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు పరీక్షలకు సంబంధించిన ఏవైనా ఫోన్‌కాల్స్ వస్తే వాటిపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. దూరప్రాంతాల్లో, ఏజెన్సీ ఏరియాల్లో ఉన్న పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బందోబస్తు కల్పించాలని పోలీస్ అధికా రులను ఆదేశించారు. ప్రశ్నాపత్రాలు, సమాధాన పత్రాలు పరీక్షా కేంద్రా లకు తీసుకెళ్లేటప్పుడు ఎస్కార్ట్ కల్పించాలని కోరారు. వేసవి ఇప్పటికే మొదలైందని, కొత్తగూడెంలో 42 డిగ్రీల తీవ్రత ఉందని, దీనిని దష్టిలో పెట్టుకుని పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, మెడికల్ వసతులు కల్పించా లని సూచించారు. రవాణాకు సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకోవా లని, హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్, ఇన్‌స్పెక్టర్ జనరల్ శిఖా గోయల్.. కలెక్టర్లు,ఎస్పీలు, డీఈఓలకు వివరించారు.



బోరాన్ ప్రాధాన్యం

మొక్కలకు నత్రజని, భాస్వరం, పొటాషియం, గంధకం, మెగ్నీషియం, కాల్షియం వంటి ముఖ్య పోషకాలతో పాటు జింకు, ఇనుము, మాంగనీసు, బోరాన్, మాలిబ్డినమ్ వంటి సూక్ష్మ పోషకాలు కూడా చాలా అవసరం. మొక్కల పెరుగుదల, పంట దిగుబడికి ఈ పోషకాలు అందుబాటు నేల స్వభావంపై ఆధార పడి ఉంటుంది. ఎరువుల యాజమాన్యం అంటే కేవలం నత్రజని, భాస్వరం, పొటాషియంపైనే దృష్టి సారించి సూక్ష్మ పోషకాల వినియోగం పక్కన పెడుతున్నారు. మొక్కకు తక్కువ మోతాదులో అవసరమైనందున వీటిని సూక్ష్మ పోషకాలంటారు. కానీ మొక్క ఎదుగుదలలో వీటి ఆవశ్యకత తక్కువేమీ కాదు. సూక్ష్మ పోషకాలను ఏ విధంగా మొక్క అవసరానికి తగ్గట్టు అందిస్తున్నామో సూక్ష్మ పోషకాలను కూడా సకాలంలో మొక్కకు అందిస్తే పంట దిగుబడులను నాణ్యతను కాపాడుకోవచ్చు.

బోరాన్ ఎక్కడ తక్కువగా ఉంటుంది?

సున్నపు పాలు ఎక్కువగా ఉన్న భూముల్లో బోరాన్ లోప లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఇసుక నేలల్లో బోరాన్ లభ్యత తక్కువ, మట్టి కణాలు విడిపోవడం వల్ల సూక్ష్మ పోషకాల విలువలు కూడా తక్కువగా ఉంటాయి. సాధారణంగా నేల ఉదజని సూచిక పెరిగే కొద్దీ బోరాన్ లభ్యత తగ్గుతుంది.

నేలలో అధిక తేమ ఉంటే బోరాన్ లోప లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. కొత్తగా సాగులోకి తెచ్చి భూముల్లో పైపొర తవ్వడం వల్ల కూడా లోపం రావచ్చు. అధిక మోతాదులో నత్రజని ఎరువుల వాడకం వల్ల కూడా ఈ లోపం రావచ్చు.

పంటలకు బోరాన్ ఆవశ్యకత: మొక్క కణజాలు సరిగ్గా అభివృద్ధి చెందడానికి న్యూక్లిక్ ఆమ్లం తయారీలో బోరాన్ కీలక పాత్రవహిస్తుంది. కీలాగ్రాన్ని పుప్పొడి సమ్యంగా చేరుకొని ఫలదీకరణ ప్రక్రియలో బోరాన్ కీల పాత్ర వహిస్తుంది. మొక్కలకు తక్కువ మోతాదులో అవసరమైనప్పటికీ వివిధ ప్రక్రియలలో ప్రముఖ పాత్ర వహించడమే కాక కావాల్సిన ఎంజైమ్‌లను తయారు చేయడంలో స్వాంపోషక పదార్థాలు మొక్కకు సక్రమంగా ఉపయోగపడంలో కూడా బోరాన్ ముఖ్య పాత్ర వహిస్తుంది. గింజకట్టు దశలో బోరాన్ లోపం తలెత్తితే విత్తనం నిర్మాణం దెబ్బతిని వంకరలు తిరిగి బెండు తయారవుతుంది. హార్మోన్ల కదలికలో ప్రధాన పాత్ర వహించి మొక్క పెరుగుదలకు కావాల్సిన వివిధ ప్రక్రియల్లో ముఖ్య పాత్ర వహిస్తుంది.

పండ్ల తోటల్లో బోరాన్ లోప లక్షణాల నివారణ

నిమ్మ ఆకుల ఈనెల వెంట పసుపుగా మారి లీలిపోయినట్టు కనిపించి రాలిపోతాయి. కాండంపై పగుళ్లు ఏర్పడి జిగురు కారుతూ ఉంటుంది. పండ్లపై నీరు కారి లేత గోధుమ రంగు మచ్చలు ఏర్పడి కుళ్లుతున్నట్టు తయారవుతాయి. పండ్లు పగిలి దలసరిగా మారి లోపలి గుజ్జు గట్టిగా తయారవుతుంది. నివారణకు 0.1 లేదా 0.2 శాతం బోరిక్ ఆమ్లం ద్రావణాన్ని పిచికారి చేయాలి. లేదా చెట్టుకు 50 గ్రా. బోరిక్ యాసిడ్‌ను పాదుల్లో పైపాటు సమయంలో వేయాలి.

బొప్పాయి: కాయలు పండ్లపైన వివిధ రకాల బొడిపెలు వచ్చి అక్కడక్కడ చిన్న పగుళ్లుపడితే పైపొర గరుకుగా ఉంటుంది. కాయ ఆకారాన్ని కోల్పోతుంది. నివారణకు లీటరు నీటికి 2.5గ్రా. బోరాక్స్ కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

మామిడి: కాయ దిగువ భాగం గరుకుగా నల్లగా ఉండి కాయలు పక్వానికి రాకముందే రాలిపోతాయి. ఉదజని సూచిక ఎక్కువ గల చౌడు నేలల్లో బోరాన్ లోపం ఎక్కువగా కనిపిస్తుంది. మామిడి కాయల్లో పగుళ్లకు బోరాన్ లోపం ఒక కారణంగా చెప్పవచ్చు. దీని నివారణకు 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు 0.5 శాతం బోరాక్స్‌ను చెట్టుపై పిచికారి చేసి ఈ లోపాన్ని నివారించవచ్చు.



కొబ్బరి: కాపుకు వచ్చిన తొలిదశలో ముఖ్యంగా 10నుంచి 12 ఏండ్ల వయసు ఉన్న మొక్కలు బోరాన్ లోపానికి గురవుతాయి. లేత ఆకులు చిన్నవిగా, మెళికతిరిగి చివర రెండుగా చీలి ఉంటాయి. మొవ్వు కుదించుకొని పోయి గట్టిగా తయారవుతుంది. ఆకులు ఈనెలు లేకుండా కురచబారి నల్లని కట్టెముక్కలుగా మొవ్వ చుట్టూ కనిపిస్తాయి. ఎదిగిన చెట్లలో ఆకుల్లోని ఈనెలు విడిపడక, అంటుకుపోయి ఉంటాయి. బోరాన్ లోప నివారణకు 1.0-1.5 మీటర్ల గొయ్యి తీసి ప్రతి అడుగుమట్టి నమూనా సేకరించి, భూసార పరీక్ష చేయించుకోవాలి. భూమిలో బోరాన్ లభ్యత 0.3 పిపిఎం కన్నా తక్కువ ఉంటే నివారణకు ఏడాది లోపు మొక్కలకు 1.0-1.5గ్రా. బోరాక్స్ వాడాలి. 1-3 ఏండ్ల మొక్కలకు 10-15గా, 5 ఏండ్లు పైబడిన మొక్కలకు 50-75 గ్రా. వాడాలి.

కూరగాయ పంటల్లో బోరాన్ లోప లక్షణాలు - నివారణ

దుంపలైన క్యారెట్, ముల్లంగి మొదలగు పంటల్లో బోరాన్ లోపిస్తే లేత ఆకులపై ఎరుపు లేదా ఇటుక రంగు మచ్చలేర్పడి ఆకారాన్ని కోల్పోతాయి. ఈనెల పెరుగుదల తగ్గి ఆకులు పెళుసులుగా మారి ముడుడుకు పోతాయి. మొగ్గలు రాలి, లేత చిగర్లు ఊదారంగులోకి మారుతాయి. ఎకరానికి 8కిలోల బోరాక్స్‌లేదా 2 గ్రా. బోరాక్స్ ఒక లీటరు నీటిలో కలిపి మొక్కలపై పిచికారి చేయాలి.

టమాట: లేత ఆకులు పసుపు నారింజ పండు రంగులో ఉండి ఆకులు కిందికి వంకర తిరిగి ఉండడం బోరాన్ లోప ముఖ్య లక్షణం. పెరుగుదల బాగా తగ్గిపోతుంది. లేత ఆకులు, ఈనెలు మాత్రం ఆకుపచ్చగా ఉండి మిగతా భాగం పసుపు రంగుకు మారి ఆకులు చిన్నవిగా ఉంటాయి. కాండం, మిగతా భాగాలు బాగా పెళుసుగా ఉంటాయి. కాయలు పగిలిపోతాయి. నివారణకు ఒక లీటరు నీటిలో 2 గ్రా. బోరాక్స్ కలిపి కావాల్సిన మేర ద్రావణాన్ని తయారు చేసుకొని పిచికారి చేయాలి. నాటే ముందు ఎకరానికి 8 నుంచి 12 కిలోల చొప్పున బోరాక్స్ వేస్తే ఈ లోపం రాకుండా ఉంటుంది.

క్యాబేజీ: క్షార నేలల్లో బోరాన్ లోపం వచ్చే అవకాశం ఉంది. పైరు పక్వానికి వచ్చే సమయంలో బోరాన్ లోపం వచ్చినప్పుడు ముదురు గోధుమ రంగుకు మారుతుంది. బోరాన్ లోప నివారణకు ఆమ్ల లక్షణాలు గల నేలల్లో ఎకరానికి 4-6 కిలోల బోరాక్స్ వాడి నివారించుకోవచ్చు. లోప నివారణకు 0.3-0.4 శాతం బోరిక్ ఆమ్లం రెండుసార్లు అంటే మొక్క నాటిన రెండు వారాల తర్వాత, పువ్వు ఏర్పడడానికి రెండు వారాల ముందు మొక్కలపై పిచికారి చేయాలి.

అరటి: బోరాన్ లోపం వల్ల ఆకులు చాలా మందంగా ఏర్పడతాయి. కాయలు పగిలిపోతాయి. కాయ నాణ్యత, దిగుబడి తగ్గిపోతుంది. నివారణకు ఒక్కో చెట్టుకు 10గ్రా. బోరాక్స్ భూమిలో వేయాలి. ప్రత్యామ్నాయంగా ఆకులపై 0.2 శాతం బోరాక్స్ (లీటరు నీటికి2 గ్రా) కలిపిన ద్రావణాన్ని వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. ఈ విధంగా పండ్లు, కూరగాయ పంటల్లో బోరాన్ లోప లక్షణాలను గుర్తించి సరైన నివారణ చర్యలు చేపడితే నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు.



- కె. భవ్యశ్రీ,
సీనియర్ రీసెర్చ్ ఫెలో(హార్టికల్చర్)

అడగండి.. చెబుతాం!

రైతన్నలూ.. పంటల సాగు, పశుపోషణ తదితర విషయాల్లో మీకేమైనా సమస్యలున్నాయా.. పరిష్కారం దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా..? మీ సందేహాలకు సమాధానాలు ఇచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మీరు చేయాల్సిందల్లా ఈ కింది చిరునామాకు పోస్ట్‌కార్డు రాయడం లేదా ఇ-మెయిల్ చేయడం లేదా నేరుగా ఫోన్ చేసి సమస్య వివరించడమే.

మా చిరునామా
'కిసాన్' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, ఆజామాబాద్, ఆర్.టి.సి కళ్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500020. ఫోన్: 8332995392,
kisan@navatelangana.com

లాభాల 'పట్టు'

దేశ ఆర్థిక వ్యవస్థలో పట్టు పరిశ్రమకు ఒక ముఖ్యమైన స్థానం ఉంది. ఇతర వ్యవసాయ ఆధారిత పరిశ్రమలతో పోల్చినప్పుడు పట్టు పరిశ్రమ ఏడాది పొడవునా రైతులకు పని కల్పించడంలోనూ, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించడంలో గణనీయమైన స్థానంలో ఉంది. మల్బరీ మొక్కను ఒకసారినాటితే 15 ఏండ్ల వరకు దిగుబడి పొందవచ్చు. పట్టు పరిశ్రమ చేనేత రంగానికి వెన్నుముక వంటిది. పట్టు గూళ్ల ద్వారా ఏడాదికి రూ.50వేల నుంచి లక్ష రూపాయల వరకు నికరాదాయం వచ్చే అవకాశం ఉంది. ప్రకృతి సిద్దంగా లభించే మూడు రకాల పట్టు ఇరి, దసళి, మల్బరీ పట్టు మన రాష్ట్రంలో ఉత్పత్తి అవుతోంది.

వాతావరణం: మల్బరీ తోటలో అన్ని రకాల వాతావరణ పరిస్థితులలో అంటే 15 సెల్సియస్ డిగ్రీల నుండి 40 సెల్సియస్. డిగ్రీల వరకు గల ఉష్ణోగ్రతల మధ్య 500 మిల్లీమీటర్ల నుంచి 2000 ఎంఎం వర్షాపాతం ఉన్న ప్రాంతాలలో పెరుగుతుంది.

నేలలు: నల్లరేగడి భూములు, చవుడు భూములు, మల్బరీకి పనికి రావు. మిగతా అన్ని రకాల నేలల్లోనూ మల్బరీ సాగు చేసుకోవచ్చు. ఎర్రటి చెలక భూములు చాలా ఉత్తమమైనవి. నేల పీహెచ్ విలువ 6.5 నుండి 7.5 వరకు ఉత్తమమైనది.

మల్బరీ సాగులో వంగడాల ఎంపిక : అధిక దిగుబడినిచ్చేవి వి1, ఎస్ 36 రకాలు మంచివి. వి1 ఒక ఏడాదికి ఎకరానికి 24 నుంచ 30 టన్నులు ఎస్ 36 రకం 1 ఎకరానికి 16నుంచి 18 టన్నుల ఆకు ఉత్పత్తి చేయవచ్చు. జి2,జి4 వంగడాలు అధిక దిగుబడినిచ్చే రకాలను సాగు చేస్తున్నారు. ఒక ఎకరంలో నాటేందుకు కావాల్సిన మొక్కలు 3' 3' స్థలావకాశంలో: 5500 మొక్కలు జోడు సాళ్ల పద్దతి 3' 5' 2' స్థలావకాశంలో 5000 మొక్కలు.

నారు మొక్కలు పెంచడం నిర్వహణ: ఒక ఎకరానికి 1.60 లక్షలు కటింగ్స్ (1065 బెడ్స్, ఒక బెడ్‌కు 150 చొప్పున) నారు మళ్లలో నాటి 1.20 లక్షలు నారు మొక్కలను ఉత్పత్తి చేయవచ్చు.

ముఖ్య గమనిక: మొక్కలు/కటింగ్స్‌ను బెడ్‌లో నాటుటకు ముందుగా 0.1 శాతం డైమిదేన్-ఎం 45 (2 గ్రా. లీటరు నీరు) ద్రావణంలో 30 నిమిషాల పాటు ఉంచి శుద్ధి చేసిన తర్వాతనే నాటుకోవాలి.

అనువైన సమయం : మల్బరీ సాగు ఏడాది పొడవునా వేసుకోవచ్చు

మల్బరీ తోట యాజమాన్యం: భూసార పరిరక్షణ కొరకు ఎకరానికి సాలీనా 8 టన్నుల (6 ట్రాకర్లు) పశువుల ఎరువును 4 విడతలుగా వేయాలి. చాకీ తోట అయితే ఎకరానికి 16 టన్నులు వేయాలి. నారు మొక్కలు నాటిన తర్వాత 30 రోజులకు సంకీర్ణ ఎరువును 20:20:20 నిష్పత్తిలో ఇవ్వాలి. నత్రజని స్థిరీకరించు అజటో బాక్టర్, అజోస్పైరిల్లం లను ఎకరానికి ఏడాదికి 8 కేజీలు వాడాలి. దీనిని బాగా మగ్గిన పశువుల ఎరువుతో కలిపి తోట కత్తిరించిన 20 నుంచి 25 రోజుల తర్వాత వేయాలి. అలాగే వర్మికంపోస్టును 1-1.5 టన్నులు వేయాలి. సరియైన యాజమాన్య పద్ధతులను ఉపయోగించిన మల్బరీ తోట నారు మొక్కలు నాటి 90 రోజుల తర్వాత పట్టు పురుగులను మేపవచ్చు. చారీ పురుగుల పెంపకానికి ప్లాస్టిక్ ట్రేలను వాడాలి.

రోగ నిరోధక చర్యలు

ప్రతి పంటకు ముందు, పంట తీసిన తర్వాత విధిగా రోగ నిరోధక చర్యలు చేపట్టాలి. బ్లీచింగ్ పొడి, సున్నపు పొడి, శానిటెక్ (సెరిక్లోర్) ఫార్మాలిన్ మొదలగు వాటిని సూక్ష్మ క్రిమినాశనులుగా విరివిగా వాడుతున్నారు. వీటిని తగిన మోతాదులో వినియోగించి, రేరింగు పరికరాలను షెడ్డును క్రిమి రహితంగా చేసుకోవాలి. దీని వల్ల పంట సజావుగా చేతికి వస్తుంది. దిగుబడి పెరిగి, రైతులకు రావడి వస్తుంది. ప్రతి చదరపు అడుగు విస్తీర్ణానికి 160-200 ఎంఎల్‌ల రోగ నిరోధక ద్రావణం అవసరం ఉంటుంది.

పట్టు పురుగులు పొదిగించుట

పట్టు గుడ్లను 25 సెంటీ గ్రేడ్ ఉష్ణోగ్రత, 80నుంచి 85 శాతం గాలిలో తేమ కలిగిన గదిలో పెంచాలి. 8వ రోజున నల్లబట్టను కప్పి వెలుతురు తగలకుండా 36-48 గంటల పాటు ఉంచి, 9-10 రోజుల సూర్యోదయాన్నే వెలుతురు చూపించిన 90-95 శాతం గుడ్ల నుండి పురుగులు బయటికి వస్తాయి.



పట్టుపురుగుల పెంపకం

మల్బరీ తోటను 2 లేదా 3 భాగాలుగా విభజించి ఏటా 10 నుండి 11 పంటల తీయవచ్చు. నవీన పద్ధతులలో రేరింగ్ గతి నిర్మించి, తగిన పరికరాలు ఏర్పాటు చేసుకున్నట్టయితే దిగుబడి పెరుగుతుంది. రేరింగు గదికి ఎల్ ఆకారంలో వరండా ఏర్పాటు చేసుకోవడం, అదనపు సౌలభ్యం. రేరింగు గదిలో పడకల వెడల్పు 5-51/2 వెడల్పుతో భూమి నుండి1 అడుగు పైకి ఉండేటట్టు చూసుకోవాలి. గోడకు స్టాండుకు మధ్య 2 అడుగుల దూరం ఉండేలా చూసుకోవాలి.

పట్టు పురుగు లార్వా దశ 26-28 రోజుల వరకు ఉంటుంది. ఇందులో 4 జ్వరములు, 5 దశలుంటాయి. మొదటి రెండు దశలలో పురుగుల పెంపకాన్ని చాకీ పురుగుల పెంపకమంటారు. ఇది 8-9 రోజులు ఉంటుంది. ఈ దశలో పురుగులను అనువైన వాతావరణ పరిస్థితులలో పెంచడం వల్ల పురుగులు బలిష్టంగా పెరిగి దిగుబడి బాగుంటుంది. చాకీ దశలో 28 డిగ్రీ సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత 80 -90 శాతం తేమ, మంచి పోషక విలువలు కల్గిన ఆహారం అవసరం.

2వ జ్వరం తర్వాత పట్టు గూళ్లు అల్లే వరకూ పట్టు పురుగులను, కొమ్మ మేత పద్ధతి ద్వారా పడకలపై పెంచుతారు. ఈ పద్దతిలో 50శాతం కూలీలను, 20 శాతం ఆకును ఆదా చేసుకోవచ్చు. పురుగులను ఎక్కువసార్లు తాకే అవసరం ఉండదు. పడకలను ఒకసారి శుభ్రం చేస్తే సరిపోతుంది. పడకలను పొడిగా, శుభ్రంగా ఉంచడం కీలకం.

శక్తి, విజేత, అంకుర్, సంజీవిని వంటి బెడ్‌డిస్ ఇన్ ఫెక్టెంట్స్ తగిన మోతాదులో వాడాలి.

4వ జ్వరము లేచిన తరువాత 6-8 రోజులకు పురుగులు పరిపక్వతకు వస్తాయి. ఈ సమయంలో పురుగులను చంద్రికలపై వేయాలి. తరువాత చంద్రికలను గాలి ప్రసరణ ధారాళంగా ఉన్న గదిలో ఉంచాలి. ఇప్పుడు చంద్రికలకు ప్రత్యామ్నాయంగా నేత్రికలను ఉపయోగిస్తున్నారు. ఇవి సహజ మోల్టింగ్ చేయడానికి అనువుగా ఉంటాయి.

గూళ్లు అల్లే దశలో గాలిలో తేమ 65 నుంచి 70 శాతం, ఉష్ణోగ్రత 24-25 డిగ్రీల మసక వెలుతురు, గాలి ప్రసరణ ఉండేటట్టు చూడాలి. గూళ్లు అల్లిన 6వ రోజున (బివి) విడిపించి, డబల్ గూళ్లను, నాణ్యతలేని గూళ్లను వేరుచేసి, మంచి గూళ్లను పలుచని గోనె సంచులలో చల్లని వేళలో మార్కెట్‌కు తరలించాలి.

హైదరాబాద్‌లోని తిరుమలగిరి, జనగామా జిల్లాలోని జనగాములో పట్టుగూళ్ల మార్కెట్ సౌకర్యం ఉంది. ఇక్కడ గూళ్ల నాణ్యతనుబట్టి ధరలు నిర్ణయించబడతాయి. బివి పట్టుగూళ్లపై కిలో ఒక్కంటికి రూ. 75 చొప్పున, సిబి గూళ్లకు కిలో ఒక్కంటికి రూ. 40 చొప్పున ప్రభుత్వం ప్రోత్సాహకంగా అందిస్తుంది.

లాభాలు : ఒక ఎకరం మల్బరీ తోట ద్వారా ఏడాది మొత్తం 5 మందికి ఉపాధి కలుగుతుంది. ప్రకృతి సిద్ధంగా లభించే మూడు రకాల పట్టు ఇరి, దసళి, మల్బరీ పట్టు మన రాష్ట్రంలో ఉత్పత్తి అవుతుంది. మల్బరీ బహువార్షిక పంట, నీటి నిల్వలనే పొదుపుగా వాడుకొని ఎక్కువ లాభం పొందవచ్చు. ఎకరం మల్బరీ తోటలో ఉత్పత్తి చేసే పట్టుగూళ్ల ద్వారా ఎడాదికి రూ. 50వేల నుంచి లక్ష వరకు సంపాదించవచ్చు. దసలి పట్టు పరిశ్రమ రాష్ట్రంలోని మారమూల గిరిజన కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమ. మల్బరీ రైతులకు అదనపు ఆదాయానికి పట్టుపరిశ్రమతో పాటు పాడి పరిశ్రమ సేంద్రియ ఎరువుల ఉత్పత్తి చేయవచ్చు.

మల్బరీ ఆకు దిగుబడి పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలు

ఏడు రోజుల్లోపు కలుపు తీయడం, తగిన మోతాదులో పశువుల ఎరువు వేయడం, 15నుంచి 18 రోజుల్లో ఎకరానికి అమ్మోనియం సల్ఫేట్ 66కిలోలు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్44కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 12 కిలోలు, 18నుంచి 20 రోజుల్లోపు తుక్రా నివారణ డిడివిపి(2.5 మి.లీ ఒక లీటరుకు 0.5శాతం సబ్బు ద్రావణాన్ని 200 లీటర్లు పిచికారి చేయాలి. తుక్రా పీడిత కొమ్మలను కత్తిరించి తోటకు దూరంగా గోతిలో వేసి కాల్చి, పూడ్చివేయాలి. 22నుంచి 25 రోజుల్లోపు సెరి బూస్ట్ 2.5 మి.లీ లీటరు నీటితో కలిపి ఎకరానికి 250 లీటర్ల మిశ్రమ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. 29 నుంచి 32 రోజుల్లో సెరిబూస్ట్ రెండవ డోస్‌గా అదే మోతాదులో పిచికారీ చేయాలి.



యం. మదన్‌మోహన్‌రావు
అస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్
సెరికల్చర్ శాఖ

రైతుల సందేహాలు నిపుణుల సమాధానాలు

కందిలో ఆకుచుట్టూ పురుగు నివారణ ఎలా?

1. వేరుశనగలో లిక్కాకు మచ్చ తెగులు నివారణ చెప్పండి?

గణేష్, పెద్దముదాది గ్రా, మం, వనపర్తి జిల్లా

ఈ తెగులు పంట విత్తిన 30 రోజుల నుండి కనిపిస్తుంది. ఈ మచ్చలు కొంచెం గుండ్రంగా ఉండి, ఆకుపైభాగాన ముదురు గోధుమ రంగు కలిగి ఉంటాయి. ఆలస్యంగా వచ్చే మచ్చలు చిన్నవిగా గుండ్రంగా ఉండి ఆకు అడుగు భాగాన నల్లని రంగు కలిగి ఉంటాయి. నివారణకు ఎకరానికి కార్బెండజిమ్, మ్యాంకోజెబ్ 200గ్రా. లేదా క్లోరోథలోనిల్ 400గ్రా. 250 లీటర్ల నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

2. మినుములో పక్షికన్ను తెగులు నివారణ తెలపండి?

రవీందర్, సిర్‌పూర్ గ్రా, మం, కొమురంభీమ్ జిల్లా

ఈ తెగులు సోకిన ఆకులపై లేత పసుపు రంగు అంచులతో కూడిన చిన్నచిన్న గోధుమ రంగు మచ్చలు కనిపిస్తాయి. ఈ తెగులు నివారణకు మాంకోజెబ్ 25 గ్రా. లేదా హెక్సాకొనజోల్ 20 మి.లీ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి 3 గ్రా. చొప్పున 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

3. మిరపలో ఆకుముడత తెగులు (జెమినివైరస్) నివారణ చెప్పండి?

భాను, ముంగిమడుగు గ్రా,మహబూబ్‌నగర్ జిల్లా

ఇది తెల్ల దోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. తెగులు ఆశించిన మొక్కల ఆకులు చిన్నవిగా మారి పైకి ముడుచుకుని పడవ ఆకారంలోకి మారిపోతాయి. ఆకుల ఈనెలు ఆకుపచ్చగాను, ఈనెల మధ్య లేత ఆకుపచ్చగాను, పసుపు రంగు కలిగి ఉంటాయి. కణుపుల మధ్య దూరం తగ్గుతుంది. ఆకుల మీద బొబ్బలు ఏర్పడి ముడుకుంటాయి. నివారణకు ట్రైజోఫాస్ 200 మి.లీ లేదా థయోమిథాక్సాం 40 గ్రా. మందులను మార్చిమార్చి 10 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

4. కందిలో ఆకుచుట్టు పురుగు నివారణ చెప్పండి?

రాము, భీమని గ్రా, మం, మంచిర్యాల జిల్లా

కంది పెరిగే దశలో ఆకుచుట్టు పురుగు ఆశిస్తుంది. ఆకులను పూతను చుట్టగా చుట్టుకొని, లోపల ఉండి గీకి తింటాయి. దీని వల్ల ఆకులు తెల్లగా కనబడతాయి. నివారణకు మోనోక్రొటోఫాస లేదా క్వినాల్‌ఫాస్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

5 పాలకూర ఆకులపై ఎర్రటి మచ్చలు వస్తున్నాయి, నివారణ చెప్పండి?

ఎన్. సైదానాయక్, చిత్‌కూర్ గ్రా,మం, సూర్యాపేట జిల్లా

పాలకూర ఆకులపై సెర్కొస్పోరా శిలీంధ్రం ఎర్రటి గోధుమ రంగు మచ్చలుగా ఏర్పడి నష్టాన్ని కలిగిస్తాయి. ఈ తెగులు నివారణకు లీటరు నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2.5 గ్రా. మాంకోజెబ్ మందును కలిపి పిచికారీ చేయాలి. మందు పిచికారి చేసిన తర్వాత కనీసం 10 రోజుల వ్యవధి ఇచ్చి ఆకు కోయాలి.

వ్యవసాయ సూచనలు

వ్యవసాయం-వాతావరణం

గడిచిన మూడు రోజుల్లో రాష్ట్రంలో వాతావరణం ప్రధానంగా పొడిగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు 32-37 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 16-22 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం వారు అందించిన సమాచారం ప్రకారం రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో వాతా వరణం పొడిగా ఉండవచ్చు. పగటి ఉష్ణోగ్రతలు 28 నుంచి 38 డిగ్రీల సెల్సి యస్ మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 13 నుంచి 26 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదు అయ్యే అవకాశం ఉంది.

వరి: వరిలో కాండం తొలుచు పురుగు ఆశించ కుండా ముందు జాగ్రత్తగా నాటిన 15 నుంచి 20 రోజుల్లోపు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరానికి 10 కిలోల చొప్పున వేసుకోవాలి. వరిలో జింకు ధాతు లోపం గమనించినట్టయితే 2 గ్రా. జింక్ సల్ఫేట్ లీటరు నీటికి కలిపి 5 నుంచి 7 రోజుల వ్యవధిలో రెండు మూడు సార్లు పిచికారి చేయాలి.



మొక్కజొన్న: మొక్కజొన్నలో బెట్ట వాతావరణ పరిస్థితులలో పేనుబంక ఆశించే సూచనలున్నాయి. నివారణకు 2 మిల్లీలీటర్లు డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ లేదా 1.5 గ్రాముల ఎసిఫేట్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

వేరుశనగ: ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో ఆకు మచ్చ తెగులు, కాండం కుళ్లు వైరస్ తెగులు ఆశించుటకు అనుకూలం. అకుమచ్చ తెగులు నివారణ కు 2 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 1గ్రా. కార్బం డజిమ్ లేదా 2 గ్రా. క్లోరోథాలోనిల్ 2 మి.లీ హెక్సాకొనజోల్ మందు ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. కాండం కుళ్లు వైరస్ తెగుళ్ల నివారణకు ముందు జాగ్రత్తగా పంట పొలం, గట్లపై ఉన్న వయ్యారి భామ కలుపు మొక్కలను నిర్మూలించుకోవాలి. పొలం చుట్టూ 4 నుంచి 5 వరుసల్లో సజ్జ, జొన్న, మొక్కజొన్న పంటలను వేయడం వల్ల తామర పురుగులు పంటను ఆశించకుండా నివారించవచ్చు. పొగాకు లద్దె పురుగు గమనించినట్టయితే నివారణకు ఈ కింది సస్యరక్షణ పద్దతులు పాటించాలి. నివారణకు ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు పెట్టి అడుగు ఉధృతిని గమనించాలి. ఎకరానికి 10 నుంచి 20 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి. ఎకరానికి 4 చొప్పున లింగాకర్షక బుట్ట లను అమర్చాలి. లద్దె పురుగులు ఉన్న జల్లెడ ఆకు లను ఏరివేసి నాశనం చేయాలి. మొదటి దశలో ఉన్న లద్దె పురుగుల నివారణకు 1.6 మి.లీ మోనో క్రోటోఫాస్ లేదా 2 మి.లీ క్వినాల్ఫాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. బాగా ఎదిగిన లద్దె పురుగుల నివారణకు విషపు ఎరలను (5 కిలోల తవుడు, 500గ్రా. కార్బరిల్ మందును కలిపి తయారు చేసి సాయంత్రం పూట పొలంలో చల్లాలి.

మిరప: ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులు కానోఫోరా కొమ్మ కుళ్లు తెగులు, బూడిద తెగులు, తామర పురుగులు సోకుటకు అనుకూలం. నివారణకు కానోఫోరా కొమ్మకుళ్లు తెగులుకు 30 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్, 1 గ్రా. ప్లాంటామైసిన్ మందును 10 లీటర్ల నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి. బూడిద తెగులుకు 3 గ్రా. నీటిలో కరిగే గంధకం లేదా 1 గ్రా. మి.లీ కారాథీన్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. తామర పురుగుల నివారణకు 1.5 గ్రా. అసిపిట్ లేదా 2 మి.లీ ఫిప్రోనిల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

మామిడి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మామిడిలో తేనె మంచు పురుగులు, పక్షి కన్ను తెగులు, బూడిద తెగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ 1 గ్రా. కార్బండజిమ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. బూడిద తెగులుకు 3గ్రా. నీటిలో కరిగే గంధకం లేదా 1 మి.లీ కారాతేన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

పశుపోషణ: గొర్రెలలో చిటుకు, మశూచి వ్యాధి, అవులు, బర్రెల్లో గొంతువాపు వ్యాధి, ఆవులు, ఆంబోతులలో జబ్బవాపు వ్యాధి సోకేందుకు అనుకూలం కనుక వీటి నివారణకు టీకాలు వేయించాలి.



కామన్‌వెల్త్‌కు మేరి

న్యూఢిల్లీ : కామన్‌వెల్త్ క్రీడలకు బాక్సింగ్‌లో భారత్ తరపున బరిలో దిగేందుకు దిగ్గజ బాక్సర్ మేరికోమ్ సహా వికాస్ కృష్ణన్, సర్జుబాలాదేవి ఎంపికయ్యారు. సాంప్రదాయ అర్హత పరీక్షలు (ట్రయల్స్) నిర్వహించకుండా చేసిన సెలక్షన్‌లో ప్రపంచ స్థాయి పోటీల్లో మెడల్స్ గెల్చిన గౌవర్ బిదూరి, శివ థాపాలకు చోటు దక్కలేదు. 2015 ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య విజేత శివథాపా స్థానంలో ఇండియా ఓపెన్ స్వర్ణ విజేత మనీష్ కౌశిక్ 60 కిలోల విభాగంలో కామన్‌వెల్త్ గేమ్స్‌కు ఎంపికయ్యాడు. 56 కిలోల విభాగంలో ఇటీవల ముగిసిన స్ట్రాంజ స్మారక బాక్సింగ్‌లో కాంస్యం నెగ్గిన మొహమ్మద్ హుసాముద్దీన్‌కు చోటు దక్కింది. దీంతో గతేడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య విజేత బిదురికి నిరాశే మిగిలింది. పురుషుల విభాగాల్లో 91, 52 కిలోల విభాగాల్లో మాత్రమే మార్చి తొలి వారంలో ట్రయల్స్ నిర్వహించనున్నట్టు సమాచారం.



- 2019 దాకా రిటైర్మెంట్ యోచన లేదన్న యువరాజ్ సింగ్

రెండేండ్ల తర్వాతే..

న్యూఢిల్లీ : టీమిండియా ప్రపంచకప్‌ల హీరో యువరాజ్‌సింగ్ కెరీర్‌పై క్లారిటీనిచ్చాడు. మరో రెండేండ్ల దాకా రిటైర్మెంట్ ఆలోచన లేదని తెలిపాడు. 2019 తర్వాత క్రికెట్‌కు గుడ్‌బై చెప్పటంపై ఓ నిర్ణయానికి వస్తానన్న సిక్సర్ల హీరో.. అప్పటివరకూ వీలైనంత మటుకు క్రికెట్ ఆడతానని అన్నాడు. గతేడాది జూన్‌లో చివరిసారిగా యువీ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఏప్రిల్‌లో ప్రారంభమయ్యే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నాడు. దానితో భారత టీ20 జట్టులో స్థానం దక్కించుకోవాలన్నది యువీ ఆలోచన. ఇక 2019లో ఇంగ్లాండ్‌లో ఐసీసీ ప్రపంచ కప్ జరుగనున్న నేపథ్యంలో ప్రపంచకప్‌లో ఆడే అవకాశం కోసం యువీ ఇప్పటినుంచే ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నాడు. మొనాకో (ఫ్రాన్స్)లో జరిగిన లారెస్ వరల్డ్ స్పోర్ట్స్ అవార్డు వేడుకలకు హాజరైన యువీ.. పాత్రికేయులతో మాట్లాడారు.

'2019 వరకు క్రికెట్ ఆడాలంటే ఐపీఎల్‌లో ఆడటం నాకు తప్పనిసరి. కాబట్టి ఈ ఏడాది ఐపీఎల్ నా కెరీర్‌కు కీలకం. బాగా ఆడాలనుకుంటున్నా. కనీసం ఇంకో రెండేండ్లు ఆడాలన్నదే నా ఆశ. 2019 తర్వాత కచ్చితంగా కెరీర్‌కు ముగింపు పలకటంపై నిర్ణయం తీసుకుంటా. ఇప్పుడు నా ప్రదర్శనను బట్టే అవకాశాలుంటాయి. దాన్ని బట్టి వీడ్కోలు గురించి ఆలోచిస్తా' అని తెలిపాడు. ఐసీసీ 2011 ప్రపంచకప్ వరకు నిలకడగా ఆడాడు యువీ. తనదైన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో పరిమిత ఫార్మాట్ల జట్లలో స్థానం పదిలపర్చుకున్నాడు. అయితే టెస్టుల్లో మాత్రం అతనికి అంతగా అవకాశాలు రాలేదు. 'కెరీర్ తొలినాళ్లలో నేను అత్యుత్తమంగా ఆడాను. అయితే నాకు తగిన అవకాశాలు రాలేదు. దానికి కారణం లేకపోలేదు. హేమాహేమీలైన ఆటగాళ్లు టెస్టు జట్టులో ఉన్నారు. సీనియర్లు విశ్రాంతి తీసుకుని నాకు అవకాశాలు వచ్చే సమయానికి క్యాన్సర్ బారిన పడ్డాను. ఆ విషయంలో బాధ ఉన్నది కానీ, అది మన చేతుల్లో లేని విషయం' అని యువీ అన్నాడు.

టీమ్ ఇండియా ప్రస్తుత కెప్టెన్ విరాట్ కోహ్లిని యువీ పొగడ్తల్లో ముంచెత్తాడు. దక్షిణాఫ్రికా పర్యటనలో జట్టు ప్రదర్శనపై.. ప్రత్యేకించి అసాధారణ రీతిలో స్పిన్నర్లు చెలరేగటంపై యువీ ఆనందం వెలిబుచ్చాడు. 'సఫారీ సిరీస్‌లో టీమిండియా గొప్పగా ఆడింది. టెస్టు సిరీస్‌లో పోరాడి ఓడినా ఆపై పరిమిత ఓవర్ల సిరీస్‌లలో అదరగొట్టింది. కీలక సమయాల్లో మెరుగైన ఇన్నింగ్స్‌తో కోహ్లి జట్టును ముందుండి నడిపించాడు. స్పిన్నర్లు యజువేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్ తమ మణికట్టు మాయజాలంతో ప్రత్యర్థులను వన్డేల్లో ఇబ్బంది పెట్టారు. అదే జోరుతో పొట్టి సిరీస్‌నూ గెలిచేశారు. ఉపఖండం ఆవల మూడింట రెండు సిరీస్‌లు నెగ్గటం జట్టు ఆధిపత్యానికి, ఆత్మవిశ్వాసానికి నిదర్శనం.' అని యువీ తెలిపాడు. రానున్న విదేశీ పర్యటనల్లో గెలుపు మీద దృష్టి పెట్టటం కన్నా ఆటగాళ్లు వ్యక్తిగతంగా మెరుగ్గా, నిలకడతో ఆడటానికి ప్రయత్నించాలని యువీ సూచించాడు. 'విదేశాల్లోనూ ఆధిపత్యం చలాయించగలం అన్న ఆత్మ విశ్వాసం మంచిదే. అదే నమ్మకంతో నిలకడైన ఆటతీరు కనబరిస్తే.. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లోనే కాదు ప్రపంచంలోనే ఎక్కడైనా మనం విజయాలు సాధించగలం అన్న విశ్వాసం ఆటగాళ్లకు కలుగుతుంది. అప్పుడు ప్రపంచాన్ని జయించగలం.' అని యువీ అభిప్రాయపడ్డాడు.

అండర్-19 స్థాయి నుంచే రాణిస్తూ టీమ్ ఇండియాకు ప్రాతినిధం వహించే దిశగా ఎదిగిన యువీ.. తాజా అండర్ 19 ప్రపంచ కప్‌లో మెరిసిన యువ ఆటగాళ్లనుద్దేశించి మాట్లాడుతూ 'వారు ఎంత బాగా ఆడితే అంత ఎక్కువగా సంపాదించుకోగలరు. డబ్బు గురించి ఆలోచించొద్దు. మెరుగ్గా ఆడితే దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం త్వరలోనే అందుకుంటారు. పృథ్వీ, శుభమన్, అభిషేక్ శర్మ నైపుణ్యం గల ఆటగాళ్లు. వీరు కచ్చితంగా దేశం కోసం ప్రధాన జట్టులో ఆడతారు. ఐపీఎల్‌లో కుర్రాళ్లు.. అనుభవజ్ఞులైన స్వదేశీ, విదేశీ ఆటగాళ్లతో ఆడటం వారికి కలిసొచ్చే అంశం. కాబట్టి టోర్నమెంట్‌లో వీలైనంతగా నేర్చుకునే ప్రయత్నం చేయాలి. తమ ఆటను సానబెట్టుకోవడానికి లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి' అని యువీ ముగించాడు.



బుమ్రాకు భారం తగ్గిస్తాం

- చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్

న్యూఢిల్లీ : టెస్టుల్లో అరంగేట్రం చేసి, సఫారీ గడ్డపై అదరగొట్టిన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు పనిభారం తగ్గించనున్నట్టు జాతీయ సెలక్షన్ కమిటీ చైర్మెన్ ఎమ్మెస్కే ప్రసాద్ తెలిపారు. దక్షిణాఫ్రికా పర్యటనలో టెస్టు తీర్థం పుచ్చుకున్న బుమ్రా మూడు సిరీస్‌ల్లోనూ ఆడాడు. మొత్తంగా 162.1 ఓవర్లు బౌలింగ్ చేసిన బుమ్రా కేవలం టెస్టుల్లోనే 112.1 ఓవర్లేశాడు. 'బుమ్రా ప్రదర్శన సంతృప్తికరంగా ఉన్నది. రంజీల్లో గుజరాత్ తరపున రాణించిన అతడు టీమ్ ఇండియాకు బలమైన పేస్ అస్త్రం. బుమ్రాది అరుదైన బౌలింగ్ శైలి. అతడు భవిష్యత్‌లో మరింత అంతర్జాతీయ క్రికెట్ ఆడాల్సి ఉన్నది. అంచేత అతని పనిభారాన్ని తగ్గించటంపై సమీక్ష చేస్తున్నాం. కీలకమైన సిరీస్‌లకు మినహా అతన్ని వినియోగించుకోవద్దని అనుకుంటున్నాం.' అని ప్రసాద్ తెలిపారు. స్పిన్నర్ల గురించి మాట్లాడుతూ..'మూడు ఫార్మట్లలోనూ రాణించే ఐదుగురు స్పిన్నర్లు మనకున్నారు. రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్, అక్షర్ పటేల్‌లతో కూడిన నాణ్యమైన స్పిన్ బృందం కల్గి ఉండటం సంతోషకరం. ప్రత్యేకించి మణికట్టు స్పిన్నర్లు సఫారీ పర్యటనలో అబ్బురపరిచారు.' అని పేర్కొన్నారు.



స్టోక్స్ 63*

చెలరేగిన స్టోక్స్

- కివీస్‌పై ఆరు వికెట్ల తేడాతో ఇంగ్లాండ్ విజయం

న్యూఢిల్లీ : వివాదాల నడుమ చిక్కుకొని, క్లీన్ చిట్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో పునరాగమనం చేసిన ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బెన్‌స్టోక్స్.. న్యూజిలాండ్‌తో రెండో వన్డేలో మెరిశాడు. రెండు వికెట్లు తీసిన స్టోక్స్ కెరీర్‌లో 11వ అర్ధ శతకం సైతం అందుకున్నాడు. తొలి వన్డేలో రెండంకెల స్కోరు చేయగానే వికెట్ కోల్పోయిన స్టోక్స్ రెండో వన్డేలో ఫామ్‌లోకొచ్చాడు. స్టోక్స్ (63 నాటౌట్, 74 బంతుల్లో 7 ఫోర్లు 1 సిక్స్) సహా ఇయాన్ మోర్గాన్ (62, 63 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సులు) హాఫ్ సెంచరీలతో రాణించటంతో కివీస్‌తో రెండో వన్డేలో ఇంగ్లాండ్ ఆరు వికెట్ల తేడాతో గెలుపొందింది. ఐదు మ్యాచుల వన్డే సిరీస్‌లో 1-1తో నిలిచింది. టాస్ నెగ్గి బౌలింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్.. కివీస్‌ను మరో రెండు బంతులు మిగిలుండగానే 223 పరుగులకే ఆలౌట్ చేసింది. బెన్ స్టోక్స్, మోయిన్ అలీ, క్రిస్ వోక్స్ తలా రెండు వికెట్లు తీసుకున్నారు. ఇంగ్లాండ్ 37.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. స్టోక్స్, మోర్గాన్ సహా జానీ బెయిరిస్టో (37), జోస్ బట్లర్ (36 నాటౌట్) రాణించారు. కివీ బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్ రెండు వికెట్లు పడగొట్టగా.. ఫెర్గుసన్, కొలిన్ మున్రో చెరో వికెట్ తీసుకున్నారు.

దక్షిణాఫ్రికాతో భారత్ తొలి పోరు

- హాకీ ప్రపంచ కప్ షెడ్యూల్ విడుదల



న్యూఢిల్లీ : హాకీ మహా సంగ్రామానికి ప్రణాళిక సిద్ధమైంది. ఈ ఏడాది నవంబర్‌లో జరుగనున్న పురుషుల హాకీ ప్రపంచ కప్ షెడ్యూల్‌ను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) విడుదల చేసింది. భువనేశ్వర్‌లో నవంబర్ 28 నుంచి డిసెంబర్ 16వ తేదీ వరకు ప్రపంచ కప్ పోటీలు జరుగనున్నాయి. కాగా ప్రతిష్ఠాత్మక ఈవెంట్ ఏర్పాట్లు ఇదివరకే మొదలయ్యాయి. భువనేశ్వర్‌లోని కలింగ స్టేడియంలో పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. ప్రపంచ కప్ కోసం పోటీపడే 16 దేశాలను నాల్గు పూల్స్‌గా విభజించారు. బెల్జియం, కెనడా, దక్షిణాఫ్రికాలతో ఆతిథ్య భారత్ పూల్ పోరు చేయనున్నది. నవంబర్ 28 నుంచి డిసెంబర్ 9 వరకు రోజుకు రెండు చొప్పున పూల్ మ్యాచులు జరుగుతాయి. డిసెంబర్ 12, 13వ తేదీలలో క్వార్టర్ ఫైనల్స్, ఆపై వరుస రోజుల్లో సెమీ ఫైనల్స్, టైటిల్ పోరు జరుగుతాయి. భారత కాలమానం ప్రకారం తొలి మ్యాచ్ సాయంత్రం 5 గంటలకు, రెండోది సాయంత్రం 7 గంటలకు మొదలౌతుంది. భారత్ తొలి పూల్ గేమ్‌లో దక్షిణాఫ్రికాతో తలపడనుండగా, టోర్నమెంట్‌లో తొలి మ్యాచ్ పూల్ 'సి' లోని బెల్జియం, కెనడాల మధ్య జరుగనున్నది. పూల్ డిలో మాజీ ప్రపంచ చాంపియన్స్ జర్మనీ, పాకిస్థాన్‌ల పోరు సహ పలు మ్యాచులు హాకీ అభిమానుల దృష్టిని ఆకర్షించనున్నాయి.

ఏ పూల్‌లో ఏయే దేశాలు

పూల్ ఏ : అర్జెంటీనా, న్యూజిలాండ్, స్పెయిన్, ఫ్రాన్స్
పూల్ బి : ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, ఐర్లాండ్, చైనా
పూల్ సి : బెల్జియం, భారత్, కెనడా, దక్షిణాఫ్రికా
పూల్ డి : నెదర్లాండ్స్, జర్మనీ, మలేసియా, పాకిస్థాన్



దావిందర్‌పై డోప్ నిషేధం

న్యూఢిల్లీ : భారత టాప్ జావెలిన్ త్రో అథ్లెట్ దావిందర్ సింగ్‌కాంగ్‌పై ప్రపంచ అథ్లెటిక్స్ పాలక సంఘం నాలుగేండ్ల నిషేధం విధించింది. గతేడాది నవంబర్‌లో అథ్లెటిక్ ఇంటిగ్రిటీ విభాగం (ఏఐయూ) నిర్వహించిన డోప్ పరీక్షల్లో దావీందర్ నిషేధిత ఉత్ప్రేరకాన్ని తీసుకున్నట్టు ప్రాథమిక విచారణలో తేలింది. ఏఐయూ నిర్వహించిన డోప్ పరీక్షల్లో విఫలమైన తొలి భారత అథ్లెట్ దావిందర్. దీంతో ఏప్రిల్‌లో జరుగనున్న గోల్డ్‌కోస్ట్ కామన్‌వెల్త్ గేమ్స్‌కు దావిందర్ దూరం కానున్నాడు.

క్రీడల పట్ల ఆదరణేదీ?

"తెలంగాణ క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటాం. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఆర్థిక సహకారం అందిస్తూ సమర్థవంతమైన శిక్షణ అందిస్తాం. జిల్లాకేంద్రాల్లో ఎక్సలెంట్ స్పోర్ట్స్ అకాడమీలతో పాటు, మండల కేంద్రాల్లో మల్టీపర్పస్ స్పోర్ట్స్ స్టేడియాలను ఏర్పాటు చేస్తాం..." ఇదీ తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్ఎస్)-2014 ఎన్నికల మానిఫెస్టో దీన్నిఅమలు పరిచేందుకు గడిచిన నాలుగేండ్లలో ఏనాడూ రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. ప్రతిఏటా ఇస్తున్న నిధులనూ తగ్గిస్తూ వస్తున్నది. మరీ ఎన్నికల బడ్జెట్‌గా పేర్కొంటున్న 2018-19 బడ్జెట్‌లోనైనా క్రీడల అభివృద్ధికి నిధులు కేటాయిస్తారో లేదోనని క్రీడాకారులు ఎదురుచూస్తున్నారు.



ప్రతిఏటా తగ్గుతున్న బడ్జెట్

- భారీగానే ప్రతిపాదనలు పంపిన సాట్స్
- ఆశగా ఎదురుచూస్తున్న మినీస్టేడియాలు!

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో క్రీడల అభివృద్ధి కోసం చెప్పిన ఏ ఒక్క అంశమూ అమలు కావడం లేదు. మండలస్థాయిలో మల్టీపర్పస్ స్పోర్ట్స్ స్టేడియాలు నిర్మిస్తామని చెప్పినా, జిల్లా స్థాయిల్లోనే ఆ హామీ అమలు కావడం లేదు. జిల్లా కేంద్రాల్లో ఎక్సలెంట్ స్పోర్ట్స్ అకాడమీలు ఏర్పాటు చేస్తామని చెప్పినా, కొన్ని కొత్త జిల్లా కేంద్రాల్లో ఇప్పటికీ మాములు స్టేడియాలు కూడా లేకపోవడం గమనార్హం. తెలంగాణలో ప్రస్తుతం 28 మినీ స్టేడియాలున్నాయి. 31జిల్లాల్లోని 119 నియోజకవర్గాల పరిధిలో 144 మినీస్టేడియాలను నిర్మించేందుకు ప్రభుత్వం గతంలో అనుమతించింది. రూ.2.65కోట్లతో ఒక్కో స్టేడియం నిర్మించాలని నిర్ణయించి, అన్నింటికీ కలిపి రూ.280.5 కోట్లు అవసరమని ప్రభుత్వానికి క్రీడాశాఖ నివేదిక పంపించింది. కానీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం కేవలం రూ. పదికోట్లు మాత్రమే కేటాయించింది. అయితే గత ప్రభుత్వంలో ప్రారంభమైన స్టేడియాల నిర్మాణం ఇప్పటికీ కొనసాగుతుండటం గమనార్హం.

క్రీడలకు ప్రోత్సాహం కరువు..

గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు మండలస్థాయిలో క్రీడోత్సవాలు నిర్వహిస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఆ హామీ అమలు కావడం లేదు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆటలకూ కనీసం క్రీడాశాఖ సహాయం అందించడం లేదు. మండల, డివిజన్, జిల్లా స్థాయి క్రీడల నిర్వహణకూ ప్రభుత్వం నిధులు కేటాయించక పోవడంతో చందాలతో వాటిని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లోనూ సమస్యలు ఉన్నాయి. వాటి పరిష్కారానికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాల్సి ఉంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులకు నెలనెలా ఇచ్చే ప్రోత్సాహకం చాలా తక్కువగా ఉంది. దీన్ని పెంచాల్సిన అవసరం ఉందని క్రీడాకారులు కోరుతున్నారు. పలు క్రీడల ప్రోత్సాహకానికి గానూ పలు అకాడమీలను ఏర్పాటు చేయాలని క్రీడాశాఖ భావిస్తున్నది.

తెలంగాణలో నిధులు తగ్గుదల...

క్రీడల అభివృద్ధిలో తెలంగాణ ప్రభుత్వం పెద్దగా దృష్టిసారించడం లేదు. గడిచిన నాలుగేండ్లలో ప్రతి ఏటా ఆ శాఖకు ఇస్తున్న నిధులు తగ్గిస్తూనే ఉన్నది. 2014-15లో రూ.వందకోట్లు కేటాయిస్తే, ఈ సంవత్సరం రూ.54.73కోట్లకు తగ్గిపోయింది. దీనిలో సగానికి పైగా నిధులు ఉద్యోగులు, సిబ్బంది జీతాలకే ఖర్చు అవుతున్నాయి. 2018-19 సంవత్సరంలోనైనా అధిక నిధులు సాట్స్ అధికారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వానికి సాట్స్ చైర్మెన్ వెంకటేశ్వర్‌రెడ్డి రూ.650కోట్ల ప్రతిపాదనలు చేశారు. అయితే దీన్ని ఆర్థికశాఖ తిప్పిపంపడంతో, ప్రస్తుతం రూ.250కోట్ల ప్రతిపాదనలు పంపినట్టు సమాచారం. అయితే ఈ నిధులు కూడా కేటాయిస్తారనే నమ్మకం కూడా లేదు. వివిధ క్రీడల్లో శిక్షణ ఇవ్వడానికి కాంట్రాక్టు పద్ధతిలో 200 మంది కోచ్‌లను నియమించాలని సాట్స్ బోర్డు నిర్ణయించింది. బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తేనే వారి నియామకం ఉంటుంది. ఈసారి బడ్జెట్‌లోనైనా ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి, క్రీడల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు.

క్రీడాశాఖకు కేటాయించిన నిధులు

ఆర్థిక సంవత్సరం	బడ్జెట్ (కోట్లలో)
2014-15	100.59
2015-16	69.47
2016-17	63.78
2017-18	54.73



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.